RNI NO. TELTEL/2021/81092 Published from Jagtial Email: prajamantalu@gmail.com



# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

సంపుటి (Volume) : 3 పేజీలు - 8

సంచిక (Issue) : 270 వెల - రూ 5:00

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు prajamantalu.com

బుధవారం 08, ఫిబ్రవరి 2023

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak, Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri Bhuvanagiri,


## దమ్ముంటే రాజీనామా చెయ్..!

### పొంగులేటికి మంత్రి పువ్వాడ సవాల్





ఖమ్మం,ఫిబ్రవరి7(ప్రజామంటలు): దమ్ముంటే తనను బీఆర్ఎస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయాలన్న పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వ్యాఖ్యలపై మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఘాటుగా స్పందించారు. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి దమ్ముంటే బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేయాలి అని పువ్వాడ అజయ్ సవాల్ విసిరారు. ఖమ్మం జిల్లా వైరా ఎమ్మెల్యే రాములు నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో పువ్వాడ పాల్గొని ప్రసంగించారు. బీఆర్ఎస్ పార్టీ బీ ఫామ్ ద్వారా గెలిచి పొంగులేటికి వంత పాడుతున్న నేతలంతా తక్షణమే రాజీనామా చేయాలి అని మంత్రి డిమాండ్ చేశారు. లేదంటే పార్టీ క్రమశిక్షణా చర్యలు తప్పవు అని స్పష్టం చేశారు. బీఆర్ఎస్‌లో ఉన్న వారంతా కేసీఆర్‌కు విధేయులే. నా బ్రాండ్ నా గ్రూప్ అంటే కుదరదు అని పువ్వాడ తేల్చిచెప్పారు. బీఆర్ఎస్ పార్టీ, కేసీఆర్.. పొంగులేటి లాంటి వ్యక్తులను రాష్ట్రంలో ఎంతో మందిని చూశారు.

మిగతా... 2లో



## హృదయ విదారకంగా టర్కీ, సిరియాలు

- అంతకంతకూ పెరుగుతున్న మృతుల సంఖ్య
- సహాయక చర్యలకు ప్రతిబంధకంగా మారిన పరిస్థితులు
- ఇరు దేశాల్లో 4,500కు పైగా భూకంప మృతుల సంఖ్య

న్యూఢిల్లీ,ఫిబ్రవరి7(ప్రజామంటలు): యావత్ ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురిచేసేలా టర్కీ, సిరియాల్లో సంభవించిన భూకంపంలో మృతుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. ఇరు దేశాల్లో మృతుల సంఖ్య ఇప్పటి వరకు 4,500కు పైగా చేరిందని అక్కడి మీడియా సంస్థల ద్వారా తెలుస్తోంది. భారీ భూకంపాల ధాటికి టర్కీ, సిరియా అతలాకుతలమయ్యాయి. పేక మేడల్లా కూలిన భారీ భవనాల కింద ఉన్న మృతదేహాలను బయటకు వెలికితీస్తున్నారు. సోమవారం ఒక్కరోజే

మిగతా... 2లో



## పేదలందరికీ ఇళ్లు కట్టిస్తాం..

- వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే
- ఇళ్ళ నిర్మాణానికి ఒక్కొక్కరికి 5 లక్షలు
- రెండోరోజు పాదయాత్రలో రేవంత్ హామీలు

ములుగు,ఫిబ్రవరి7(ప్రజామంటలు): జనవరిలో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తుందని టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. పేదలందరికీ ఇల్లు ఇస్తాం .. ఇళ్ళ నిర్మాణానికి ఒక్కొక్కరికి 5 లక్షలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. పాదయాత్రలో భాగంగా వెంకటాపురం మండలం కేశవాపూర్‌లో వరి, మిర్చి తోటలో పనిచేస్తున్న మహిళా కూలీలు, రైతులను కలిసి వారి సమస్యలు రేవంత్ రెడ్డి అడిగి తెలుసు కున్నారు. పంట గిట్టుబాటు గురించి అడిగి తెలుసు కున్నారు. అలాగే కూలీలతో కలిసి కాసేపు రేవంత్ మిర్చి తెంపారు. రైతు కూలీలు తెచ్చుకున్న సద్ది లోంచి రేవంత్, సీతక్కకు, మల్లు రవిలకు అన్నం ముద్దలు కలిపి పెట్టారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడారు. ప్రభుత్వం వస్తేనే పేదలకు న్యాయం చేసేందుకు సాధ్యమౌతుందని వారిని సూచించారు. కాంగ్రెస్ ను గెలిపించేందుకు

మిగతా... 2లో

## నలుదిశలా హైదరాబాద్

# నగర అభివృద్ధి

## పాతబస్తీ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం..

### నగరం నలుదిశలా విస్తరించేలా ప్రణాళికలు

### ఉన్నస్థాయి సమీక్షలో మంత్రి కెటిఆర్ వెల్లడి

హైదరాబాద్,ఫిబ్రవరి7(ప్రజామంటలు): పాతబస్తీ అభివృద్ధిపై పురపాలక శాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. నగర అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం తొలి నుంచి పాటుపడుతుందని, ఇప్పటికే హైదరాబాద్ నగరం నలుదిశలా విస్తరిస్తూ అద్భుతమైన ప్రగతితో ముందుకుపోతున్నదన్నారు. ప్రాంతాలు, పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేసుకుంటూ ముందుకెళు తున్నామని స్పష్టం చేశారు. హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ కార్యాలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో హెూంశాఖ మంత్రి మహమూద్ అలీ, ఎంఐఎం నేత అక్బరుద్దీన్ ఒవైసీ, చేవెళ్ల ఎంపీ రంజిత్ రెడ్డి, సీఎస్ శాంతి కుమారి, మున్సిపల్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ అరవింద్ కూమార్, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, జలమండలి, విద్యుత్ శాఖతో పాటు జిల్లా కలెక్టర్, వివిధ శాఖలకు



సంబంధించిన ఉన్నతాధికారులు హాజరయ్యారు. పాతబస్తీలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన వివరాలను అధికారులు సమావేశంలో అందజేశారు. జీహెచ్ఎంసీ చేపట్టిన ఎస్ఆర్‌డీపీ కార్యక్రమంలో భాగంగా పాతబస్తీలోనూ భారీగా రోడ్డు నెట్వర్క్ బలోపేతానికి సంబంధించిన కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని, ఇందులో ఇప్పటికీ

మిగతా... 2లో



## నగరంలో రోడ్డెక్కిన డబుల్ డెక్కర్ బస్సులు

### జెండా ఊపి ప్రారంభించిన కెటిఆర్

హైదరాబాద్,ఫిబ్రవరి7(ప్రజామంటలు): హైదరాబాద్‌లో డబుల్ డెక్కర్ బస్సులు రోడ్డెక్కాయి. మూడు ఎలక్ట్రిక్ డబుల్ డెక్కర్ బస్సులను మంత్రి కేటీఆర్, సీఎస్ శాంతి కుమారితో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్ కుమార్, ఎంపీ రంజిత్ రెడ్డి, ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ పాల్గొన్నారు. ఈ నెల 11 నుంచి నెలకెస్ రోడ్, ప్యారడైజ్, నిజాం కాలేజ్ ఏరియాల్లో ఇవి తిరగనున్నాయి.మొత్తం 6 ఎలక్ట్రిక్ డబుల్ డెక్కర్ బస్సుల కోసం హెచ్ఎండీఏ ఆర్డర్ ఇవ్వగా ప్రస్తుతం 3 బస్సులు అందుబాటులోకి వచ్చాయి. త్వరలో మిగిలిన 3 బస్సులు కూడా అందుబాటులోకి వస్తాయని అధికారులు తెలిపారు. ఈ బస్సులు ఒక్కసారి చార్జ్ చేస్తే 150 కిలోమీటర్ల వరకు వెళ్తుంది.



## బిసిలకు అండగా కెసిఆర్

- బిసిల ఆత్మగౌరవాన్ని నిలిపేలా భవనాలు
- బిసిలంతా కెసిఆర్‌కు అండగా నిలవాలి
- దేశంలో ఎక్కడా లేనివిధంగా బిసిలకు అండ
- ఆత్మగౌరవ భవనాలకు శంకుస్థాపనలో మంత్రులు

రంగారెడ్డి,ఫిబ్రవరి7(ప్రజామంటలు): ప్రజల గురించి అనునిత్యం ఆలోచించే బీఆర్ఎస్ ప్రభుత్వ పనితీరును గమనించాలని రాష్ట్ర పశు సంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. రాష్ట్రంలో వెనుకబడిన తరగతుల అభ్యున్నతికి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని అన్నారు. రంగారెడ్డి జిల్లా కోకాపేటలో బీసీల ఆత్మగౌరవ భవనాలకు మంత్రులు గంగుల కమలాకర్, శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పిల్లల చదువుల కోసం గురుకులాలు, ఆడబిడ్డల పెండ్లిండ్ల కోసం కల్యాణలక్ష్మి, కుల సంఘాలకు ఆత్మగౌరవ భవనాలు తదితర సౌకర్యాల న్నింటిని సీఎం కేసీఆర్ కల్పిస్తున్నారని పేర్కొన్నారు. దేశంలో భగ వంతుడి పేరు మీద రాజకీయాలు నడి పించే వారిని నమ్మవద్దని అన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా 24గంటల కరెంట్ తెలంగాణ ప్రభుత్వం ఇస్తుందని

మిగతా... 2లో



## బడ్జెట్‌ను చూసి... నవ్వుకుంటున్న జనం

- ఎక్కడా ప్రజల్లో దీనిపై కానరాని చర్చ
- 1.30 లక్షల ఆదాయం ఉంటే.. రూ.2.9 లక్షల కోట్ల బడ్జెట్ ఎలా సాధ్యం?
- బీజేపీ శిక్షణ తరగతులను ప్రారంభించిన బండి సంజయ్

రంగారెడ్డి,ఫిబ్రవరి7(ప్రజామంటలు): బడ్జెట్‌ను చూసి జనం నవ్వు కుంటున్నారని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అన్నారు. ప్రజల్లో బడ్జెట్‌పై చర్చ లేదు. మాటలు తప్ప చేతల్లేవు. కేటాయింపులు ఘనం..ఖర్చులు స్వల్పం. రూ.2.9 లక్షల కోట్ల బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ప్రభుత్వం ఆదాయం మాత్రం రూ. 1.30 లక్షల కోట్లే చూపడమా? మిగిలిన ఆదాయం ఎక్కడి నుండి వస్తుందో ఎందుకు చెప్పలేదన్నారు. మన్నెగూడలో మంగళవారం

మిగతా... 2లో

## అదానీ స్కాం...మోడీ మౌనం

### అదానీ ఆస్తులు పెరగడంలో ప్రధాని పాత్ర


- 2014 నుంచి నేటి వరకు భారీగా పెరిగిన ఆస్తులు
- మోడీతో కలిసి ప్రయాణిస్తున్న అదానీ
- అనుభవం లేకున్నా ఎయిర్‌పోర్టు పనులు
- పార్లమెంట్ వేదికగా తూర్పారా బట్టిన రాహుల్



న్యూఢిల్లీ,ఫిబ్రవరి7(ప్రజామంటలు):అదానీ ఆస్తులపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ పార్లమెంట్‌లో ప్రశ్నల వర్షం కురిపించారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానం సందర్భంగా ఆయన మాట్లా డుతూ.. ప్రస్తుతం అదానీ సుమారు 10 రంగాల్లో వ్యాపారం చేస్తున్నారని, మరి 2014 నుంచి 2022 వరకు ఆయన ఆస్తులు 8 బిలియన్ల డాలర్ల నుంచి 140 బిలియన్ల డాలర్లకు ఎలా వెళ్లాయని యువత అడుగుతున్నారని ప్రశ్నించారు. భారత్ జోడో యాత్ర సమయంలో వివిధ రాష్ట్రాల ప్రజలు ఈ ప్రశ్నలు వేసినట్లు ఆయన తెలిపారు. తమిళనాడు, కేరళ నుంచి హిమాచల్ ప్రదేశ్ వరకు అంతటా ఒక్కటే పేరు వినిపిస్తోందని, అంతటా అదానీ పేరే వినిపిస్తోందని

మిగతా... 2లో

## ప్రజానాడి






## పాతసీసాలో కొత్త సారా... పోసినట్టుగా బడ్జెట్

- గతేడాది బడ్జెట్ కాపీనే కొత్తగా దించేశారు
- కేటాయింపులకు..ఖర్చులకు పొంతన లేదు
- పలు ప్రాజెక్టులను పూర్తి చేయకుండా విస్మరించారు
- మండిపడ్డ వైఎస్ షర్మిల

వరంగల్,ఫిబ్రవరి7(ప్రజామంటలు): తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ కొత్త సీసాలో పాత సార పోసినట్లు ఉందని వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు షర్మిల ఎద్దేవ చేశారు. ప్రజాప్రస్థానం పాదయాత్రలో

మిగతా... 2లో

## 'దళితబంధు' పథకం దక్కేదెవరికో...?

- అనుచరుల కోసం ఎమ్మెల్యేల కసరత్తు
- నియోజకవర్గ స్థాయిలో చాంతాడంత జాబితాలు




హైదరాబాద్,ఫిబ్రవరి7(ప్రజామంటలు): ప్రభుత్వం దళితబంధు పథకాన్ని ప్రతి ష్ఠాత్మకంగా చేపట్టింది. తాజాగా దళితబంధు కోసం రూ.17,700 కోట్లు బడ్జెట్‌లో కేటాయించింది. నియోజక వర్గానికి కొందరు నిరుపేద దళితులను ఎంపిక చేసి పథకం కింద ఆర్థిక సాయం అందిస్తారు. అయితే ఇక్కడే చిక్కు వచ్చి పడింది. ఇప్పుడు దళితులంతా ఈ పథకం కింద తమకు సాయం కావాలని కోరుతున్నారు. అణగారిన దళితజాతి సమగ్ర అభ్యు దయం కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించి దళిత బంధు ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా ప్రతి దళిత కుటుం బానికి రూ.10 లక్షల ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నది. దళిత బంధు సాయం వారి కుటుంబాలను ఆర్థికంగా

మిగతా... 2లో



## గుడుంబా రహితంగా తెలంగాణ

- అధికారులతో సమీక్షలో మంత్రి ఆదేశాలు

హైదరాబాద్,ఫిబ్రవరి7(ప్రజామంటలు): ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు రాష్ట్రంలో గుడుంబాను 100 శాతం నిర్మూలించాలని ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అధికారులను ఆదేశించారు. హైదరా బాద్‌లోని తన క్యాంపు కార్యాలయంలో ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులతో మంత్రి శ్రీనివాస్ గౌడ్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన 'నీరా కేఫ్' ప్రారంభోత్సవంపై చర్చించారు. ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారుల పనితీరును మెరుగుపరచుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. నీరా కేఫ్‌కు అనుబంధంగా ఉన్న చిల్లింగ్ ఎలాంట్ల పనులను వేగవంతంగా పూర్తి

మిగతా... 2లో

# దమ్ముంటే రాజీనామా చెయ్..!

**మొదటి పేజీ తరువాయి..**

పార్టీ శాసనసభా పక్షాన్ని 2009లో చీల్చే ప్రయత్నం చేసినప్పుడే కేసీఆర్ చలించలేదు అని గుర్తు చేశారు. కేసీఆర్ నీడ నుంచి వెళ్లిన వారికి రాజకీయ జీవితం లేకుండా పోయింది. కేసీఆర్ తయారు చేసిన నాయకులు చాలా పెద్దవాళ్లం అనుకుంటున్నారు. ఒక్కసారి కేసీఆర్ చేయి వదిలేస్తే వారి గతి అధోగతే అని హెచ్చరించారు. కొందరు పార్టీలు కూడా పెట్టారు. ఆ పార్టీలు పాన్‌డబ్బాలుగా మారిపోయా యని విమర్శించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎన్టీఆర్ స్థాపించిన తెలుగు దేశం పార్టీ, తెలంగాణలో కేసీఆర్ స్థాపించిన బీఆర్ఎస్ మాత్రమే జాతీయ పార్టీలను తట్టుకుని నిలబడ్డాయి. మిగతా పార్టీలన్నీ కాలగర్భంలో కలిసిపోయాయని పువ్వాడ అజయ్ కుమార్ గుర్తు చేశారు. బీ ఫామ్ ఇవ్వాలని తాను ఏ ఒక్క రోజు కూడా అడగలేదు. మీరంతా తన కుటుంబ సభ్యులే అని స్పష్టం చేశారు. వైరా ఎమ్మెల్యే రాములు నాయక్ ఏ ఒక్క రోజు కూడా తన స్వార్థం కోసం రాజకీయాలు చేయలేదు. తన నియోజకవర్గంలో కాకుండా ఇతర నియోజకవర్గాల్లో కుంపటి పెడుతామనడం సరికాదు. ప్రతి నాయకుడు పార్టీ విధానాల ప్రకారం నడుచుకోవాలి. వైరా నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించే బాధ్యత తానే తీసుకుంటున్నానని మంత్రి స్పష్టం చేశారు. వైరాలో బీఆర్ఎస్ ఎట్ల గెలవదో తాను చూస్తానని చెప్పారు. గ్రూపు రాజకీయాలు మంచివి కావు. కేసీఆర్‌ఎవరికీ అన్యాయం చేయకుండా అందరికీ పదవులు ఇచ్చారు. తెలంగాణ ప్రభుత్వం సాధించిన ప్రగతి మన కళ్ల ముందు కనబడుతుంది. ఎవరో కేసీఆర్‌కు సర్టిఫికెట్ ఇవ్వాల్సిన అవసరం లేదు. ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్ పార్టీకి తిరుగులేదు అని పువ్వాడ అజయ్ స్పష్టం చేశారు.

# బడ్జెట్‌ను చూసి నవ్వుకుంటున్న జనం

**మొదటి పేజీ తరువాయి..**

వేద కన్వెన్షన్లో బీజేపీ శిక్షణ తరగతులు ప్రారంబమయ్యాయి. ఈ తరగతులకు ముఖ్య అతిథిగా సంజయ్ హాజరయ్యారు. బండితో పాటు...జాతీయ



ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, ఇంద్రసేనారెడ్డి మురళీధర్ రావు మాజీ ఎంపీలు జితేందర్ రెడ్డి, వివేక్, బూర నర్సయ్య గౌడ్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ.. లిక్కర్, భూములు అమ్మకోవడం, పన్నులు, ఛార్జీలు పెంచి ప్రజలపై భారం మోపడం ద్వారా ఆదాయం పెంచుకోవాలనుకుంటున్నారు. కేంద్రాన్ని తిట్టడానికి మాత్రమే బడ్జెట్ ప్రవేశపెట్టినట్లుంది. దేశంలో బడ్జెట్‌ను పూర్తి వివరాలతో ప్రవేశపెట్టారు. లిక్కర్ ఆదాయం రూ.40 వేల కోట్లుంటే... కేసీఆర్ అమలు చేస్తున్న ప్రధానమైన సంక్షేమ పథకాలకు రూ.30 వేల కోట్లు దాటడం లేదు. మరి అప్పులు చేస్తున్న లక్షల కోట్లు ఏం చేస్తున్నారో తెల్వని పరిస్థితి ఏర్పడింది. కేంద్రం సంక్షేమ పథకాలను చెప్పడం..టీఆర్ఎస్ వైఫల్యాలను ఎండగట్టడం, పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లు నిర్వహిస్తున్నాం. బీఆర్ఎస్ ను తరిమికొట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈ మీటింగ్‌ల ద్వారా ఇంటింటికీ బీజేపీని చేరువ చేయండని బండి సంజయ్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

## నలుదిశలా హైదరాబాద్
# నగర అభివృద్ధి

**మొదటి పేజీ తరువాయి..**

పలు ఫ్లై-ఓవర్లు, రోడ్ల నిర్మాణం పూర్తయ్యిందని కేటీఆర్ పేర్కొన్నారు. కార్యక్రమం కింద దాదాపు వందల కోట్లతో నిధులతో అనేక పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. జీహెచ్ఎంసీ చేపట్టిన సీఆర్ఎంపీ కార్యక్రమం ద్వారా ప్రధాన రోడ్ల నిర్వహణ సైతం ప్రభావవంతంగా సాగుతుం దన్నారు. జనావాసాలు అధికంగా ఉన్న పాతబస్తీలాంటి ప్రాంతాల్లో రోడ్డు వైడనింగ్ కార్యక్రమం కొంత సవాల్‌తో కూడుకున్నదని, అయితే రోడ్డు వైడనింగ్ తప్పనిసరి అయినా ప్రాంతాల్లో ఇందుకు సంబంధించిన పనులను వేగవంతం చేయాలని అధికారులను అదేశించారు. అభివృద్ధి కార్యక్రమాల కోసం అవసరమైన మరిన్ని



భూసేకరణ నిధులను అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ట్రాఫిక్ జంక్షన్లతో పాటు ఫుట్ ఓవర్ బ్రిడ్జిల నిర్మాణం, అవసరమైన చోట మూసీపై బ్రిడ్జిల నిర్మాణాన్ని వేగంగా కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. చార్మినార్ పెడెస్ట్రియన్ ప్రాజెక్టు పనులు సైతం దాదాపుగా పూర్తి కావచ్చాయని తెలిపారు. ప్రతి ఒక్కరికీ సరిపడా తాగునీరు అందించాలన్న బృహత్ సంకల్పంతో తెలంగాణ ప్రభుత్వం ముందుకుపోతున్న దని, అందులో భాగంగా హైదరాబాద్ నగరంలోని తాగునీటి సరఫరా సంతృప్తికర స్థాయిలో ఉందని కేటీఆర్ తెలిపారు. గత ఎనిమిదేళ్లలో పాతబస్తీ పరిధిలోను తాగునీరు సరఫరా మెరుగుపడిందన్నారు. ఇందుకోసం వివిధ తాగునీటి సౌకర్యాల అభివృద్ధికి సుమారు రూ.1200 కోట్లకు పైగా ఖర్చు చేసినట్లు కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన ఉచిత తాగునీటి సరఫరా పథకంలో భాగంగా పాతబస్తీలో రెండున్నర లక్షలకుపైగా నల్లా కనెక్షన్ల ద్వారా ఉచిత తాగునీరు అందుతుందని కేటీఆర్ తెలిపారు. జలమండలి ద్వారా మురికి నీటి వ్యవస్థ బలోపేతానికి అనేక కార్యక్రమాలు తీసుకున్నట్లు తెలిపారు. ఇందుకోసం పాతబస్తీ పరిధిలో వివిధ ప్రాంతాల్లో సీవర్ ట్రీట్మెంట్ ప్లాంట్ల నిర్మాణంతో పాటు ఇతర కార్యక్రమాలను జలమండలి చేపట్టిన విషయాన్ని ఈ సందర్భంగా కేటీఆర్ ప్రస్తావించారు. హైదరాబాద్‌తో పాటు పాతబస్తీలోను విద్యుత్ సరఫరా వ్యవస్థ అద్భుతంగా మెరుగైందని తెలిపారు.

**పర్యాటక ప్రాంతాల్లో పారిశుధ్యం ప్రత్యేక దృష్టి**

పారిశుధ్య నిర్వహణ విషయంలోనూ జీహెచ్ఎంసి తీసు కున్న ప్రత్యేక చర్యలతో పాతబస్తీలో పరిస్థితి మార్పు వచ్చిందన్నారు. ముఖ్యంగా చార్మినార్, చౌమహల్లా ప్యాలెస్, మదీనా, మక్కా మసీద్, సాలార్‌జంగ్ మ్యూజియం తదితర పర్యాటక ప్రాంతాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టామని కేటీఆర్ పేర్కొన్నారు. వైద్య ఆరోగ్య రంగంలోనూ తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న అన్ని రకాల ప్రభుత్వ పథకాల అమలుతో పాటు, ప్రత్యేకంగా 84 బస్తీ దవాఖానాలను ఇప్పటిదాకా పాతబస్తీలో ఏర్పాటు చేసినట్లు కేటీఆర్ పేర్కొన్నారు. ప్రభుత్వ వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మీర్ ఆలం మండి మార్కెట్ రిస్టోరేషన్ కోసం పురపాలక శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన ప్రణాళికలు సిద్ధంగా చేసినట్లు తెలిపారు. మీర్ ఆలం ట్యాంక్ పైనుంచి ఆరు లైన్ల కేబుల్ బ్రిడ్జ్ నిర్మాణ ప్రతిపాదనలు సైతం డీపీఆర్ దశలో ఉన్నట్లు తెలిపారు. హైదరాబాద్ నగరంలో ఉన్న అనేక వారసత్వ కట్టడాలు, వారసత్వ సంపద ప్రధానంగా పాతబస్తీలో ఉన్న నేపథ్యంలో, వాటిని రక్షించడంతోపాటు పునరుజ్జీవన కార్యక్రమాలను సైతం పెద్ద ఎత్తున చేపట్టిన అంశాన్ని కేటీఆర్ సమావేశంలో ప్రస్తావించారు.

**సంతోషం వ్యక్తం చేసిన అక్బరుద్దీన్**

హైదరాబాద్ అభివృద్ధిలో పాతబస్తీ ప్రగతికి ప్రాధాన్యం ఇవ్వడంపై సంతృప్తి వ్యక్తం చేసిన అక్బరుదుద్దీన్ ఒవైసీ హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వానికి, ప్రధానంగా మంత్రి కేటీఆర్‌కు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. ప్రస్తుతం కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు అదనంగా పాతబస్తీలో చేపట్టాల్సిన పలు కార్యక్రమాలను మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగంగా అమలు చేసేందుకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలను, క్షేత్రస్థాయిలో అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ విషయంలో ప్రభుత్వ శాఖలతో కలిసి పని చేస్తామని అక్బరుద్దీన్ ఓవైసీ పేర్కొన్నారు.

# బిసిలకు అండగా కెసిఆర్

**మొదటి పేజీ తరువాయి..**

తెలిపారు. ఇంటింటికి తాగునీరు అందిస్తుందని అన్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లో రోడ్లు కనెక్టవిటి ని కల్పించారని తెలిపారు. విద్యాభివృద్ధికి పాఠశాలలు, కళాశాలలు పెద్ద ఎత్తున నిర్మించు కున్నామని అన్నారు. ప్రతి జిల్లాలో వైద్య కళాశాలలు ఏర్పాటు అవుతున్నాయని వెల్లడించారు. తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచిన ముఖ్యమంత్రి కేసీఆర్ దేశాన్ని కూడా మార్చాలనే తపనతో ఉన్నారని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. తెలంగాణలోని బీసీ కులాలకు ఇస్తున్న ప్రాధాన్యాన్ని ఆలోచించి జాతీయ స్థాయిలోనూ బీఆర్ఎస్‌కు మద్దతిచ్చేలా జాతీయ కులసంఘాలకు నచ్చజెప్పాలని సూచించారు. రాబోయే రోజుల్లో బీసీ కులాలు కేసీఆర్, బీఆర్ఎస్ పట్ల కృతజ్ఞతాభావంతో ఉండాలని పిలుపునిచ్చారు. నాటి పాలకులు బీసీలను ఓటర్లుగానే ఉపయోగించుకున్నారని ఆరోపించారు. ఏనాడు బీసీల ఆర్థిక స్థితిగతులపై మాట్లాడలేదని దుయ్యబట్టారు. దేశవ్యాప్తంగా బీసీలు 80 కోట్లుండగా వీరి కోసం కేంద్రం కేవలం రెండువేల కోట్లు మాత్రమే కేటాయించిందని ఆరోపించారు. తెలంగాణలో రెండుకోట్లున్న బీసీలకు తెలంగాణ ప్రభుత్వం ఆరువేల కోట్ల రూపాయలను కేటాయించిందని వెల్లడించారు. ప్రత్యేకంగా బీసీ శాఖను ఏర్పాటు చేసిన ఘనత బీఆర్ఎస్‌కే దక్కిందన్నారు. కులవృత్తులందరికీ చేయూతను అందిస్తుందని తెలిపారు. బీసీలకు చెందిన పిల్లలు విద్యాపరంగా ఉన్నత చదువులు చదువలానే సంకల్పంతో రాష్ట్రవ్యాప్తంగా 325 గురుకులాలను ఏర్పాటు చేశారని తెలిపారు. ఇటీవల ప్రకటించిన రాష్ట్ర బడ్జెట్‌లో సంక్షేమ పథకాలకు లక్షకోట్లు కేటాయించగా అధిక శాతం బీసీ వర్గాలకే దక్కనున్నాయని పేర్కొన్నారు. కుల సంఘాలు ఐక్యమత్యంతో పనులు సాధించుకోవాలని సూచించారు.

విభేదాలతో రోడ్డకెక్కడం అవమానకరమని పేర్కొన్నారు. వృత్తి కులాలు నాగరికతను తెలియజేస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వెంకటేశం , బీసీ కమిషన్ చైర్మన్ వకులాభరణం కృష్ణమోహన్, టీఎస్ఎంఐడీసీ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ రేఖాయాదగిరి నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# హృదయవిదారకంగా టర్కీ సిరియాలు

**మొదటి పేజీ తరువాయి..**

టర్కీ సిరియా దేశాల్లో సంభవించిన భూకంపం ఘటనల్లో 4 వేల మందికిపైనే ప్రాణాలు కోల్పోయారంటే పరిస్థితులు ఎంత హృదయవిదారకంగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. భూకంపం ధాటికి ఊరు, పట్టణాలనే తేడా లేకుండా మరుభూములుగా మారిపోయాయి. టర్కీ సిరియాలో భూకంపం ప్రకోపానికి భారీగా ప్రాణ, -ఆస్తి నష్టం వాటిల్లింది. రెండు దేశాల్లోనూ రెస్క్యూ ఆపరేషన్‌కు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రోడ్లు దెబ్బతినడం, కరెంట్, -ఇంటర్నెట్ సేవలకు అంతరాయంతో పాటు చాలాచోట్ల మంచి నీటి సరఫరాకు విఘాతం ఏర్పడింది. దాంతో సహాయక చర్యలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. వేల మంది ఇంకా శిథిలాల కిందే ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. ఈ రెండు దేశాల్లోనూ శిథిలాల చిక్కుకున్న వాళ్లను రక్షించే రెస్క్యూ ఆపరేషన్‌లో.. ఇప్పటిదాకా 4వేలకు పైగా మృతదేహాలను వెలికి తీశారు. టర్కీ చరిత్రలోనే ఇది భారీ భూకంపంగా నమోదైంది. అధికంగా మృతుల సంఖ్య కూడా ఇక్కడే నమోదు అయ్యిందని తెలుస్తోంది. భారీ ప్రకంపనల ధాటికి సెకన్ల వ్యవధిలోనే వందల సంఖ్యలో పెద్ద పెద్ద బిల్డింగులు కుప్పకూలడం ఒక ఎత్తయితే.. అర్ధరాత్రి అంతా గాఢ నిద్రలో ఉండడంతో మృతుల సంఖ్య మరింతగా పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. సోమవారం నాటి భూకంపం ధాటికి 14వేల పైనే గాయపడగా.. వీళ్లలో కొంత మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. సిరియాలోనూ క్షతగాత్రులు నాలుగు వేల మందికి పైనే ఉండొచ్చని అనధికార లెక్కలు చెబుతున్నాయి. వారం పాటు టర్కీ సంతాప దినాలు ప్రకటించింది. భూకంపం ధాటికి సిరియాలోని అలెప్పో, లటాకియా, హమా, టార్టస్ ప్రాంతాలు తీవ్రంగా దెబ్బ తిన్నాయి. పైగా విషాదానికి ముందే అలెప్పోలోని రష్యా యుద్ధ స్థావర కేంద్రం కూడా అయిన ప్రాంతాల్లో భవనాలు కొన్ని కూలిపోతూ వస్తున్నాయి. పాశ్చాత్య, అగ్ర దేశాలతో పాటు భారత్ సహా మొత్తం 12 దేశాలు టర్కీకి తక్షణ సాయం అందించేందుకు ముందుకు వచ్చాయి. ఇప్పటికే రిలీఫ్ మెటీరియల్‌ను టర్కీకి పంపించాయి. టర్కీ సిరియా దేశాల్లో భూకంపాల ధాటికి పెద్ద పెద్ద బిల్డింగులు పేకమేడల్లా నేలమట్టమయ్యాయి. వేలాది మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ క్రమంలోనే టర్కీలోని హతయ్ ప్రావిన్స్‌లో ఉన్న ఎయిర్‌పోర్టులో రన్‌వే భూ ప్రకంపనల ధాటికి రెండు ముక్కలైంది. హతయ్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులోని రన్‌వే తీవ్రంగా ధ్వంసమైంది. భారీగా పగుళ్లు ఏర్పడి రన్‌వే రెండుగా చీలిపోయిన దృశ్యాలు ప్రస్తుతం సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి. దీంతో ఈ ఎయిర్‌పోర్టులో ఉన్నతాధికారులు విమాన రాకపోకలను నిలిపివేశారు. భూకంప తీవ్రతకు ఒక్క టర్కీలోనే 5600లకు పైగా భవనాలు నేలమట్టమయ్యాయి. రెండు దేశాల్లో ఇప్పటివరకు 4500 మందికిపైగా మృత్యువాత పడగా.. దాదాపు 20వేల మంది గాయపడ్డారు.



## భూకంపం ధాటికి
# కకావికలం

**సిరియాలో శిథిలాల కిందే చిన్నారికి జన్మ**
**బిడ్డను చూసుకోకుండానే తల్లి మృతి**

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి7(ప్రజామంటలు):** ప్రకృతి ప్రకోపంతో టర్కీ, సిరియా దేశాల్లో రక్తమోడుతోంది. ప్రకృతి కన్నెర జేస్తే ఫలితం ఎలా ఉంటుందో తాజా భూకంపాలను చూస్తే అర్థమవుతుంది. శిథిలాల కింద వేలాది మృత దేహాలు బయటపడుతున్నాయి. ఓవైపు పుట్టుక అదే సమయంలో మరోవైపు మరణం సంభవించింది. శిథిలాల కిందే బిడ్డను ప్రసవించి కన్నుమూసిందో కన్నతల్లి. ఓ వైపు వరసగా కంపిస్తున్న భూమి.. మరోవైపు శిథిలాల్లో చిక్కుకున్న మనుషులు.. ఇంకొక వైపు భూకంపం నుంచి ప్రాణాలతో భయపడిన బాధితులు? మంచు కురుస్తూ ఉండడంతో చలికి వణికిపోతూ చేతికి దొరికిన పేపర్లను, అట్ట ముక్కలను, కవర్లను కాల్చుతూ చలిమంట కాచుకుంటున్నారు. టర్కీ, సిరియాలో ఎటు చూసినా కుప్ప కూలిన భవనాలు.. శిథిలాల మధ్య అహకారాలు.. శవాల దిబ్బలను తలపిస్తున్నాయి అక్కడ పరిస్థితులు. సోషల్ మీడియాలో ఎటు చూసినా భూకంపాలకు సంబంధించిన దృశ్యాలు గుండెల్ని పిండేస్తున్నాయి. ఆపదలో ఉన్న సమయంలో తాము ఉన్నామంటూ అనేక మంది.. మేము సైతం అంటూ.. తమవంతుగా సహాయక చర్యల్లో స్థానికులు సైతం పాల్గొని.. ఎందరినో కాపాడుతున్నారు. ఈ క్రమంలో సిరియా అలెప్పోలో ఓ తల్లి బిడ్డను ప్రసవించింది. అదీ శిథిలాల కిందే.. తల్లి ఓ పండంటి బిడ్డను ప్రసవించింది. అయితే దురదృష్టం కొద్దీ ప్రసవించిన వెంటనే చిన్నారిని కనులారా చూడక ముందే ఆ తల్లి కన్నుమూసింది. శిథిలాల తొలగింపు క్రమంలో ఇది గమనించిన స్థానికులు.. ఆ బిడ్డను హుటాహుటిన వైద్యం కోసం తరలించారు. ప్రస్తుతం ఆ బిడ్డ పరిస్థితి నిలకబడగానే ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆ పసి బిడ్డకు సంబంధించిన వీడియో ఒకటి వైరల్ అవుతుంది.

## 'దళితబంధు' పథకం
# దక్కేదెవరికో...?

**మొదటి పేజీ తరువాయి..**

బలోపేతం చేయడమే కాకుండా.. ఆ సంపద సామాజిక పెట్టుబడిగా మారి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బలపడటానికి తోడ్పడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. దళితులు ఆర్థికంగా ఎదగాలనే సంకల్పంతో ప్రభుత్వ లైసెన్సుల ద్వారా చేసుకునే లాభదాయక వ్యాపారాల్లో రిజర్వేషన్లను అమలు చేస్తున్నదని మంత్రి హరీశ్ రావు అన్నారు. ఒక్కో దళిత కుటుంబానికి రూ.10 లక్షలను అందజేసి, ప్రభుత్వం సూచించిన 35రకాల యూనిట్లలో ఏది ఉపయోగ పడుతుందో దానిని ఎంచుకోవాలని అధికారులు నిర్దేశిస్తున్నారు. మొదటగా హుజూరాబాద్ నియోజకవర్గంలో దళితబంధు పథకాన్ని ప్రభుత్వం అమలు చేసింది. పథకాన్ని మరింత విస్తరించాలనే లక్ష్యంతో ఒక్కోఅసెంబ్లీ నియోజకవర్గంలో వంద మందికి ఇవ్వాలని నిర్ణయించింది. దీంతో జిల్లాలో అమలునకు కసరత్తులు మొదలయ్యాయి. దళిత కుటుంబాలు ఆర్థికంగా ఎదగాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన దళిత బంధు పథకం ఎందరికి వస్తుందో రాదో అన్న బెంగ పట్టుకుంది. నియోజకవర్గానికి కేవలం వంద మందికి మాత్రామే.. అదికూడా ఎంపికచేసిన నియోజక వర్గాలకే అన్ని మెలిక పెట్టారు. దీంతో తమకు రాదా అన్నచర్చ ఇప్పుడు జిల్లాల్లో సాగుతోంది. ఇప్పటికే ఎంపిక చేసిన జిల్లాల్లో తొలిదశ జాబితాను ఎమ్మెల్యేలు అధికారుల ద్వారా కలెక్టర్‌కు అందజేశారు. నియోజకవర్గానికి 100 మంది చొప్పున దళితబంధు పథకం కింద అర్హులను ఎంపిక చేయనున్నారు. ఎంపిక చేసిన వారికి రూ.10లక్షలను అందజేయనున్నారు. అర్హుల జాబితాను సిద్ధం చేయడానికి ఎమ్మెల్యేలు, అధికారులు తలమునకలు అవుతున్నారు. ఆయా మండలాలు, గ్రామాలలో లబ్దిదారులను ఎంపిక చేస్తున్నారు. ఎమ్మెల్యేలు అర్హుల జాబితాను రూపొందించి అధికారులకు పేర్లను అప్పగించాలని సూచించింది. కొన్ని నియోజకవర్గాల్లో దళిత కుటుంబాలు అధిక సంఖ్యలోనే ఉండడం పథకం తొలిదశగా నియోజకవర్గాల్లో కేవలం 100 మందికి మాత్రమే అవకాశం కల్పిస్తుండడంతో ఎంపిక ఎమ్మెల్యేలకు కత్తిమీద సాములా మారింది. దీంతో ఎమ్మెల్యేలు ఆచితూచి ఎంపిక చేసే పనిలో ఉన్నారు. జిల్లాల్లో ఇప్పటికే తొలివిడత జాబితాను ఆయా ఎమ్మెల్యేలు అధికారులకు సమర్పించినట్లు సమాచారం. ఈ జాబితాను కలెక్టర్ ఆధ్వర్యంలో దరఖాస్తులను పరిశీలించనున్నారు. అనంతరం ఎంపిక చేసిన వారి వివరాలను క్షేత్రస్థాయిలో అధికారుల పరిశీలిస్తారు. ఎంపిక చేసిన లబ్దిదారుల జాబితా కలెక్టర్ కార్యాలయ అధికారులకు ఆయా మండలాల అధికారులు అందించారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో లబ్దిదారుల దగ్గరకు వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు.ఇప్పటికే ఒక్కో నియోజకవర్గానికి జిల్లాస్థాయి అధికారులను నోడల్ అధికారులుగా నియమించి పర్యవేక్షిస్తున్నారు. మండల స్థాయిలో ప్రత్యేకాధికారి, ఎంపీడీవో, తహసీల్దార్ సంబంధించిన అధి కారులు క్షేత్రస్థాయిలో లబ్దిదారులను ధృవీకరించాలని కలెక్టర్ ఆదేశించారు. దింతో లబ్దిదారుల నుంచి వివరాలు సేకరించి అధికారులు నమునాలు నమోదు చేస్తున్నారు. లబ్దిదారుల బ్యాంకు ఖాతాలు తెరవడంపై దృష్టి సారించారు. దీనికి సంబంధించి ప్రతీ నియోజకవర్గానికి ఒక్కో బ్యాంకును ప్రభుత్వం కేటాయించింది. ఖాతాలు ప్రారంభించడానికి అవసరమైన చర్యలు అధికారులు తీసుకుంటున్నారు. ఖాతాల పక్రియ పూర్తయిన తదుపరి యూనిట్లపై అవగాహన కల్పించనున్నారు. నియోజకవర్గ కేంద్రంలో అవగాహన నిర్వహించాలని అధికారులు భావిస్తున్నారు.

అందుకు ఒకే రకమైన యూనిట్లు ఎంచుకుంటే ఇబ్బందులు ఎదురవుతాయని ఒక్కొక్కరు ఒక్కో రకమైన యూనిట్‌కు తీసుకో వాలని అధికారులు సూచిస్తున్నారు. మొత్తంగా ఈ వ్యయహారం సాఫీగా సాగుతుందా.. తమకు రాలేదన్న వారు ఎలాంటి ప్రతిఘటన చేస్తారో అన్నది ఎమ్మెల్యేల్లో భయంగా ఉంది.

# అదానీ స్కాం...మోడీ మౌనం

**మొదటి పేజీ తరువాయి..**

రాహుల్ అన్నారు. అదానీ ఏ వ్యాపారంలో అడుగుపెట్టినా అతను ఫెయిల్ కారని ప్రజలు అంటున్నట్లు రాహుల్ గుర్తు చేశారు. కశ్మీర్‌లోని యాపిల్ల నుంచి.. పోర్టులు, ఎయిర్‌పోర్టులు, రోడ్డుల గురించి కూడా అదానీ పేరు వినిపిస్తోందని అన్నారు. ప్రధాని మోడీ, అదానీకి మధ్య ఉన్న సంబంధ మేంటని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ




ప్రశ్నించారు. దేశమంతా అదానీ సక్సెస్ వెనుక ఎవరున్నారన్నది తెలుసుకోవాలనుకుంటోందని అన్నారు. రాష్ట్రపతి స్పీచ్ పై ధన్యవాద తీర్మానం సందర్భంగా లోక్ సభలో రాహుల్ అదానీ అంశాన్ని లేవనెత్తారు. మోడీ, అదానీ కలిసి ఉన్న ఫొటోను రాహుల్ ప్రదర్శించగా బీజేపీ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో స్పీకర్ రాహుల్ ను వారించారు. అనంతరం మాట్లాడిన రాహుల్ గాంధీ 2014లో 8బిలియన్ డాలర్లుగా ఉన్న అదానీ సంపద 2022 నాటికి 140 మిలియన్ డాలర్లకు ఎలా పెరిగిందని యువత తెలుసుకోవాలనుకుంటున్నారని అన్నారు. కశ్మీర్ యాపిల్స్ నుంచి పోర్టులు, ఎయిర్ పోర్టులు, రోడ్ల వరకు అన్ని ప్రాజెక్టులను చేపట్టే సత్తా కేవలం అదానీకి మాత్రమే ఉందని రాహుల్ సటైర్ వేశారు. ప్రధాని, అదానీ మధ్య బంధం ఈ నాటిదికాదన్న రాహుల్... మోడీ గుజరాత్ సీఎంగా ఉన్న నాటి వారు ఒకరికొకరు సాయం చేసుకుంటున్నారని అన్నారు. 2014లో మోడీ ఢిల్లీ పీఠం ఎక్కడం వెనుక అదానీ ఉన్నారని ఆరోపించారు. ఎయిర్ పోర్టులకు సంబంధించి ఎలాంటి అనుభవం లేని కంపెనీలకు వాటి డెవలప్ మెంట్ పనులు అప్పగించొద్దన్న రూల్ ను అదానీ కోసం కేంద్రం మార్చేసిందని రాహుల్ ఆరోపించారు. ప్రస్తుతం అదానీ చేతిలో ఆరు ఎయిర్ పోర్టులు ఉన్నాయని, చివరకు అత్యంత లాభదాయ కమైన ముంబై ఎయిర్ పోర్టును సైతం సీబీఐ, ఈడీలను ఉపయోగించి జీవీకే నుంచి లాక్కొని అదానీకి అప్పజెప్పారని విమర్శించారు. డ్రోన్ల తయారీలో అనుభవం లేకపోయినా హెచ్ఏఎల్‌ను కాదని అదానీకి కాంట్రాక్ట్ కట్టబెట్టారని ఆరోపించారు. అదానీ కంపెనీల్లో ఎల్ఐసీ పెట్టుబడులు పెట్టడం వెనుక కారణాలతో పాటు ఇప్పటి వరకు ఆయనకు ఎన్ని కాంట్రాక్టులు ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఇకపోతే రాష్ట్రపతి ప్రసంగంలో నిరుద్యోగం, ద్రవ్యోల్బణం లాంటి అంశాలను ప్రస్తావించలేదన్నారు. అగ్నివీర్ పథకం ఆర్మీ ఆలోచన నుంచి రాలేదని, అది ఎన్ఎస్ఏ చీఫ్ అజిత్ దోవల్ ఆలోచన నుంచి వచ్చినట్లు రాహుల్ విమర్శించారు. అగ్నివీర్ పథకాన్ని బలవంతంగా ఆర్మీపై రుద్దినట్లు ఆయన తెలిపారు. ప్రజలకు ఆయుధ శిక్షణ ఇచ్చి, వాళ్లను తిరిగి సమాజంలోకి పంపడం వల్ల హింస పెరుగుతుందని రిటైర్డ్ ఆఫీసర్లు ఆరోపిస్తున్నట్లు రాహుల్ గాంధీ ఆరోపించారు. అయితే రాహుల్ వ్యాఖ్యలపై బీజేపీ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. నిరాధార ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ఆరోపణలు చేయడం కాదు.. ఆధారాలుంటే చూపించాలని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు రాహుల్‌కు సూచించారు.

# గుడుంబా రహితంగా తెలంగాణ

**మొదటి పేజీ తరువాయి..**

చేయాలని మంత్రి సందర్భంగా అధికారులను ఆదేశించారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు రాష్ట్రంలో గుడుంబా నిర్మూలన 100 శాతం పూర్తిగా జరగాలని మంత్రి అధికారులను ఆదేశించారు. గుడుంబాతో ఏ ఒక్క గిరిజన మహిళ తన భర్తను కోల్పోకుండా గుడుంబా తయారీ అమ్మకం దారులపై ఉక్కు పాదం మోపాలని మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, కమిషనర్ అజయ్ రావు, డిప్యూటీ కమిషనర్లు డేవిడ్ రవికాంత్ , కేఏబీ శాస్త్రి, సహాయ కమిషనర్ చంద్రయ్య, ఈఎస్‌లు విజయ్ భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

## పాతసీసాలో కొత్త సారా... పోసినట్టుగా బడ్జెట్

**మొదటి పేజీ తరువాయి..**

మంగళ వారం షర్మిల మీడియాతో మాట్లాడుతూ.. మంత్రి హరీష్ రావు కొత్త సంవత్సరం కదా అని కొత్త సీసా తీసుకొని ఫామ్ హౌజ్‌కి వెళ్లారు. అందులో ఆయన మామ పాత సార పోశారు. గతేడాది బడ్జెట్ కేటాయింపులు, ఖర్చులు మీద సమాధానం చెప్పాలి. గతంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు రూ.12వేల కోట్లు కేటాయించారు. ఈసారి దళిత బంధుకు రూ. 17 వేల కోట్లు పెట్టారు. అసలు కేటాయింపులకు, ఖర్చులకు పొంతనే లేదు. గతేడాది బడ్జెట్‌ను కాపీ పేస్ట్ చేశారు. ఈ ఏడాది కేటాయింపులకు న్యాయం చేస్తారని గ్యారెంటీ ఉందా..? పథకాలకు బడ్జెట్ కేటాయించి ఖర్చు పెట్టక పోతే ఎందుకు..?బడ్జెట్‌ను వేస్ట్ పేపర్ చేస్తున్నారు. చెత్తబుట్టలో పడేసెలా చేస్తున్నారు. 8 ఏళ్లుగా ముఖ్యమంత్రి ఇచ్చిన ఒక్క హామీ నిలబెట్టుకోలేదు. సీఎం అన్నాక ఇచ్చిన మాటకు విలువ ఉండదా..? సీఎం మాటలు మాత్రం కోటలు దాటుతాయి.. చేతలు మాత్రం గడప దాటడం లేదని తీవ్రస్థాయిలో షర్మిల మండిపడ్డారు. అందుకే గతేడాది బడ్జెట్‌ను కాపీ పేస్ట్ చేసినట్లు ఈసారి పద్దులు ఉన్నాయని విమర్శించారు. కేటాయింపులకు, ఖర్చు చేస్తున్న నిధులకు అసలు పొంతనే లేదని షర్మిల వాపోయారు. కెసిఆర్ ఎనిమిదిన్నరేళ్లలో ప్రజలకిచ్చిన ఒక్క హామీని నిలబెట్టుకోలేదని మండిపడ్డారు. దేవాదుల, కంతనపల్లి, డిండి, ఎస్ఎల్బీసీ, సీతారామ, నక్కల గండి ప్రాజెక్టులను ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. గుదిబండలా మారిన కాళేశ్వరం ప్రాజెక్టు కోసం లక్షా 20వేల కోట్లు ఖర్చు చేస్తే అది మూడేళ్లకే మునిగిపోయిందని షర్మిల విమర్శించారు. ఆ ప్రాజెక్టు వ్యయంలో ఒక వంతు ఖర్చు చేసినా 33 ప్రాజెక్టులు పూర్తయ్యేవని అన్నారు. రుణమాఫీ కోసం 36 లక్షల మంది రైతులు ఎదురు చూస్తుంటే బడ్జెట్‌లో కేవలం రూ.6 వేల కోట్లు మాత్రమే కేటాయించడాన్ని షర్మిల తప్పుబట్టారు. రైతు బంధు పేరుతో రూ.10 వేలు ఇచ్చి రైతులకిచ్చే సబ్సిడీలన్నీ బంద్ పెట్టారని మండిపడ్డారు. రైతులను రాజును చేశామంటున్న కేసీఆర్ రాష్ట్రంలో అన్నదాతలు ఆత్మహత్యలు ఎందుకు చేసుకుంటున్నారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రూ.4.80లక్షల కోట్ల రుణాలతో రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చిన సీఎం కేసీఆర్.. ఒక్కొక్కరి నెత్తిన 1.20లక్షల అప్పు పెట్టిండని మండిపడ్డారు.

# పేదలందరికీ ఇళ్లు కట్టిస్తాం..

**మొదటి పేజీ తరువాయి..**

మీరంతా పని చేయాలని మహిళా కూలీలతో రేవంత్ రెడ్డి చెప్పారు. కాగా ములుగులో గట్టమ్మ, సాయిబాబా దేవాయాల్లో నిన్న రేవంత్ రెడ్డి



ప్రత్యేక పూజలు చేసి పాదయాత్రను ప్రారంభించారు. కాంగ్రెస్ అంటేనే పేదల పార్టీ అని ములుగు ఎమ్మెల్యే సీతక్క అన్నారు. తెలంగాణ ఇచ్చింది, దేశానికి స్వాతంత్ర్యం తెచ్చింది కాంగ్రెస్ పార్టీ అని చెప్పారు. కాంగ్రెస్ భూములు పంచితే బీఆర్ఎస్, బీజేపీ అమ్ముకుంటున్నాయని ఆరోపించారు. హాథ్ సే హాథ్ యాత్రలో భాగంగా ములుగు జిల్లాలో నిర్వహించిన బహిరంగ సభలో సీతక్క పాల్గొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే సమస్యలు తీరుతాయని చెప్పారు. కేసేఆర్ పాలనలో మంచి నీళ్లు దొరకడం లేదు కానీ... మందు మాత్రం గల్లీ గల్లీలో ఏరులై పారుతోందంటూ కామెంట్ చేశారు. ములుగు జిల్లాకు సమ్మక్కసారలమ్మ జిల్లా అని పేరు పెట్టాలని ఆమె డిమాండ్ చేశారు.

## శ్రీ భక్త మార్కండేయ దేవాలయాన్ని సందర్శించిన శ్రీహరి మౌన స్వామి

**బుగ్గారం ఫిబ్రవరి 07 (ప్రజామంటలు):** జగిత్యాల జిల్లా బుగ్గారంలో సుమారు 40 ఏండ్ల క్రితం నిర్మించిన శ్రీ భక్త మార్కండేయ దేవాలయాన్ని గీతా ధర్మ ప్రచార



కేంద్రం – రోటిగూడ నిర్వాహకులు శ్రీహరి మౌన స్వామి సందర్శించారు. ఆలయ పరిసరాలను ఆయన స్వయంగా పరిశీలించి ఆలయ అభివృద్ధి కోసం మౌన స్వామి పలు సూచనలు అందజేశారు. 40 ఏండ్ల క్రితం బుదారపు లింగయ్య (స్వర్గస్తులయ్యారు) చే నిర్మించబడిన ఈ ఆలయానికి కమిటి చైర్మన్ గా ఆయన మనుమడు అయిన బుదారపు పరమేశ్వర్ కొనసాగుతున్నారు. గత కొన్ని ఏండ్లుగా మార్కండేయ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ సాంబశివ నాగేశ్వరాలయ కమిటీ చైర్మన్ మసర్ధి రాజిరెడ్డి, విడిసి కోర్ కమిటీ చైర్మన్ చుక్క గంగారెడ్డి, కటుకూరి అంజయ్య, పద్మశాలి సేవా సంఘం అధ్యక్షులు బాలపెల్లి లక్ష్మణ్, బుదారపు చంద్రయ్య, చెట్ పల్లి బక్కన్న, రెబ్బ నాగరాజు, ప్రభు తదితరులు పాల్గొన్నారు.

## 20వ వార్డ్ కంటి వెలుగు కేంద్రంలో ముగిసిన కంటి పరీక్షలు

**జగిత్యాల ఫిబ్రవరి 07 (ప్రజామంటలు):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమం జగిత్యాల పట్టణంలోని శ్రీ వాణి జూనియర్ కళాశాల 20వ వార్డ్ కంటి వెలుగు కేంద్రంలో మంగళవారంతో కంటి పరీక్షలు ముగిశాయి. వార్డు కౌన్సిలర్ అనుమల్ల కృష్ణహరి కంటి వెలుగు కేంద్రాన్ని పరిశీలించి కంటి



వెలుగు నిర్వహణ తీరు గూర్చి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కంటి వెలుగు సిబ్బందికి, వైద్య బృందానికి 10 రోజులపాటు తమ వార్డులో ప్రజలకు సేవలందించి నందుకు ధన్యవాదాలు తెలిపారు. వైద్యురాలు శివాని మాట్లాడుతూ%ా%. పది రోజుల్లో సుమారుగా 1000 మందికి పై బడి కంటి పరీక్షలు నిర్వహించామని సుమారు 50 శాతం మందికి అద్దాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అవస్థాపన సౌకర్యాలు సమకూర్చిన కళాశాల యాజమాన్యానికి డాక్టర్ శివాని ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు టి. పద్మ, కే. జ్యోతి, శోభారాణి, డి.ఈ.ఓ. విజయరాణి ఆప్తమాలజిస్ట్ రాజు, సూపర్వైజర్ రాజేందర్, ఆశలు బి. వసంత, కే. సంధ్య, యమున, ఆర్. సంధ్యారాణి, కళాశాల అధ్యాపక బృందం జే. రంగారెడ్డి, క్యాథమ్. వేణుగోపాల్, పి. సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

## గుంతలు పూడ్చిన రెయిన్బో యూత్ అసోసియేషన్

**తరిగొప్పుల ఫిబ్రవరి 07 (ప్రజామంటలు):** మండల కేంద్రములో అక్కరాజుపల్లి నుండి తరిగొప్పుల కు వచ్చె రోడ్డు మార్గము లో గత కొన్ని సంవత్సరముల నుండి



గుంతల మయంగా వుంది. ప్రయాణికుల ఇబ్బందులను నాయకులు పట్టించుకోకుండా వున్నారు అని అక్కరాజుపల్లి గ్రామంలో రెయిన్బో యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యూత్ సభ్యులందరూ ప్రయాణికుల అవస్థలు చూసి గుంతలు పూడ్చడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు అంకం రాజు, ఉపాధ్యక్షుడు బొగం అనూప్, అక్తర్, రాకేష్, రాజు గౌడ్, పాల్గొన్నారు.



మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఆదిత్య ఎన్ క్లివ్ కాలనీ లో మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ సతీమణి జ్యోతి ఇంట్లో ఎవరూ లేని సమయంలో చున్ని తో ఫ్యాన్ కు ఉరి వేసుకొని ఆత్మహత్య. సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టిన మంచిర్యాల పట్టణ పోలీసులు.

# బడ్జెట్ పాఠశాలల ముఖ్యోద్దేశం

**అతి సామాన్యులకు విలువలతో కూడిన విద్య**

**హడుప్సా ఆవిర్భావ సభలో జిల్లా విద్యాశాఖాధికారి అబ్దుల్ హై**

**హనుమకొండ 07 ( ప్రజామంటలు):** జిల్లాలో విద్యానికేతన్ ఉన్నత పాఠశాలలో జరిగిన హనుమకొండ అనైడేడ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (హడుప్సా) ఆవిర్భావ సభ ఘనంగా నిర్వహించారు. ఈ ఆవిర్భావ సభకు హాజరైన జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్ హై మాట్లాడుతూ.... పాఠశాలల ఐక్యత ప్రతి ఒక్కరికి ఆదర్శంగా ఉండాలని అత్యున్నత స్థాయి విద్య సామాన్యునికి అందుబాటులో ఉండాలని జిల్లా విద్యాశాఖాధికారి అభిలాషించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హడుప్సాను ఏర్పాటు చేసిన జిల్లా కరస్పాండెంట్లను అభినందించారు. తెలంగాణ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఎస్. శ్రీనివాసరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... రాష్ట్రంలో మెజార్టీ సంఖ్యలో బడ్జెట్ స్కూల్స్ ఉన్నాయని వాటి వాటి ప్రయోజనాలను కాపాడే నాయకులు కరువయ్యారన్నారు. కానీ సమాజంలో అతి సామాన్యునికి అందుబాటులో ఉండేది బడ్జెట్ పాఠశాలు మాత్రమే అన్నారు. కానీ కార్పొరేట్ విద్యా వ్యవస్థ మొదలయ్యాక సీబీఎస్ఈ పాఠశాలలు వాటి ప్రయోజనాలను వెన్నుదన్నుగా నిలుస్తున్న నాయకుల వల్ల, అధికారుల వల్ల బడ్జెట్ పాఠశాలల ఉనికి నానాటికీ మృగ్యమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేటు విద్యాసంస్థలు ఆర్టిఏ పరిధిలోకి రావని ఈ సందర్భంగా తెలిపారు. ప్రొఫెషనల్ టాక్స్ ఈఎస్ఐ తదితర అంశాలపై హాజరైన కరస్పాండెంట్లు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. సమాజంలో దిగువ, మధ్య తరగతి ప్రజలకు విలువల తో కూడిన అత్యున్నత స్థాయి ప్రమాణాలతో విద్యను.. బడ్జెట్ పాఠశాలలే అందిస్తాయని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ పంపిన సందేశంలో పేర్కొన్నారు, మరియూ శుభాభినందనలు తెలిపారు. అసెంబ్లీ సమావేశాల వల్ల తాను రాలేకపోతున్నానని.. హడుప్సా ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమని, సమస్యల పరిష్కారానికి తన వంతు పూర్తి సహకారాన్ని అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన నూతన అధ్యక్షుడు వర్ధమాన్ జనార్ధన్ మాట్లాడుతూ .. రాబోయే రోజుల్లో చేపట్టబోయే కార్యక్రమాలను




వివరించారు. చిన్న స్కూల్స్ పరిరక్షణయే ధ్యేయంగా పనిచేస్తామని.. ఈ సందర్భంగా నొక్కి వక్కాణించారు. ప్రధాన కార్యదర్శి వెంకట పి.వెంకటరమణ, శంకర్ తమ నివేదిక సమర్పించారు. వ్యవస్థాపక సభ్యుడు తక్కల్లపల్లి బుచ్చిబాబు హడుప్సా ఏర్పడడానికి దారి తీసిన పరిస్థితులు.. దాని లక్ష్యాలు స్పష్టంగా వివరించారు. ఈ కార్యక్రమంలో హడుప్సా గౌరవ సలహాదారులు విద్యానికేతన్ ప్రిన్సిపాల్ షణ్ముఖాచారి, నేతాని శ్రీనివాసరెడ్డి, పి. వేణు మాధర్, సంతోష్ రెడ్డి, సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం హడుప్సా కు ఎన్నికైన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు.

## 16 నుండి బుగ్గారంలో శ్రీ సాంబశివుని ““మహాశివరాత్రి జాతర””

**16న ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ**

**17న కుంకుమార్చన, గీతా హవన యజ్ఞం**

**18న శివపార్వతుల కళ్యాణం**

**19న శ్రీ సాంబశివనాగేశ్వర స్వామి రథోత్సవం**

**24 గంటల మహా సంకల్ప గాన స్వరాభిషేకం**



**బుగ్గారం ఫిబ్రవరి 07 (ప్రజామంటలు):** జగిత్యాల జిల్లా బుగ్గారం మండల కేంద్రం సాంబుని గుట్ట వద్ద గల ““సంతానయుక్త శ్రీ సాంబశివ నాగేశ్వరాలయం”‘ లో ఫిబ్రవరి 16 నుండి 19 వరకు మహాశివరాత్రి జాతర ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ మసర్ధి రాజిరెడ్డి తెలిపారు. శ్రీహరి మౌన స్వామిజీ ఆధ్వర్యంలో శివదీక్షా స్వాములతో కలిసి ఆలయ కమిటీ చైర్మన్ మసర్ధి రాజిరెడ్డి, విడిసి కోర్ కమిటీ చైర్మన్ చుక్క గంగారెడ్డి లు జాతర కరపత్రాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ మసర్ధి రాజిరెడ్డి మాట్లాడుతూ ఆలయ ప్రాంగణంలో నూతనంగా శ్రీ సంజీవని ఆంజనేయ స్వామి విగ్రహాన్ని ఈనెల 16న ప్రతిష్టాపన చేయనున్నట్లు తెలిపారు. 17న స్త్రీలచే కుంకుమార్చన, దంపతులతో 27 కుండలాల గీతాహవన యజ్ఞం, 18న మహాశివరాత్రి జాతర, శివపార్వతుల కళ్యాణం జరుగనున్నాయని ఆయన పేర్కొన్నారు. 19న అంగరంగ వైభవోపేతంగా శ్రీ సాంబశివ నాగేశ్వర స్వామి రథోత్సవం జరుగనుందన్నారు. అలాగే మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 18



శనివారం ఉదయం 8–00 గంటల నుండి 19 ఆదివారం ఉదయం 8:00 గంటల వరకు ప్రముఖ ఆధ్యాత్మిక కళాకారులు నక్క రాజు చే ““24 గంటల మహా సంకల్ప గాన స్వరాభిషేకం”‘ నిర్వహించబడునని ఆయన తెలిపారు. యావత్ భగవత్ బంధువులు, ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీల నేతలు, కార్యకర్తలు, ప్రింట్ %డ% ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు, ప్రముఖులు ఈ నాలుగు రోజుల పాటు జరుగనున్న ఆలయ 17వ వార్షికోత్సవ, మహాశివరాత్రి జాతర ఉత్సవాలలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# మైనారిటీ కార్పొరేషన్ లోన్ స్క్రీన్ టెస్ట్

**ఇంటర్వ్యూ కు పిలిచారు, అవమానించారు**

**జనగామ ఫిబ్రవరి 07 (ప్రజామంటలు):** మైనారిటీ కార్పొరేషన్ లోన్ స్క్రీన్ టెస్ట్ ఇంటర్వ్యూ అని పిలిచి మైనార్టీ ప్రజలను అవమానించిన జనగామ మున్సిపల్ అధికారులు. ప్రజలు తిరగబడి ప్రశ్నించగా సమాధానం చెప్పకుండా మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ ఛైర్మన్ అధికారులు వెళ్లి పోయిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఇటీవల మైనార్టీ కార్పొరేషన్ ప్రకటించిన లోన్ల కోసం పేద మైనారిటీ వర్గాల ప్రజలు ఇన్కమ్ సర్టిఫికెట్ క్యాస్ట్ సర్టిఫికెట్లు అప్లికేషన్ ల కొరకు 1000 నుండి 1500 వందల రూపాయలు ఖర్చుపెట్టి అప్లికేషన్ చేశారు. ఇటీవల మున్సిపల్ సిబ్బంది ఒక బెన్ ఫిషర్స్ లిస్ట్ ప్రకటించి ఇంటర్వ్యూ స్క్రీన్ టెస్ట్ ఉందని చెప్పి మున్సిపల్ కి రావాలని పత్రిక ప్రకటన, కౌన్సిలర్ ల ద్వారా సమాచారం ఇచ్చారు. అది చూసిన లబ్ధిదారులందరూ మున్సిపల్ కి వచ్చాక తీరా ఏమాత్రం సౌకర్యాలు లేకుండా పేద ప్రజలను నిలబెట్టి స్క్రీన్ టెస్ట్ ఇంటర్వ్యూ అని ఏది లేకుండా వచ్చిన వాళ్ళందరూ అప్లై చేసిన జిరాక్స్ సెట్ ఇచ్చి వెళ్ళాలి అని జనగామ టౌన్ మొత్తానికి 3 యూనిట్స్ మాత్రమే అని చెప్పడంతో ప్రజలందరూ ఒక్కసారిగా అధికారులపై రోజు కూలి పని చేసుకుంటే తప్ప పొట్టనిండని మేము పని వదిలేసి అందరు ఇక్కడికి వస్తే జిరాక్స్ ఇచ్చి వెళ్లడం ఏంటి పద్ధతి అని ఇంతదానికి ఇక్కడికి ఎందుకు పిలిచారని అధికారులను నిలదీశారు. దీనికి ఏమాత్రం సమాధానం చెప్పకుండా మున్సిపల్ చైర్ పర్సన్, మున్సిపల్ కమిషనర్, అక్కడ నుంచి వెళ్లిపోయారు. కటిక పేదరికం వల్ల



లోన్ అని ఆశపడి వచ్చిన మైనార్టీ వర్గాల ప్రజలపై ఇలా ప్రవర్తించడం సరైన పద్ధతి కాదని, మైనార్టీ ప్రజల ఆత్మ గౌరవం దెబ్బ తీసే విధంగా మున్సిపల్ అధికారుల వైఖరి ఉందని ఇలాంటి చర్య పునరావృతం కాకుండా అప్లై చేసిన ప్రతి ఒక్క లబ్ధిదారులకి లోన్ వచ్చే విధంగా కృషి చేయాలని ప్రభుత్వాన్ని నాయకులు జమాల్ షరీఫ్, మాజీద్ డిమాండ్ చేశారు.

**తెలంగాణ గిరిజన సంఘం జిల్లా కమిటి ఆధ్వర్యంలో జనగామ పట్టణంలోని ఉన్న గిరిజన బాలుర కళాశాల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లా కలెక్టరేట్ లో ఎంఒ కి రాష్ట్ర కమిటీ సభ్యులు అజ్మీరా సురేష్ నాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు తేజావాత్ గణేష్ నాయక్ కలిసి వినతిపత్రం అందజేశారు.**



## 2,90,396 కోట్లతో ప్రవేశపెట్టిన తెలంగాణ బడ్జెట్

**అన్నివర్గాల ప్రజల ఆకాంక్షలకు అద్దం**

**హైదారబాద్ ఫిబ్రవరి 07 (ప్రజామంటలు):** 2,90,396 కోట్లతో ప్రవేశపెట్టిన తెలంగాణ బడ్జెట్ అన్నివర్గాల ప్రజల ఆకాంక్షలకు అద్దం పట్టిన నేపథ్యంలో ముఖ్యంగా సకల జనుల సంక్షేమం పరుగులు



పెడుతున్న తెలంగాణ ప్రగతి రథం మరింత వేగం అందుకునే ఇంధనంగా సోమవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన మంత్రి హరీష్ రావు కి కృతజ్ఞతలు తెలియజేస్తూ, తెలంగాణ ఆచరించే దానిని దేశం అనుసరించే విధంగా తేల్చి చెప్పిన బడ్జెట్, దేశ తలసరి ఆదాయం రెండు లక్షలు దాటడానికే ఇబ్బందులు పడుతున్న సమయంలో రాష్ట్ర తలసరి ఆదాయాన్ని మూడు లక్షలు దాటించిన కేసీఆర్ కి కృతజ్ఞతలు. ముఖ్యంగా తెలంగాణ ఉద్యోగులు గత రెండు దశాబ్దాలుగా కలలుగన్న ఈ హెచ్ ఎస్ పథకాన్ని మరింత బలోపేతం చేసి ప్రతి ఉద్యోగికి, పెన్షనర్లకు మెరుగైన వైద్యం అందించే విధంగా బడ్జెట్లో 700 కోట్ల రూపాయలు ప్రకటించడం పట్ల ముఖ్యమంత్రి కేసీఆర్ కు, ఆర్థిక మంత్రి హరీష్ రావు లకు కృతజ్ఞతలు.

## పేద వైద్య విద్యార్థినికి హార్ట్ టూ హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సహాయం”

**హన్మకొండ ఫిబ్రవరి 07 (ప్రజామంటలు):** హార్ట్ టూ హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంళవారం వరంగల్ కు చెందిన మరపల్లి రమ్య వైద్య విద్యార్థిని ఆర్థిక సహాయం అందజేసినట్లు ట్రస్ట్ ఫౌండర్ మూడే రవి నాయక్ తెలిపారు. రమ్య ఎం.బి.బి.ఎస్ రెండవ



సంవత్సరం చల్మెడ ఆనంద్ రావు ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్, కరీంనగర్ కాలేజీలో చదువుతున్న జి.శ్రీనివాస్ డివిజనల్ ఇంజనీర్ “విద్యుత్ శాఖ” వారు సహకారంతో 10 వేల రూపాయల చెక్కు రూపంలో ఆర్థిక సహాయాన్ని అందజేశారు. జి. శ్రీనివాస్, రమ్య ఎం.బీ.బీ.ఎస్ పూర్తి అయ్యేంతవరకు ఆర్థిక సహాయాన్ని అందిస్తామన్నారు. వారికి రమ్య కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. విద్యార్థిని రమ్య తండ్రి బిక్షపతి తనకు 5 ఏట నుంచి పోలియో సోకగా, వికలాంగుడు తాను పెయింటర్ గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తూ ముగ్గురు కుమార్తెలను చదివించారు. గత 5 సంవత్సరాల క్రిందట రోడ్డు ప్రమాదంలో ఎడమ చేయి భాగం కోల్పోవడంతో పిల్లలను చదివించడంతో పాటు కుటుంబాన్ని పోషించడం భారంగా మారింద న్నారు. ఈ సహాయం వల్ల పిల్లలకు చదువు మధ్యలో ఆగి పోకుండా ఉండేందుకు చూస్తున్నా వీరికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## దుర్గమ్మ దేవాలయ నిర్మాణానికి 20 వేల విరాళం ఇచ్చిన ముక్కెర

**నర్మెట్ట పిబ్రవరి 07 (ప్రజామంటలు):** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకులు సామాజికవేత్త ముక్కెర తిరుపతి రెడ్డి నర్మెట్ట మండల కేంద్రంలోని గండీరామారం గ్రామంలో దుర్గమ్మ గుడి నిర్మాణానికి తన వంతు సాయంగా 20 వేల రూపాయలు విరాళంగా అందజేసినారు.



ఈ రోజు బిజెపి నర్మెట్ట మండల అధ్యక్షులు ధరావత్ రాజు నాయక్ మరియు బిజెపి నాయకులు దేవాలయ కమిటీ నాయకులకు మరియు గ్రామస్తులకు అందజేసినారు. అనంతరం గ్రామస్తులు మాట్లాడుతూ మా దేవాలయ నిర్మాణానికి 20 వేల రూపాయలు ఆర్థిక సాయం చేసిన ముక్కర తిరుపతి రెడ్డి మరియు బిజెపి నాయకులకు ధన్యవాదాలు తెలుపుతూ... ఆ దుర్గ మా ఆశీస్సులతో రాబోయే కాలంలో తిరుపతి రెడ్డి రాజకీయంలో ఉన్నత స్థాయిలో ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి సోక్కం అనిల్ కుమార్, బీజేపీ నర్మెట్ట ప్రధాన కార్యదర్శి పిన్నటి శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ నాయకులు నిమ్మ హరెందర్ రెడ్డి, శంకరయ్య, బూత్ అధ్యక్షులు కొర్ర నరేష్, చెవుల రాజు, మరియు సిద్ధులు, గ్రామస్తులు నాయకులు పాల్గొన్నారు.

## ఇబ్రహీంపట్నంలో బీజేపీ శిక్షణ తరగతులు

**సికింద్రాబాద్ ఫిబ్రవరి 07 (ప్రజామంటలు):** ఇబ్రహీంపట్నం మన్నేంగూడ లోని వేద కన్వెన్షన్ సెంటర్ లో మంగళవారం భారతీయ



జనతా పార్టీ నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. స్టేట్ బీజేపీ ప్రెసిడెంట్, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ తో పాటు మాజీ మంత్రి, ఎన్.డీ.ఎమ్.ఏ మాజీ వైస్ ప్రెసిడెంట్ మర్రి శశిధర్ రెడ్డి లు హాజరయ్యారు. ఈ శిక్షణ తరగతుల కార్యక్రమానికి రాష్ట్రంలోని ముఖ్యమైన పార్టీ నేతలు, కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరయ్యారు.

# ఆదానీ వ్యవహారంపై మౌనమేల!!

ఆదానీ వ్యవహారం పార్లమెంటును కుదిపేస్తున్నా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చలించడంలేదు. అతిపెద్ద ఆర్థిక సంక్షోభం దేశంలో జరిగితే తమకు సంబంధం లేదన్నట్లుగా కేంద్రం వ్యవహరిస్తోంది. పార్లమెంట్ వరుసగా నాలుగోరోజూ కూడా వాయిదా పడుతూ వచ్చింది. అయినా ఈ విషయంలో ఓ ప్రకటన అయినా చేయడం లేదు. ఆదానీ వ్యవహారంతో స్టాక్ మార్కెట్ కుదేలయ్యింది. ఎల్ఐసి, ఎస్‌బిఐ పెట్టుబడులపై కేంద్రం నోరుమెదపడం లేదు. దీనికితోడు ఇది స్టాక్ మార్కెట్‌కు సంబంధించిన వ్యవహారంగా ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ సరిపుచ్చారు. జెపిసి అంటే జాయింట్ పార్లమెంటరీ కమిటీ విచారణ కు పట్టుబట్టిన విపక్షాలు ఆందోళనచేస్తున్నా పట్టించుకోవడం లేదు. ఆర్థిక సంక్షోభాన్ని పట్టించుకోకుంటే మరి కేంద్రం ఎందుకన్న ప్రశ్న వేసుకోవాలి. ఏమాత్రం స్వంత ప్రయోజనాలు లేకుంటే మోడీ ఎందుకు మౌనం వహించాలి. ఓ విదేశీ సంస్థ చేసిన ఆరోపణలను ఎందుకు పట్టించుకోవడం లేదు. చేతకాని వాళ్లకు ఆక్రోశం ఎక్కువ..ఏమీ చేయలేని వారు ఎదుటివారిని నిందిస్తూ ఉంటారు.. వారివల్లనే ఇదంతా జరిగిందని అంటుంటారు. ప్రధాని మోడీ కూడా అదేకోవలోకి వస్తారు...ఎలాంటి స్పందన లేకుండా గంభీరమైన ప్రకటనలు చేస్తూ పోతారు. దేశంలో ఆర్థిక సంక్షోభం కళ్లకు కనిపిస్తుంటే మోడీ తన చేతకాని తనాన్ని బయట పెట్టుకున్నారు. ఆయన అసమర్థ ప్రధాని అని నిరూపించుకున్నారు. దేశంకోసం ఏం చేస్తున్నామో ఆత్మవిమర్శ చేసుకోవాలి. ప్రజలు అన్నమో రామచంద్రా అని చస్తుంటే కనీసం వారిని ఎలా ఆదుకోవాలన్న ఆలోచన లేదు..నిరుద్యోగాన్ని ఎలా తుదముట్టించాలో తెలియడం లేదు. దేశంలో నిరుద్యోగం అనకొండలాగా పెరుగుతున్నా ప్రణాళికలు లేవు. ఆదానీ అంబానీలను పెంచి పోషించి..వారిని ప్రపంచం లో నంబర్‌వన్ పారిశ్రామికవేత్తలుగా ఎలా చేయాలో అన్న ఆలోచన తప్ప సామాన్యుల గురించి ఆలోచన చేశారా అన్నది.. బిజెపి నేతలు..ఆర్ఎస్ఎస్ ముఖ్యులు ఆత్మవిమర్శ చేసుకోవాలి. వివిధ రాష్ట్రాల్లో అధికారం దక్కించుకోవడమెలా అన్న ఆలోచనలో ప్రజలను విస్మరించి పాలన చేస్తున్న బిజెపి మూల్యం చెల్లించుకోక తప్పదు. ఒక్క మోడీ కారణంగా బిజెపికున్న ఛరిష్మా మొత్తం గంగలో కలిసి పోయింది. ఆదానీకి శ్రీలంకలో పవర్ ప్రాజెక్టులు కట్టబెట్టేందుకు ప్రధాని మోడీ పైరవీలు చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. కనీసం దీనిని కూడా ఖండించక పోవడం అనుమానాలకు బలం చేకూర్చింది. ప్రభుత్వరంగ సంస్థలను బలోపేతం చేయకుండా ఎందుకు అమ్ముతున్నారో జాతికి జవాబు చెప్పడం లేదు. విశాఖ ఉక్కు, ఎల్ఐసి తదితర సంస్థలను ఎందుకు అమ్ముతున్నారో పార్లమెంట్ వేదికగా ఎందుకు చెప్పడం లేదో మోడీని బిజెపి నిలదీయాలి. వాటిని బలోపేతం చేసి మరికొంతమందికి ఎందుకు ఉద్యోగావకాశాలు ఇవ్వలేకపోతున్నారో చెప్పాలి. సాగు చట్టాలతో రైతులను ఏడాదిగా ఎందుకు క్షోభ పెట్టారో చెప్పాలి. నోట్ల రద్దు పర్యవసానాలు, జిఎస్టీ వాయింపులు,



పెట్రో ధరల పెంపు, గ్యాస్ ధరల పెంపుపై సమాధానం ఇవ్వాలి. వీటివల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎందుకు గుర్తించడం లేదో... వాటిని సమస్యలుగా ఎందకు పరిగణించడం లేదో చెప్పాలి. పార్లమెంట్ ఉన్నదే ఇలాంటి సమస్యలను చర్చించడానికి. కానీ ..మోడీ అధికారంలోకి వచ్చాక పార్లమెంట్ అన్నది మిథ్యగా మారింది. ఏ అంశం అయినా చర్చకు నోచుకోవడం లేదు. నిజంగానే ప్రధాని మోడీ సర్వసమర్థుడు అయితే పెట్రోధరలను ఎందుకు తగ్గించడం లేదు.గ్యాస్ సిలిండర్ ధరలను ఎందుకు తగ్గించడం లేదు.. పెట్రోల్, డీజిల్ ధరలను ఎందుకు దారికి తేవడం లేదు... ప్రజలకు కావాల్సింది పార్లమెంటులో వీటన్నింటికీ సమాధానమా అన్నది మోడీ గుర్తించాలి. నిజానికి సమర్థ ప్రధాని అయితే విభజన సమస్యలను ఎందుకు పట్టించు కోవడం లేదు. ఎందుకు పరిష్కరించడం లేదు. ఇవన్నీ పట్టించుకోక పోవడం చేతగానితనంకాక మరోటి కాదు.

రూపాయి మారకం విలువ ఎందుకు పెరిగిందో చెప్పాలి. బిజెపి నేతలు కూడా తానా అంటే తందానా అన్నట్లుగా వంతపాడడం తప్ప మరేమీ పట్టనట్లు మాట్లాడడం లేదు. ఇది ఎంతవరకు సమంజసమో ఆత్మవిమర్శ చేసుకోవాలి. మొత్తంగా బిజెపి తీరు.. నానాటికీ తీసికట్టు నాగంభొట్లు ..అన్నట్లుగా తయారయ్యింది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో అధికారంలోకి రావాలని ఆశ పడుతున్న బిజెపి అసలు ఎజెండా ఏమిటో చెప్పడం లేదు. ప్రజల సమస్యలను పరిష్కరించే తీరులో నిజాయితీ కనిపించడం లేదు. ఆహా ఓహో అంటూ.. భజనలను చేయించుకోవడం తప్ప అధినాయకత్వం సమస్యల విషయంలో సత్వర పరిష్కారం చూపడంలేదు. ఎపిలో అమరావతి రాజధాని ఉద్యమంపై స్పష్టత లేదు. అలాగా తాజాగా విశాఖ స్టీల్ ప్లాంట్‌ను మాత్రం తెగన మ్మడానికి ఉత్సాహం చూపుతోంది. విశాఖ స్టీల్ కోసం ఆందోళన చేస్తున్నా పెద్దగా పట్టించుకోవడం లేదు. తెలంగాణ లో సైతం ప్రజా సమస్యలపై స్పష్టత కానరావడం లేదు. ఎపి విషయానికి వస్తే ప్రధానంగా రాజధాని, పోలవరం, విశాఖ ఉక్కుపై ప్రజలకు ఎలాంటి హామీ ఇస్తారో కూడా చెప్పడం లేదు. కేంద్రప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు రాష్ట్రంలో ఆ పార్టీ ఎదుగు దలను అడ్డుకుంటున్నా లెక్కలే కుండా సాగుతున్నారు. విశాఖ ఉక్కును ప్రైవేటీకరించాలన్న నిర్ణయం విషయంలో కేంద ప్రభుత్వం అడుగులు ముందుకేస్తే బిజెపికి పుట్టగతులుండవని గుర్తించుకోవడం లేదు. విశాఖ ఉక్కు విషయంలో కేంద్రం తీరును అడ్డుకోవాల్సిన బాధ్యత స్థానిక బీజేపీ నేతలపైనే ఎక్కువగా ఉంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజనపై కాంగ్రెస్ ఎలా వ్యవహరించిందో అన్నది ఇప్పుడు సమస్య కాదు..విభజన తరవాత అధికారం లోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం ఎంత హుందాగా సమస్యలను పరిష్కరించిందో అన్నది కావాలి. ఎన్ని సమస్యలను పరిష్కరించారో కావాలి.అయితే సమస్యలను పరిష్కరించి..ప్రజలతో శహభాష్ అనిపించుకోవాలి. ఎన్నో దఫాలుగా అటు ఆంధ్రప్రదేశ్, ఇటు తెలంగాణ.. కేంద్రం దృష్టికి సమస్యలను తీసుకెళ్లినా పరిష్కారం చేయడం లేదు. ఏపీకి ప్రత్యేక హోదా ఇచ్చే విషయమై కేంద్ర ప్రభుత్వం ఎన్ని కుంటిసాకులు చెప్పిందో తెలియంది కాదు. సరైన పద్ధతిలో తెలంగాణ, ఏపీ విభజన జరగలేదంటున్న మోడీ సరైన విధంగా ఎందకు పరిష్కరించడం లేదో చెప్పాలి.

వీటన్నింటికి సమాధానం చెప్పకపోవడం.. పరిష్కారానికి ప్రయత్నించక పోవడం అసమర్థుడి లక్షణం తప్ప మరోటి కాదు.




## సాహితీ ప్రేమికులకు ప్రత్యేకం

"ప్రజా మంటలు" తెలంగాణ జాతీయ దినపత్రికలో ప్రతి రోజు ఒక కథను ప్రచురిస్తున్నాం. ముఖ్యంగా బాలల కథలకే ప్రాధాన్యత ఇస్తున్నవిషయాన్ని గమనించి ఉంటారు. ఇందులో ప్రచురించిన కథలలో, ఎంపిక చేసిన వాటిని "యూ ట్యూబ్"లో కూడా పెట్టగలము. కథకులు ఈ విషయాన్ని గమనించి, సంభాషణలు చిన్నవిగా, వర్ణన తక్కువగా, సూటిగా విషయాన్ని చెప్పే కథలను పంపండి. రచయితలు తమ కథలను mantalukathalu@gmail.comకు పంపవచ్చు...

-ఎడిటర్

## అనసూయ

(నిన్నటి సంచిక తరువాయి)

"అసలు నేను చెప్పుకోటానికీ, మీరు వినటానికి నాకెప్పుడైనా టైమిచ్చారా? మీరు ఆయాకు చెప్పటం. ఆయ నాకు చెప్పటం. నేను ఆయకు చెప్పిన మాటలు మీదాకా రావు. వచ్చినా పట్టించుకోరు. ఇంట్లో వాళ్ళు ప్రేమించక పోతే, ఆ ప్రేమ బయట దొరికితే, చిన్న పిల్లలైనా, నా లాంటి పెద్ద పిల్లైనా అల్లుకు పోరా ! అతుక్కు పోరా? "

"ఏంటీ, కవిత్వం చెపుతున్నావా? "

"నాకు అనిపించింది చెపుతున్నా. ఇది మీకు కవిత్వంలా అనిపించిందా? "

"ఏ సినిమాలోది ?"

" నేను సినిమాలు కూడా చూస్తానా ? ఇదేగా నేను అంటున్నది. అసలు నాకేది ఇష్టమో, నేనేమి చేస్తున్నానో మీకు పడితే కదా ?"

ఇంతలో అమ్మ ఫోను మోగింది. అమ్మ తన గదిలోకి వెళ్ళి పోయింది.



ఈ సంభాషణంతా విన్నాడో లేదో నాన్న. మౌనంగా ఏదో ఆలోచిస్తూవుండి పోయాడే గానీ, ఒక్క మాటా మాట్లాడ లేదు.

" అనూ ! " అంటూ దగ్గరకొచ్చి అను భుజంమీద చెయ్యి వేశాడు. ఇంతలో.. ఈయన గారి ఫోను రింగైంది. తను మరో రూంలో దూరాడు. ఇదే అనుకు ఊహ వచ్చిన దగ్గరనుంచి జరుగుతున్నది, చూస్తున్నది. మరో పది నిమిషాల్లో ఎవరి పని మీద వాళ్ళు వెళ్ళి పోయారు. అనసూయ ఏమాత్రం ఆశ్చర్య పోలేదు. తనకిది అలవాటేగా.

డాక్టర్ చెప్పినట్టుగానే ఛార్లెస్ ను డిచార్జ్ చేశారు. ఇంటికి వచ్చారు. అనసూయ మరో మూడు నెలలు తల సెలవు పొడిగించింది. అత్తగారు కోడలికి ఒక కన్న తల్లిలా చెప్పింది.

" చూడమ్మా ! మా ఛార్లెస్ సంగతి మాకందరికీ బాగా అర్థమైంది. ప్రభువు వాడియందు లేడు. మేమందరం రక్త సంబంధికులము. ఎవరిమో ఒకరము నిరంతరం వాడి బాగోగులు చూచుకుంటాము. నువ్వు చిన్న పిల్లవు. ఛార్లెస్ చెప్పినట్టు చెయ్. ఆ ప్రభువు నిన్ను చల్లగా చూడాలి ", అంటూ అనునయించే ప్రయత్నం చేసింది.

" అదేంటత్తయ్య మీరు కూడా అలా అంటారు? నా జీవితమంతా ఛార్లెస్సే. మీ కుటుంబంలో నా కెంతో ప్రేమ దొరికింది. ఈ మూడు సంవత్సరాలలో నాకేమైనా పని చెప్పారా మీరు ? ఏదో ఉద్యోగం చేస్తున్నానని, నా పనులూ మీరే చేసి పెట్టారు. ఇకనైనా నా పనులు ఛార్లెస్ పనులు నన్ను చేసుకోనివ్వండి" , తన నిశ్చితాభిప్రాయం చెప్పింది అనసూయ.

"చూడు అను. ఛార్లెస్ గానీ, నేను గాని ఎందుకు చెపుతున్నామో అర్థం చేసుకో. నీ మంచి...."

ఇంకా ఏదో చెప్పబోతుండగ,

" చూడండి అత్తయ్య . ఇక మీరు ఏమీ చెప్పవద్దు. ఛార్లెస్ మీకెంతో నాకూ అంతే. నా కన్న బిడ్డా సాకుకుంటా. ఈ జన్మకిది చాలు. దయచేసి ఇంకెప్పుడూ ఇలాంటి మాటలు మాట్లాడకండి. "

ఈ సంభాషణ తరువాత ఆ కుటుంబంలో ఎవరూ అనుసూయను అనునయించే ప్రయత్నం చేయలేదు. ఛార్లెస్ ఒకటి రెండు సార్లు చెప్ప బోయే ప్రయత్నం చేసినా, కాస్తా కటువుగానే తిరస్కరించి హెచ్చరించింది. అంతటితో ఆ కథ ముగిసింది.

మూడు నెలల్లో ఛార్లెస్ కొంత కోలుకున్నాడు. అంటే భార్యా సహాయంతో బాత్ రూంకు వెళ్ళడం, మొఖం కడుక్కోవటం, వాలు కుర్చీలో కూర్చొని తినటం, టీవీ చూడటం.

సెలవులు అయిపోగానే ఉద్యోగంలో చేరింది. అది కూడా ఛార్లెస్ బలవంతం చేస్తే. కుటుంబంలో అందరూ ఉద్యోగస్తులే. ఆర్థిక సమస్యలేమీ లేవు. కానీ తామిద్దరూ కూర్చుని తినటం బాగుండదని, అన్నదమ్ములు, వదిన మరదళ్ళు ఎంత చెప్పినా వినకుండా అనుసూయను ఉద్యోగానికి పంపించాడు. ఇక పగలంతా బోరు కొట్టకుండావుండటానికి తనెప్పుడో వదిలేసిన రచనా వ్యాసంగాన్ని ప్రారంభించాడు. తానా వారికి ఒక కథానికను పోటికి పంపించాడు 'అనుశ్రీ' అనే కలం పేరుతో. ఆ కథకు ప్రథమ బహుమతి వచ్చింది, పాతిక వేలు డబ్బా వచ్చింది. ఆ ఉత్సాహంతో అనేక పత్రికలకు కథలు పంపించాడు. ఆరు నెలల్లో ఇరవై కథలు రాశాడు. ఐదింటికి ప్రథమ బహుమతులు, మరో నాలుగు కథలకు ద్వితీయ బహుమతులు వచ్చాయి. ఉభయ తెలుగు రాష్ట్రాలలోనే కాదు, అమెరికా వరకు అనుశ్రీ పేరు మారుమ్రోగింది. వర్ధమాన కథా రచయితగా విమర్శకులు ఆయన శైలిని , కథాకథనాన్ని మెచ్చుకుంటూ పత్రికల్లో అనేక వ్యాసాలు రాశారు.

బహుమతులు అందుకోటానికి ప్రత్యక్షంగా తను వెళ్ళక పోవటం కూడా అతనికి మంచిదే అయింది. అనేక మంది విమర్శకులు ' అనుశ్రీ బహుమతులకోసం, పేరు కోసం తన కలాన్ని తాకట్టు పెట్టడ'ని పొగిడారు.

కరోనా మహమ్మారి ఫలితంగా ఛిద్రమైన వలస బ్రతుకుల మీద రాసిన మొదటి నవల 'చతుర ' మాస పత్రికలో ప్రచురించబడింది. అదో సంచలనం సృష్టించింది. తెలుగు రాష్ట్రలలోని అనేక సాహితీ సంస్థలు ఆ నవలకు బహుమతులు ప్రకటించాయి. తెలుగు విశ్వవిద్యాలయం వారు నవలా విభాగంలో ఉత్తమ రచనగా గుర్తించి, అవార్డు ప్రకటించారు. ఆ అవార్డు తీసుకోటానికి హైదరాబాద్ రావలసిందిగా ఆహ్వానం అందింది. ఛార్లెస్ ఆరోగ్య పరిస్థితి గురించి యూనిర్సిటీ వారికి అనసూయ వివరించింది. ఇది మరో సంచలనమైంది. 'మడత కుర్చీకే పరిమితమైన మహా రచయిత అనుశ్రీ స్టీఫెన్ విలియం హాకింగ్' అంటూ పత్రికలు, టీవీలు కథనాల్ని ప్రచురించాయి, ప్రసారం చేశాయి. కొన్ని ఛానల్స్ ఇంటర్వ్యూలు చేశాయి.

సమకాలీన సామాజిక సమస్యలపై తన పరిశీలన, పరిష్కారాలు సూచిస్తూ చేసిన రచనలు పాఠకుల్ని చైతన్య పరిచాయి. కథైనా, నవలైనా, వ్యాసమైనా , కవితైనా, పాటైనా అనుశ్రీ కలం నుండి అక్షరాలు చైతన్యమై ఆబాలగోపాలాన్ని మేల్కొలుపుతాయి. రెండు నవలల సినిమాలుగా వచ్చాయి. అందులో ఒక సినిమా కథకు ఉత్తమ సినీరచనా పురస్కారం లభించింది.

అనుశ్రీ రచయిత ప్రతి విజయం వెనక అనసూయ పాత్రవుందని తెలుగు సమాజం మొత్తానికి తెలిసిపోయింది. అనసూయ , ఛార్లెస్ జీవితమే ఒక కథగా సినిమా తీయటానికి ఎంతో మంది నిర్మాతలు ముందుకు వచ్చారు. అనసూయ ఆత్మ కథ ఆధునిక సమాజానికి ఒక దిక్సూచి అయింది.


(సమాప్తం)

-మండవ సుబ్బారావు
9493335150

## పాత్రికేయ దిగ్గజం పొత్తూరి

### ఫిబ్రవరి 8...పొత్తూరి వెంకటేశ్వరరావు జయంతి

పొత్తూరి వెంకటేశ్వరరావు... తెలుగు పత్రికా పాఠకులకు సుపరిచితమైన పేరు. అయిదు దశాబ్దాలకు పైగా పత్రికా రంగంలో మమేకమై, తనకంటూ ప్రత్యేక గుర్తింపు పొందిన తెలుగు జర్నలిజానికి సాధికారిక గుర్తు ఆయన. విలువలకు ప్రాధాన్యత ఇచ్చి, కట్టుబడి, ఎన్నడూ రాజీ పడని అరుదైన వ్యక్తిత్వం ఆయనది. ఒక ట్రెండ్ సెట్టర్‌గా నేటి తరానికి అచ్చమైన స్వచ్ఛమైన మార్గదర్శి పొత్తూరి.



1934 ఫిబ్రవరి 8వ తేదీన గుంటూరులో జన్మించిన డాక్టర్ పొత్తూరి వెంకటేశ్వరరావు 1957లో ఆంధ్ర జనతా పత్రికలో తొలిసారిగా ఆయన పాత్రికేయుడిగా, తొలి అడుగు వేశారు. ధృఢ చిత్తులై, వృత్తి నిబద్ధత, నిజాయితీ, బాధ్యతల విషయంలో ఎన్నడూ వెనకడుగు వేయనే లేదు.

ఈనాడు, ఆంధ్రభూమి, ఆంధ్రప్రభ, వార్త దినపత్రికల్లో ఎక్కడ పని చేసినా తన ప్రత్యేక ముద్రలు వేశారు. పొత్తూరి ఐదు దశాబ్దాలకు పైగా తెలుగు పత్రికా రంగంలో అనేక యాజ మాన్యాలను, సంఘటనలను, సందర్భాలను, పరిణామాలను, మార్పులను గమనించారు. తనదైన ప్రత్యేక శైలి సంపాదకీయాలు రాశారు. పొత్తూరి అంటే ఒక ప్రత్యేక గుర్తింపు పొందారు.

ఆంధ్ర ప్రదేశ్ ప్రెస్ అకాడమి అధ్యక్షుడిగా వ్యవహరించారు. తెలుగు భాషా వికాసానికి, సాహిత్యాభివృద్ధికి నిరంతర కృషి చేశారు. ఎందరో సాహితీ వేత్తలకు వెన్నుదన్నుగా నిలిచి నిలిచి భాషాభ్యున్నతికి చేయూత అందించారు.

దాదాపు నూట యాభై యేళ్ళ తెలుగు పత్రికా చరిత్ర గురించి సంపూర్ణ అవగాహన కలిగి, స్వయంగా ఒక సకల విషయ సంగ్రహ నిధిగా నిలిచారు.

పత్రికా రచనల పట్ల, తెలుగు సాహిత్యం పట్ల ఆయన అంకిత భావం సాటిలేనిది. అందుకే తెలుగు పత్రికా రంగంలో మేటి సంపాదకులుగా పొత్తూరి గుర్తింపుపొందారు. సాహిత్య, సాంస్కృతిక, సాంఘిక, చమత్కార, జ్ఞాన, విజ్ఞాన, రాజకీయ ఒక్కటేమిటి పాత్రికేయులకు ఉండాల్సిన అన్ని అంశాలలో అపారమైన జ్ఞాన సంపన్నులుగా అసమాన ప్రతిభ కనబరిచారు.

"నాటి పత్రికలు విలువలు పాటించేవి. సంపాదకులు నడిపించే వారు. నేడు పరిస్థితి వేరు. యజమానులే నడిపిస్తున్నారు. పత్రికల ప్రతులు ఎక్కువ సంఖ్యలో అమ్ముకోవడానికి తాపత్రయ పడుతున్నారు. విలువలు పడి పోయాయని" తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తుండే వారు. యాజమాన్యాల భావజాలాలు అనుగుణంగా కాకుండా, సర్వ స్వతంత్రులుగా వ్యవహరించే వారు. కొన్ని సందర్భాలలో యాజమాన్యం ఆంక్షలు విధించితే, రాజీ పడక, రాజీనామా చేసి వెళతానని నిక్కచ్చిగా చెప్పేవారు పొత్తూరి వెంకటేశ్వరరావు. ఆయన వ్యాస పరంపర ఎంతో విలువైన సమాచారాన్ని విలువ కలిగిన సమాచార యుక్తంగా సామాన్య భాషలో, సూటిగా ఆకర్షణీయంగా ఉండేవి. తుదిశ్వాస వరకు జర్నలిజం విలువలకు కట్టుబడి తనదైన విలక్షణ వ్యక్తిత్వానికి దర్పణంగా నిలిచిన ధన్యజీవి పొత్తూరి.

నాటి పత్రికల మేటి విలువల, చింతన, చిరస్మరణీయులు, కాశీనాధుని నాగేశ్వరరావు, పారమార్థిక పదకోశం తదితర రచనలు చేశారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం నక్సలైట్లతో జరిపిన చర్చల్లోపౌర స్పందన వేదిక సభ్యుడిగా పొత్తూరి క్రియాశీల పాత్ర పోషించారు. తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురణలకు గౌరవ సంపాదకత్వం కూడా వహించారు. లోకాయుక్త కమిటీలో జ్యుడీషల్ సభ్యుడిగా, సలహాదారుగా పొత్తూరి పనిచేశారు. పొత్తూరి వెంకటేశ్వరరావు బ్రిటీష్ లైబ్రరి సభ్యత్వం కలిగి ఉన్న అపురూప గౌరవం దక్కించుకున్నారు.

తెలంగాణ ఉద్యమ సమయంలో పొత్తూరి రాష్ట్ర విభజన సమయంలో ప్రత్యేక రాష్ట్ర వాదనకు ఆయన మద్దతు తెలిపారు. 2020 మార్చి 5న పొత్తూరి లోకాన్ని వదిలి వెళ్లారు.



-ఆర్కె సంగనభట్ల
9440595494

## వివాహవయస్సు 21 ఏళ్లు ఉండాల్సిందే..!

### అప్పడే అమ్మాయిలకు ఆరోగ్యానికి రక్షణ

### ప్రముఖ బాలల హక్కుల పోరాట నేత కాశీనాథ్

**హైదరాబాద్,ఫిబ్రవరి7:** అమ్మాయిలకు కనీస వివాహ వయసు 18 కాకుండా 21 ఏళ్లు ఉండాలని కేంద్రం చేసిన ప్రతిపాదనలు



చట్టరూపంలోకి తీసుకుని రావాలని బాలల హక్కుల సంఘం, స్వచ్ఛందసంస్థ ప్రతినిధులు డిమాండు చేస్తున్నారు. దీనిపై విపక్షాలు మోకాలడ్డడం సరికాదన్నారు. ఇది వయసుకు సంబంధించిదే తప్ప మతానికి ముడిపెట్టరాదన్నారు. పెళ్లీడుకు ముందు జరుగుతున్న వివాహాల వల్ల బాలికల ఆరోగ్యం దెబ్బతింటోందని ప్రముఖ బాలల హక్కుల పోరాట నేత కాశీనాథ్ అన్నారు.

బాలలహక్కుల సంఘం స్వచ్ఛందసంస్థల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, న్యాయనిపుణులు, సామాజికవేత్తలు, సైకియాట్రిస్టులు, గైనకాలజిస్టుల గతంలో అనేకమార్లు ఈ ప్రకటన చేశారు. ఈ ప్రతిపాదనను మహిళా సంఘాలు స్వాగతిస్తున్నాయి. కేంద్రం ఇటీవల వివాహ వయస్సును 21 ఏళ్లకు పెంచాలని నిర్ణయించినా సెలెక్ట్ కమిటీకి పంపారు. దీనిని చట్టం చేయడంతో పాటు ప్రచారం చేయాలని ఆయన అన్నారు. అప్పుడే మహిళలకు రక్షణ కూడా ఉంటుందని అన్నారు. యువతులకు 18 ఏళ్ల వయసులో భావోద్వేగ పరిపక్వత ఉండదని చెప్పారు. వివాహాలు విజయవంతం కావాలంటే పెళ్లికూతురి వయసు 21 ఏళ్లు ఉండాలన్నారు.

అమ్మాయిలు ఆర్థిక స్వాతంత్య్రం సాధించాలంటే వారు ఉన్నతవిద్య అభ్యసించాలని సూచించారు. అమ్మాయిల వివాహ వయసు తక్కువ ఉంటే వారు గర్భం దాల్చినపుడు తల్లీ పిల్లల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపిస్తుందని గౌనకాలజిస్టులు చెప్పారు. గర్భం దాల్చేందుకు మహిళలకు 21 నుంచి 25 ఏళ్లు సరైన వయసు అని డాక్టర్లు సూచించారు. తక్కువ వయసులో అమ్మాయిలకు పెళ్లి చేస్తే పిల్లల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపిస్తుందని వైద్యులు ఆందోళన వ్యక్తం చేశారు. వారి ఆరోగ్యానికి కూడా క్షేమం కాదన్నారు.

## విశాఖ ఉక్కుపై మౌనం: రాజధాని కోసం ఉక్కు సంకల్పం

విశాఖ ఉక్కు వ్యవహారంలో అధికార వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మౌనం వహిస్తోంది. కేంద్రాన్ని నిలదీసే చర్యలకు పూనుకోవడం లేదు. అధికార, విపక్షాలు ఉమ్మడిగా కేంద్రాన్ని నిలదీయలేకపోతున్నాయి. అందరిదీ అధికార యావ కావడంతో కేంద్రం విషయంలో గట్టిగా పోరాడలేకపోతున్నారు. ఈ విషయంలో కార్మికులు అలుపెరగని పోరాటం చేస్తున్నారు. ప్రజా సంఘాలు, లెఫ్ట్ పార్టీలు మాత్రమే వారికి మద్దతుగా పోరాడుతున్నాయి. కేంద్రం తీరును ఎండగట్టడంలో సిఎం జగన్ ఎందుకనో భయపడుతున్నారు. సింగరేణి విషయంలో తెలంగాణలో టిఆర్ఎస్ ప్రదర్శించిన దూకుడు జగన్ ప్రదర్శించలేక పోతున్నారు. విశాఖ ఉక్కుపై విమర్శలు వస్తున్న నేపథ్యంలో సిఎం జగన్ ప్రధాని మోడీకి లేఖ రాసి చేతలు దులుపుకున్నారు. అధికారంలో ఉన్నందున కేంద్రాన్ని నిలువరించే బాధ్యత నుంచి ఆ పార్టీ కూడా తప్పుకోజాలదు. నిజానికి దివంగత రాజశేఖర్ రెడ్డి లాంటివారు ఉండివుంటే ఇలా జరిగేదా అన్న ప్రశ్న వస్తోంది. ప్రధాని మోడీయే కాదు..సోనియాను కూడా ఎదరించే సత్తా ఉన్న నేత దివంతగ వైఎస్ మాత్రమే. ఆయన తనయుడిగా జగగన్ ఆ సత్తా చాటలేకపోతున్నారు. కార్యనిర్వాహక రాజధాని పేరిట విశాఖపట్నంతో పాటు ఉత్తరాంధ్ర జిల్లాల్లో పార్టీ పునాదులను మరింత పటిష్ఠం చేసుకోవాలని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి విశాఖ స్టీల్ సవాల్ కానుంది. విశాఖకు రాజధానిని తరలిస్తున్నట్లు చెబుతున్న సిఎం జగన్ విశాకు మకుటాయమానంగగా ఉన్న విశాక ఉక్కు విషయంలో నిర్లిప్త ధోరణిలో ఉన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా కేంద్రంపై ఒత్తిడి పెంచితేనే జగన్‌పై ప్రజల్లో నమ్మకం పెరుగుతుంది. కేంద్ర నిర్ణయాన్ని ప్రతిఘటిస్తారా? లేక రాజీ పడిపోతారా? అన్నది తేల్చుకోవాల్సిన సమయం ఆసన్నమైంది.. ప్రత్యేక హోదాను అటకెక్కించినట్టుగా విశాఖ ఉక్కు విషయంలో కూడా మౌనంగా ఉండిపోతే జగన్‌కు నష్టమే తప్ప లాభం లేదని గుర్తించాలి. ముఖ్యమంత్రి జగన్ బాటలోనే ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు కూడా కేంద్రపెద్దలకు భయపడి విశాఖ ఉక్కు విషయంలో మెతక వైఖరి అవలంబిస్తే టిడిపికి కూడా పుట్టగతులు ఉండవు. అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రజల పక్షాన ముందుండి పోరాటం చేయాల్సిన బాధ్యత ప్రతిపక్షంగా తెలుగుదేశంపై అధికంగా ఉంది. విశాఖ ఉక్కును కాపాడుకోవడానికైనా రాజకీయ పార్టీలు విభేదాలు పక్కనపెట్టి ఉమ్మడి పోరాటాలకు సిద్ధం కావాలి. రాజధాని కూడా లేకుండా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్‌కు రాజధాని కోసం రైతులు తమ భూములను త్యాగం చేస్తే, ఇప్పుడు వారిని ఎగతాళి చేస్తున్నారు. రాజధాని అమరావతి అంటే 29 గ్రామాల ప్రజల సమస్యగానే చూస్తున్నారు. అలాగే అదేదో చంద్రబాబు భూ సమస్యగా చూస్తున్నారు. దీంతోపాటు కేంద్రంతో ఢీకొనలేని స్థితిలో సిఎం జగన్ ఉన్నారు. రాజధాని ఉన్నా లేకపోయినా ఒక్కటే అన్న ధోరణి కనిపిస్తోంది. దీంతో అమరావతి అస్తిత్వం ప్రశ్నార్థకంగా మారింది. భూములిచ్చిన రైతులు చేస్తున్న పోరాటం అధికారపార్టీని కదిలించలేక పోతోంది. ఇతర ప్రాంతాల ప్రజలు కూడా రాజధాని వ్యవహారం తమది కాదన్నట్లుగా ఉదాసీనంగా ఉంటున్నారు. అమరావతి తర్వాత పోలవరం ప్రాజెక్టు కూడా ఈ జాబితాలో చేరిపోయింది. పూర్తిస్థాయిలో రిజర్వాయర్ నిర్మించడానికి అవసరమైన నిధులు ఇవ్వడానికి కేంద్రం ససేమిరా



అంటున్నా, రాష్ట్ర ప్రభుత్వం కూడా నోరెత్తలేక పోతోంది. మొన్నటి బడ్జెట్‌లో సవరించిన అంచనాలపై మాటమాత్రంగా అయినా ప్రస్తావించలేదు. ఆంధ్రప్రదేశ్ జీవనాడి పోలవరం అని చెప్పు కోవడమే తప్ప నేతలు అలా భావిస్తున్నట్టుగా లేదు. పశ్చిమ గోదావరి జిల్లాలో నిర్మించే పోలవరం పూర్తయితే తమకే లాభం అన్న భావనలో ప్రజలు కూడా లేరు. పోలవరం ప్రాజెక్టును ఒక బ్యారేజి స్థాయికి కుదించబోతున్నారన్న చర్చపైనా స్పందించడం లేదు. అమరావతికి, పోలవరానికి పట్టిన గతి తెలిసి కూడా ప్రజల్లో కనీసం చైతన్యం లేకపోవడాన్ని గమనించిన కేంద్రం ఇప్పుడు విభజన హామీలపై పెద్దగా స్పందించడం లేదు.

బీజేపీ నాయకులకు కూడా ప్రధాన సమస్యలపై కేంద్రంతో పోరాడే ధైర్యం చాలడం లేదు. త్యాగాల పునాదుల మీద నిర్మించిన విశాఖ ఉక్కును అమ్మేస్తామని చెబుతున్నా బిజెపి నేతలు నోరు మెదపడం లేదు. కేంద్రప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా విశాఖ ఉక్కు ఉద్యోగులు, వివిధ కార్మిక సంఘాలు ఉద్యమిస్తున్నా పట్టించుకోవడం లేదు. జనసేన సహకారంతో రాష్ట్రంలో అధికారంలోకి వస్తామని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు సవాలు విసురుతున్న తరుణంలో ఈ మూడు ప్రధాన సమస్యలపై ఎలాంటి వైఖరి తీసుకోబోతున్నారో ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత ఉంది.

# జాతీయ వార్తలు

## అదానీ గ్రూప్ కాంట్రాక్ట్‌ను రద్దు చేసిన ఉత్తర ప్రదేశ్

**లక్నోఫిబ్రవరి 07 (ప్రజా మంటలు):** ఒక వైపు, హిండెన్‌బర్గ్ నివేదిక వెల్లడైన తర్వాత అదానీ గ్రూప్ షేర్లు క్రాష్ అవుతుండగా, ఇప్పుడు యుపిలోని బిజెపి ప్రభుత్వం కూడా అదానీ గ్రూప్‌కు పెద్ద దెబ్బ వేసింది. అదానీ ట్రాన్స్‌మిషన్, జీఎంఆర్ మరియు ఇంటెల్లి




స్మార్ట్ కంపెనీలకు ఇచ్చిన ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్ టెండర్ రద్దు చేయబడింది. రీజియన్‌లో 2.5 కోట్ల ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు టెండర్ వ్యయం రూ.25 వేల కోట్లు. ఉత్తరప్రదేశ్‌లో మధ్యమాంచల్ విద్యుత్ పరిష్టి నిగమ్ టెండర్‌ను రద్దు చేసింది. కేవలం మధ్యాంచల్ విద్యుత్ పరిష్టి నిగమ్ టెండర్ విలువ 5454 కోట్లు. టెండర్ అంచనా మొత్తం దాదాపు 48 నుంచి 65 శాతం ఎక్కువగా ఉండటంతో మొదటి నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురైంది. ఒక మీటర్ ధర గతంలో 9 నుండి 10 వేల రూపాయలు ఉండగా, అంచనా వ్యయం మీటరుకు 6 వేలు. అదానీ పవర్ ట్రాన్స్‌మిషన్‌తో పాటు, జి ఏం ఆర్ మరియు ఇంటెల్లి స్మార్ట్ కంపెనీ టెండర్‌లో పార్ట్ 2 పొందాయి.

## రాంలల్లా శాలిగ్రామ రాతి విగ్రహం కాదు?

### రామలల్లా విగ్రహం ఉలి లేదా సుత్తి లేకుండా శాలిగ్రామ రాళ్లతో తయారు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 07 (ప్రజా మంటలు):** దాదాపు 6 మిలియన్ సంవత్సరాల నాటి శాలిగ్రామ శిలలు నేపాల్ నుండి అయోధ్యకు తెచ్చి, ఈ రాతితో శ్రీరాముని విగ్రహాన్ని సిద్ధం చేస్తున్నారు. ఈ రాళ్లపై ఎలాంటి ఇనుప పనిముట్లను ఉపయోగించకూడదనేదే



వీటి ప్రత్యేకత. అప్పుడు శాలిగ్రామ రాతితో రామలల్లా విగ్రహాన్ని ఎలా తయారు చేస్తారనే ప్రశ్న మీ మదిలో మెదులుతుంది. అయోధ్యలో నిర్మాణంలో ఉన్న రాముడి గొప్ప ఆలయంలో రామ్‌లాలా విగ్రహాన్ని సిద్ధం చేయడానికి నేపాల్ నుండి శాలి గ్రామం నుండి రాళ్లను తెప్పించారు. ఈ రాళ్లను నేపాల్‌లోని కాళీ గండకీ నది నుంచి తీసుకొచ్చారు. 60 మిలియన్ సంవత్సరాల నాటి ఈ శిల నుంచి రాంలాలా విగ్రహాన్ని తయారు చేయనున్నట్టు చెబుతున్నారు, అయితే ఈ రాళ్లపై ఇనుప పనిముట్లను ఉపయోగించడం నిషిద్ధం.

రాంలాలా విగ్రహాన్ని ఈ రాళ్ల ద్వారా చెక్కడానికి డైమండ్ కట్టింగ్ టూల్స్ ఉపయోగించబడతాయి. నేపాల్ నుంచి తెచ్చిన రెండు రాళ్లు చాలా బరువైనవి, ఒకటి 26 టన్నులు, మరొకటి 14 టన్నులు. ఈ శిలలపై పరిశోధన చేసిన జియాలజిస్ట్ డా. రాముడి రూపాన్ని నిర్మించడానికి నగరి నుండి తీసుకువచ్చిన దేవశిలలోని మా జానకి 7 కట్టుకు చెందినదని కులరాజ్ చాలీసా పేర్కొన్నారు

## బంగ్లాదేశ్‌లో హిందువులపై వేధింపులు

### -14 దేవాలయాలపై దాడులు

**బంగ్లాదేశ్ ఫిబ్రవరి07 (ప్రజా మంటలు):** ఆఫ్ఘనిస్థాన్-పాకిస్థాన్‌తో పాటు బంగ్లాదేశ్‌లో కూడా హిందువులు హింసకు గురవుతున్నారు. బంగ్లాదేశ్‌లో 14 ఆలయాల్లో విధ్వంసం ఘటన తెరపైకి వచ్చింది. ఈ ఘటన తర్వాత బంగ్లాదేశ్‌లో నివసిస్తున్న హిందువులు



తమ జీవితాల గురించి టెన్షన్‌లో ఉన్నారు. ఈ ఘటనపై విచారణ జరిపి హిందువులకు భద్రత కల్పించాలని పోలీసులను డిమాండ్ చేశారు. నిందితులను గుర్తిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. బంగ్లాదేశ్‌లోని హిందూ దేవాలయాలను ధ్వంసం చేసిన ఈ సంఘటన బంగ్లాదేశ్‌లోని వాయువ్య ప్రాంతంలోని ఠాకూర్‌గావ్‌లోని బలియాడంగిలో జరిగింది. గ్రామంలో నివసిస్తున్న హిందూ సమాజానికి చెందిన నాయకుడు బిద్యనాథ్ బర్మన్ తెలిపిన వివరాల ప్రకారం, శనివారం రాత్రి మరియు ఆదివారం తెల్లవారుజామున, గుర్తు తెలియని వ్యక్తులు చీకటిని సద్వినియోగం చేసుకొని పక్కా ప్రణాళికతో 14 ఆలయాలను ధ్వంసం చేశారు. ఇంతలో చాలా విగ్రహాలు. దేవాలయాల ధ్వంసంపై సంఘ్ పరిషత్ ఛైర్మన్, హిందూ నాయకుడు సమర్ ఛటర్జీ విచారం వ్యక్తం చేశారు. హిందువులు మరియు ముస్లింల మిశ్రమ జనాభా ఉందని, హిందువులతో సత్సంబంధాలు కలిగి ఉన్నారని అన్నారు. ఇద్దరి మధ్య ఎప్పుడూ గొడవలు జరగనప్పుడు ఈ ఘటన ఎవరు చేశారనే అనుమానం కలుగుతుంది.

## ఇరాన్‌లో విజేతగా నిలిచిన భారత క్రీడాకారిణి

**టెహ్రాన్ ఫిబ్రవరి 07 (ప్రజా మంటలు):** ఇరాన్‌లో జరిగిన 31వ ఇరాన్ ఫజర్ ఇంటర్నేషనల్ ఛాలెంజ్‌లో భారత్‌కు చెందిన తాన్యా హేమంత్ టాప్ సీడ్ మరియు స్వదేశానికి చెందిన తస్నిమ్ మీర్‌ను వరుస గేమ్‌లలో ఓడించి మహిళల సింగిల్స్ టైటిల్‌ను గెలుచుకుంది.




ఇరాన్ ఫజ్ర్ ఇంటర్నేషనల్ ఛాలెంజ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో చాంపియన్‌గా నిలిచిన భారత క్రీడాకారిణి తాన్యా హేమంత్ పతకం కోసం పోడియం వద్దకు వెళుతున్న సమయంలో హిజాబ్ ధరించింది. ప్రకాష్ పదుకొణె బ్యాడ్మింటన్ అకాడమీలో శిక్షణ పొందుతున్న 19 ఏళ్ల తాన్య 30 నిమిషాల్లో ఛాంపియన్, స్వదేశానికి చెందిన తస్నిమ్ మీర్‌ను ఓడించింది.

## అమెరికా, భారత్ మధ్య మూడు 3 బిలియన్ డాలర్ల ఆయుధ ఒప్పందం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 07 (ప్రజా మంటలు):** అమెరికా-భారత్‌తో మూడు బిలియన్ డాలర్ల ఒప్పందం కుదుర్చుకోనుంది. దీని కింద చైనాను నాశనం చేయగల, ప్రమాదకరమైన ఆయుధం భారతదేశానికి వస్తుంది. నియంత్రణ రేఖలోని కొండ ప్రాంతాలు.. అమెరికా తన ఆయుధ దాడి డ్రోన్ డ్రోన్ 30-ఏం కె యు 9బిని భారత్‌కు అత్యవసరంగా ఇవ్వగలదు. మూడు బిలియన్ డాలర్ల ఈ డీల్ అతి తక్కువ సమయంలో జరగాలని రెండు దేశాలు కోరుకుంటున్నాయి.







# గల్ఫ్ జైళ్లలో మగ్గుతున్న 4,755 భారతీయ ఖైదీలు...

### గల్ఫ్ లోని ఔట్ జైళ్లలో మరో 5 వేలు ఉంటారని అంచనా

### ఐదు గల్ఫ్ దేశాలతో భారత్ ఖైదీల బదిలీ ఒప్పందాలు

విదేశీ జైళ్లలో మగ్గుతున్న భారతీయ ఖైదీల వివరాలు తెలపాలని ఇద్దరు కాంగ్రెస్ ఎంపీలు కొడికున్నిల్ సురేష్ (మావెలిక్కర, కేరళ), వి.కె. శ్రీకందన్ (పాలక్కాడ్, కేరళ), అయిదుగురు బిజెపి ఎంపీలు డా. సుకంత మజుందార్ (బాలుర్ ఘాట్, పశ్చిమ బంగ), రాజా అమరేశ్వర నాయక్ (రాయిచూర్, కర్ణాటక), వినోద్ కుమార్ సోన్కర్ (కౌశాంబి, ఉత్తర్ ప్రదేశ్), రజ్వీర్ సింగ్ ఏ రాజు భయ్యా (ఐటా, ఉత్తర్ ప్రదేశ్), భోళా సింగ్ (బులంద్ షహర్, ఉత్తర్ ప్రదేశ్) మొత్తం ఏడుగురు లోక్ సభ ఎంపీలు పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల సందర్భంగా విదేశాంగ శాఖ మంత్రిని ఈ క్రింది ప్రశ్నలు అడిగారు.

- విదేశాల్లోని జైళ్లలో నేటి వరకు మగ్గుతున్న పౌరులు, కార్మికులు, మహిళలతో సహా భారతీయ ఖైదీల వివరాలు, దేశాల వారీగా ఇవ్వండి.
- ఖైదీల పరస్పర మార్పిడి కోసం భారత ప్రభుత్వం విదేశాలతో పరస్పర అవగాహన ఒప్పందాలు చేసుకున్నదా? వాటి వివరాలు ఇవ్వండి.
- విదేశాల్లోని భారతీయ ఖైదీలకు న్యాయ సహాయం, మద్దతు అందించడానికి విదేశాలలో ఉన్న మన రాయబార కార్యాలయాలలో న్యాయ వ్యవస్థను బలోపేతం చేయడానికి ప్రభుత్వం వద్ద ఏదైనా ప్రతిపాదన ఉన్నదా?, అయితే, దాని వివరాలు ఇవ్వండి.
- నేరస్తుల అప్పగింత ఒప్పందంపై భారతదేశం ఇప్పటివరకు సంతకం చేయని దేశాలతో ఒప్పందాలు చేసుకోవడానికి ప్రభుత్వం తీసుకున్న చర్యల గురించి వివరించండి.
- విదేశీ జైళ్లలో ఉన్న భారతీయ ఖైదీల విడుదలకు ప్రభుత్వం తీసుకున్న చర్యలు దాని ఫలితాల గురించి వివరించండి
- శిక్ష పడిన భారతీయ ఖైదీలు, విచారణలో ఉన్న ఖైదీలు దూషణలకు, చిత్రహింసలకు గురవుతున్నారని సూచించే ఏవైనా నివేదికలు ప్రభుత్వానికి అందాయా?

విదేశీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి వి. మురళీధరన్ 2023 ఫిబ్రవరి 3న ఈ క్రింది విధంగా లిఖితపూర్వక జవాబు ఇచ్చారు. మంత్రిత్వ శాఖ వద్ద అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం, ప్రస్తుతం 82 దేశాలలోని జైళ్లలో అండర్ ట్రయల్స్ (విచారణ ఖైదీలు) తో సహా శిక్షపడిన భారతీయ ఖైదీల సంఖ్య 8,343. ఆరు అరబ్ గల్ఫ్ దేశాల లోని జైళ్లలో 4,755 భారతీయ ఖైదీలు ఉన్నారు. యూఏఈ (1,926), సౌదీ అరేబియా (1,362), ఖతార్ (682), కువైట్ (428), బహరేన్ (265), ఓమాన్ (92) ఖైదీలున్నారు. ఇవి కాక మలేసియా (606) మంది ఉన్నారు. గల్ఫ్ దేశాలలో మరో 5 వేల మంది ఇమ్మిగ్రేషన్ డిపోర్టేషన్ సెంటర్స్ (అవుట్ జైళ్ళు) అనబడే బహిష్కరణ కేంద్రాల్లో ఉంటారని ఈ రచయిత అంచనా. అయితే, అనేక దేశాల్లో బలమైన గోప్యతా చట్టాలు అమలులో ఉన్నందున, సంబంధిత వ్యక్తి అటువంటి సమాచారాన్ని బహిర్గతం చేయడానికి సమ్మతిస్తే తప్ప స్థానిక అధికారులు ఖైదీల సమాచారాన్ని పంచుకోరు. సమాచారాన్ని పంచుకునే దేశాలు కూడా సాధారణంగా ఖైదు చేయబడిన విదేశీయుల గురించి వివరణాత్మక సమాచారాన్ని అందించవు.


భారతదేశం 31 దేశాలతో శిక్షార్హమైన వ్యక్తుల బదిలీ (ట్రాన్స్ఫర్ ఆఫ్ సెంటెన్సుడ్ పర్సన్స్) పై ఒప్పందాలు కుదుర్చుకుంది. ఈ 31 దేశాల జాబితాలో గల్ఫ్ లోని యూఏఈ, సౌదీ అరేబియా, ఖతార్, కువైట్, బహరేన్ అనే అయిదు దేశాలు కూడా ఉన్నాయి. ఓమాన్ దేశం మాత్రం లేదు. ఖైదీల బదిలీ గురించి... మల్టీ లాటరల్ ఇంటర్-అమెరికన్ కన్వెన్షన్ ఆన్ సర్వింగ్ క్రిమినల్ సెంటెన్సెస్ అబ్రాడ్ (విదేశాలలో నేర శిక్షలను అమలు చేయడంపై బహుపాక్షిక ఇంటర్-అమెరికన్ కన్వెన్షన్). ది కౌన్సిల్ ఆఫ్ యూరప్ కన్వెన్షన్ ఆన్ ట్రాన్స్ఫర్ ఆఫ్ సెంటెన్సుడ్ పర్సన్స్ (శిక్ష విధించబడిన వ్యక్తుల బదిలీపై కౌన్సిల్ ఆఫ్ యూరప్ కన్వెన్షన్) అనే రెండు అంతర్జాతీయ ఒప్పందాలను భారత్ ఆమోదించింది. భారతదేశం 50 దేశాలతో నేరస్థుల అప్పగింత ఒప్పందాలు కుదుర్చుకుంది. 12 దేశాలతో అప్పగింత ఏర్పాట్లు చేసింది.

విదేశాల్లో ఖైదు చేయబడిన భారతీయులకు వీలయిన అన్ని రకాల దౌత్య సహాయం అందించడమే కాకుండా, అవసరమైన చోట న్యాయ సహాయం అందించడంలో భారతీయ రాయబార కార్యాలయాలు సహకరిస్తాయి. భారతీయులు గణనీయమైన సంఖ్యలో ఉన్న దేశాలలో మన దౌత్య కార్యాలయాలు స్థానిక న్యాయవాదుల ప్యానెల్‌ను నిర్వహిస్తాయి. సంబంధిత భారత రాయబార కార్యాలయం ద్వారా సౌకర్యాలను విస్తరించడానికి భారతీయ ఖైదీల నుండి ఎలాంటి ఫీజు వసూలు చేయరు. బాధలో, దుఃఖంలో ఉన్న భారత ప్రవాసులను ఆదుకోవడానికి భారత రాయబార కార్యాలయాలలో ఇండియన్ కమ్యూనిటీ వెల్ఫేర్ ఫండ్ - ఐసిడబ్ల్యూఎఫ్ (భారతీయ సామాజిక సంక్షేమ నిధి) ఏర్పాటు చేయనైనది. అర్హమైన కేసులను పరీక్షించి దాని ఆధారంగా సహాయం చేస్తారు. భారతీయ ఖైదీలకు న్యాయ సహాయం (లీగల్ ఎయిడ్) తో పాటు స్వదేశానికి వెళ్ళడానికి ప్రయాణ పత్రాలు, విమాన టికెట్లు సమకూర్చడానికి సంక్షేమ నిధి నుంచి ఆర్థిక సహాయం చేస్తారు.

విదేశీ జైళ్లలో ఉన్నవారితో సహా విదేశాలలో ఉన్న భారతీయుల భద్రత, శ్రేయస్సుకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తుంది. విదేశాల్లోని భారతీయ రాయబార కార్యాలయాలు అప్రమత్తంగా ఉంటాయి. విదేశాలలోని స్థానిక చట్టాల ఉల్లంఘన ఆరోపణలు ఎదుర్కొంటున్న భారతీయ పౌరులను జైల్లో ఉంచే సంఘటనలను నిశితంగా పరిశీలిస్తాయి. భారతీయ జాతీయులను నిర్బంధించడం లేదా అరెస్టు చేయడం గురించిన సమాచారం అందిన వెంటనే భారత రాయబార కార్యాలయాలు స్పందిస్తాయి. వారు కాన్సులర్ యాక్సెస్ (దౌత్యపరమైన అవకాశం) పొందడానికి స్థానిక విదేశాంగ కార్యాలయం, ఇతర సంబంధిత స్థానిక అధికారులతో మన రాయబార కార్యాలయం వెంటనే సంప్రదిస్తుంది. కేసు యొక్క వాస్తవాలను, మనవారి భారత జాతీయతను నిర్ధారించి వారి సంక్షేమాన్ని ప్రయత్నిస్తారు.

విదేశీ జైళ్లలో ఉన్న భారతీయ పౌరులను స్వదేశానికి రప్పించే సమస్యను సంబంధిత స్థానిక అధికారులతో మన రాయబార కార్యాలయాలు క్రమం తప్పకుండా అనుసరిస్తాయి. ఇతర దేశాలతో దౌత్య, ఇతర సంప్రదింపుల సమయంలో కూడా ప్రభుత్వం ఈ సమస్యను ప్రస్తావిస్తుంది. భారత ప్రభుత్వం విదేశాలలో తన రాయబార కార్యాలయాల ద్వారా, ఉన్నత స్థాయి సందర్శనల సమయంలో కూడా చర్యలు తీసుకుంటుంది. భారతీయ ఖైదీల క్షమాభిక్ష మంజూరు, శిక్షల తగ్గింపు గురించి ప్రయత్నిస్తుంది.

సమాచార సేకరణ & ఫోటోలు
– మంద భీంరెడ్డి,
గల్ఫ్ వలస వ్యవహారాల విశ్లేషకులు
+91 98494 22622)



## ఉమ్మడి జిల్లాల ఆధారంగా బదిలీ ప్రక్రియ

### ఉపాధ్యాయుల బదిలీలపై రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం : అధికారులతో సమీక్షించిన మంత్రి సబిత

**హైదరాబాద్,ఫిబ్రవరి7(ఆర్ఎన్ఎ):** ఉపాధ్యాయుల బదిలీలపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి పూర్వపు జిల్లాను పరిగణనలోకి తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా ప్రభుత్వ ఉత్తర్వులు 317లో వేరే జిల్లాకు బదిలీ అయిన ఉపాధ్యాయులకు పూర్వ జిల్లా సర్వీసును పరిగణనలోకి తీసుకుని ఉపాధ్యాయ బదిలీలకు దరఖాస్తు చేసుకోవడానికి సీఎం కేసీఆర్ సూచనల మేరకు అవకాశం ఇవ్వనున్నట్లు విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వుల నేపథ్యంలో మంగళవారం తన కార్యాలయంలో విద్యాశాఖ ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు.



ఇప్పటికే ప్రారంభమైన ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల పక్రియ కొనసాగుతుందని జీవో 317 కింద బదిలీ అయిన ఉపాధ్యాయులు తాజాగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 12 ఉంచి 14వ తేదీ వరకు అవకాశం కల్పించనున్నట్లు వెల్లడించారు. ఉపాధ్యాయులందరికీ సమన్యాయం చేకూర్చాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని మంత్రి పేర్కొన్నారు. ఇప్పటికే వచ్చిన 59 వేల దరఖాస్తుల పరిశీలన పూర్తి చేయబడుతందని సబితా ఇంద్రారెడ్డి తెలిపారు.

## ఎంట్రెన్స్ టెస్టుల షెడ్యూల్ విడుదల

### మే 7 నుంచి 11 వరకు ఎంసెట్ ఇంజనీరింగ్ ప్రవే పరీక్ష

**హైదరాబాద్,ఫిబ్రవరి7(ప్రజామంటలు):** రాష్ట్రంలోని వృత్తి విద్యాకోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి షెడ్యూల్ విడుదలైంది. ఎంసెట్, ఈసెట్, లాసెట్, పీజీసెట్, ఐసెట్, ఎడ్‌సెట్, పీజీఈ సెట్‌కు సంబంధించిన కామన్ ఎంట్రన్స్ టెస్టులకు సంబంధించిన పరీక్షా తేదీలను విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆదేశాల మేరకు అధికారులు ప్రకటించారు. ఈ మేరకు కార్యాలయంలో మంత్రి విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ, తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి, వైస్ చైర్మన్ వీ వెంకటరమణతో సమీక్ష నిర్వహించారు. పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లను చేయాలని సూచించారు. మే 7వ తేదీ నుంచి 11 వరకు ఎంసెట్ ఇంజినీరింగ్, 12 నుంచి 14 వరకు అగ్రికల్చర్- ఫార్మసీ పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొంది. ఎడ్‌సెట్‌ను మే 18న, ఈసెట్‌ను మే 20న, లాసెట్(ఎల్ఎల్‌బీ) మే 20న, మే 20న పీజీఎల్ సెట్ (ఎల్ఎల్ఎం), మే 26 నుంచి 27 వరకు పీజీ ఐసెట్, మే, 29 నుంచి జూన్ ఒకటి వరకు పీజీ ఈసెట్‌ను జరుగనున్నాయి. దరఖాస్తు చేసుకునేందుకు రిజిస్ట్రేషన్ ఫీజు, ఇతర వివరాలతో వివరణాత్మక నోటిఫికేషన్‌ను సంబంధిత సెట్ కన్వీనర్లు ప్రకటిస్తారని మంత్రి పేర్కొన్నారు.

## ఏడుగురు ఐపీఎస్ అధికారులు బదిలీ

**హైదరాబాద్,ఫిబ్రవరి7(ప్రజామంటలు):** రాష్ట్రంలో ఏడుగురు ఐపీఎస్ అధికారులు బదిలీ అయ్యారు. వెయిటింగ్ లో అధికారులకు పోస్టింగ్‌లు ఇస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. సీఐడీ ఎస్పీగా ఆర్ వెంకటేశ్వర్లు, సైబరాబాద్ పరిపాలన డీసీపీగా యోగేశ్ గౌతమ్, పీసీఎస్ ఎస్పీగా రంగారెడ్డి, జీఆర్పీ అడ్మిన్ డీసీపీగా రాఘవేందర్‌రెడ్డి, వరంగల్ పోలీస్ శిక్షణా కేంద్రం ఎస్పీగా పూజ, డీజీపీ కార్యాలయం న్యాయవిభాగం ఎస్పీగా సతీశ్, వరంగల్ నేర విభాగం డీసీపీగా మురళీధర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

గత జనవరిలోనూ రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఐపీఎస్‌లను ప్రభుత్వం బదిలీ చేసిన విషయం తెలిసిందే. జనవరి 25న రాష్ట్రవ్యాప్తంగా 91 మంది అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది.

## కమ్యూనిస్టులకు సీట్లు ఇచ్చేది లేదన్న మంత్రుల వ్యాఖ్యలు

### తప్పు పట్టిన సిపిఎం కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

**హైదరాబాద్,ఫిబ్రవరి7(ప్రజామంటలు):** పొత్తులపై సీపీఎం రాష్ట్రకార్యదర్శి తమ్మినేని వీరభద్రం మాట్లాడారు. కమ్యూనిస్టులకు సీట్లు ఇచ్చేది లేదంటోన్న మంత్రుల కామెంట్స్ సరైనవి కాదని తమ్మినేని అంటున్నారు. తెలంగాణలో ఎన్నికల పొత్తుపై చర్చ జరుగుతుందని ఆయన తెలిపారు. సీపీఐ, సీపీఎంకు సీట్లు ఉండవు, పొత్తులు ఉండవని చెప్పడం సరికాదన్నారు. పొత్తులపై సీపీఐతో త్వరలోనే చర్చలు జరుపుతామన్నారు. ఎమ్మెల్యేల కొనుగోలుపై కాషాయ ప్రభావం ఉందని ఆరోపించారు. వలసలు, ఫిరాయింపులకు సీపీఎం వ్యతిరేకమన్నారు. పార్టీ మారాలనుకుంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని ఆయన సూచించారు. ఫిరాయింపుల కోసం బీజేపీ ఓ నాయకుడికి బాధ్యతలు ఇవ్వడం దారుణమన్నారు. బీజేపీకి వ్యతిరేకంగా భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో టీఆర్ఎస్‌తో పొత్తుపై సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని వీరభద్రం క్లారిటీ ఇచ్చారు.

## మూడవసారి రికీ కజోన్‌కు గ్రామీ అవార్డ్

**వాషింగ్టన్, ఫిబ్రవరి 07 (ప్రజా మంటలు):** ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న సంగీత అవార్డు కార్యక్రమం, 2023 సంవత్సరానికి సంబంధించి, గ్రామీ అవార్డులు మరోసారి భారతదేశాన్ని ప్రభావితం



చేశాయి. బెంగళూరుకు చెందిన సంగీతకారుడు రికీ కాజ్ తన మూడవ గ్రామీ అవార్డును గెలుచుకున్నాడు. రికీ తన ఆల్బమ్ 'డివైన్ టైడ్స్' కోసం ఈ అవార్డుతో సత్కరించబడ్డాడు. ప్రసిద్ధ బ్రిటిష్ రాక్ బ్యాండ్ 'ది పోలీస్' డ్రమ్మర్ అయిన స్టీవార్డ్ కోప్‌ల్యాండ్‌తో అమెరికాలో జన్మించిన సంగీతకారుడు అవార్డును పంచుకున్నారు. ఈ ఆల్బమ్‌లో స్టీవార్డ్ కోప్‌ల్యాండ్ రికీతో కలిసి పనిచేశారు. వీరిద్దరూ 65వ గ్రామీ అవార్డ్స్‌లో ఉత్తమ లీనమయ్యే ఆడియో ఆల్బమ్ విభాగంలో గ్రామోఫోన్ ట్రోఫీని గెలుచుకున్నారు. ప్రముఖ సంగీత స్వరకర్త రికీ కేస్ తన 'విండ్స్ ఆఫ్ సంసార' ఆల్బమ్‌కు 2015లో తొలిసారిగా ఈ అవార్డును గెలుచుకున్నారు. 2015లో ఈ గౌరవాన్ని అందుకున్న తర్వాత, అతను 2022లో స్టీవార్డ్ కోప్‌ల్యాండ్‌తో కలిసి ఉత్తమ న్యూ ఏజ్ ఆల్బమ్ విభాగంలో డివైన్ టైడ్స్ ఆల్బమ్ కోసం మళ్లీ గ్రామీ అవార్డును అందుకున్నాడు.

## పండిట్లే సృష్టించిన కుల సంఘాలు

### కులతత్వంపై ఆర్ ఎస్ ఎస్ చీఫ్ ప్రకటన

**న్యూఢిల్లీ ఫిబ్రవరి 07 (ప్రజా మంటలు):** రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ చీఫ్ మోహన్ భగవత్ కులతత్వం గురించి పెద్ద ప్రకటన చేశారు. పండితులు-పురోహితులు కుల, వర్గాలను సృష్టించారని, ఇది తప్పని భగవత్ అన్నారు. ప్రతి పని సమాజం కోసం చేసినప్పుడు, ఏదైనా పని పెద్దది లేదా చిన్నది లేదా భిన్నంగా ఎలా ఉంటుంది? సంఘ్ ప్రెసిడెంట్ మాట్లాడుతూ, 'దేవుడు తనకు అందరూ సమానమేనని, తనకు కుల, మతాలు లేవని, పూజారులు తప్పుగా సృష్టించారని అన్నారు. దేశంలో మనస్సాక్షి, చైతన్యం అన్నీ ఒక్కటే, తేడా లేదు, అభిప్రాయాలే వేరు. మనం మతం మారాలని ప్రయత్నించలేదు, మారితే మతాన్ని విడిచిపెట్టాలి. మోహన్ భగవత్ మాట్లాడుతూ, 'డా. సాధువులు మరియు బాబాసాహెబ్ అంబేద్కర్ వంటి ప్రముఖులు సమాజంలో ప్రబలంగా ఉన్న అంటరానితనానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు.

అంటరానితనంతో కలత చెందిన డా. అంబేద్కర్ హిందూ మతాన్ని విడిచిపెట్టాడు. కానీ అతను ఏ ఇతర మతాన్ని స్వీకరించలేదు. గౌతమ బుద్ధుడు చూపిన మార్గాన్ని ఎంచుకున్నాడు. ఆయన బోధనలు భారతీయ ఆలోచనల్లో కూడా లోతుగా ఇమిడి ఉన్నాయి.

అన్ని రకాల పనులను గౌరవించాలని ప్రజలను కోరిన భగవత్, ఉద్యోగాల కోసం పరుగులు తీయడం మానేయాలని కోరారు. 'ప్రపంచంలో ఏ సమాజమూ 30 శాతానికి మించి ఉపాధిని సృష్టించలేవు. మనుషులు ఏ పని చేసినా గౌరవించాలి.

కార్మికుల పట్ల గౌరవం లేకపోవడమే సమాజంలో నిరుద్యోగానికి ప్రధాన కారణం. పనికి శారీరక శ్రమ కావాలన్నా, తెలివితేటలు కావాలన్నా, కష్టపడి పనిచేయాలన్నా, సాఫ్ట్ స్కిల్స్ కావాలన్నా- అన్నింటినీ గౌరవించాలి.'

### తెలంగాణ రాష్ట్రం

## వచ్చాకనే దేవాలయాలు అభివృద్ధి

**చిల్పూర్ పిబ్రవరి 07 (ప్రజామంటలు):** మండలంలోని చిన్నపెండ్యాల గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ రేణుక ఎల్లమ్మ ఉత్సవాలు మరియు



బోనాలు కార్యక్రమంలో పాల్గొన్ని ప్రత్యేక పూజలు చేసిన జనగామ జిల్లా పరిషత్ చైర్మన్ %ఽ% బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పాగాల సంపత్ రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ.... తెలంగాణ రాష్ట్రం వచ్చాకనే దేవాలయాలు అభివృద్ధి జరుగుతున్నయి యని తెలిపారు. చిన్న పెండ్యాల రేణుక ఎల్లమ్మ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల ఫోరం అధ్యక్షులు లింగారెడ్డి, యంపిటిసి ఉమా సమ్మయ్య, మండల రైతు కోఆర్డినేటర్ జనగాం యాదగిరి, నాయకులు సంపత్, జగన్నాథం, దామోదర్, క్రాంతి, విజయ్, ప్రవీణ్, వెంకటేష్, కనకయ్య మరియు ఇతర నాయకులు, గౌడ సంఘం నాయకులు, పార్టీ శ్రేణులు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

## బిసి సంక్షేమ సంఘం జగిత్యాల జిల్లా ఉపాధ్యక్షుడుగా బద్దెల గంగరాజం

**జగిత్యాల ఫిబ్రవరి 07 (ప్రజామంటలు):** హైదరాబాదులో బిసి ముఖ్య నాయకుల సమావేశం ఆర్. కృష్ణయ్య ఎం.పి. ఆధ్వర్యంలో జరిగింది. ఇట్టి సమావేశంలో జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం కోనాపూర్ గ్రామస్తుడైన గంగపుత్ర



కులస్తుడు బద్దెల గంగరాజం బిసి సామాజిక కార్యక్రమాలలో భాగస్వాము లైనందుకు గాను జగిత్యాల జిల్లా బి.సి. సంక్షేమ సంఘం ఉపాధ్యక్షునిగా నియమించడమైనది. బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఎం.పి. ఆర్ కృష్ణయ్య ఆదేశాల మేరకు రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ, బి.సి సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సీపతి రమేష్ ల సూచన మేరకు బద్దెల గంగరాజంని రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ నియమించడం జరిగినది. వీరి నియామకం తేది: 05-02-2023 నుండి అమలులోకి వచ్చునని రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ తెలియజేశారు.

## గాంధీ సిబ్బందికి పదోన్నతులు

### ప్రమోషన్ ఉత్వర్వుల జారీ

**సికింద్రాబాద్ ఫిబ్రవరి 07 (ప్రజామంటలు):** గాంధీ ఆసుపత్రిలో పనిచేస్తున్న పలువురు నాల్గవ తరగతి ఉద్యోగులకు క్లరికల్ గ్రేడ్ ప్రమోషన్ కల్పిస్తూ అధికారులు ఉత్వర్వులు జారీ చేశారు. ఈసందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రొ.



రాజారావు మాట్లాడుతూ.... విధి నిర్వహణలో ఎంప్లాయిస్ పొందే ప్రమోషన్లు వారి బాధ్యతలను మరింతగా పెంచుతాయని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్క ఎంప్లాయికి దశలవారీగా ప్రమోషన్లు కల్పిస్తామని, నిబద్ధతో పనిచేస్తూ, ఆసుపత్రికి వచ్చే నిరుపేద పేషంట్లకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. క్లరికల్ గ్రేడ్ ప్రమోషన్ పొందిన రవితేజ, భాస్కర్, గోవర్ధన్, విశాల్, పద్మ సూపరింటెండెంట్ రాజారావు ను కలసి శాలువాతో సత్కరించి, కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటి సూపరింటెండెంట్ డా. శోభన్ బాబు, ఆర్.ఎం.వో డా.జయకృష్ణ, ఏడీ ఫ్లోరెన్స్ మెర్లిన్, ఆర్ఎంవోలు వెంకటరమణ, వసుధరాణి, రాము, సత్యరత్న, ఆఫీస్ సూపరింటెండెంట్ రాంచందర్, జనరల్ మేనేజర్ వెంకట సంతోష్ రమణ, టీ.ఎన్.జీ.వో గాంధీ యూనిట్ ప్రెసిడెంట్ ప్రభాకర్, సెక్రటరీ యాదిలాల్, సభ్యులు శ్రవణ్ కుమార్, ఖలీమ్, విశ్వనాథ్, జనార్ధన్, సత్యనారాయణ, మక్బూద్, భావన, సరళ తదితరులు పాల్గొన్నారు.

### కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించిన

## ఇంచార్జ్ మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్.

**జగిత్యాల ఫిబ్రవరి 07 (ప్రజామంటలు):** జగిత్యాల పట్టణంలోని 16వ వార్డులో జరుగుతున్నటువంటి కంటి వెలుగు శిబిరాన్ని మున్సిపల్ ఇంచార్జి ఛైర్మన్ గోలి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సిబ్బందితోపాటు లబ్ధిదారులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు మెరుగైన సేవలను అందించాలని సూచించారు. అనంతరం మొదటిసారి తమ వార్డుకు వచ్చిన సందర్భాన్ని పురస్కరించుకొని ఇంచార్జి చైర్మన్ గోలి శ్రీనివాస్ ని స్థానిక కౌన్సిలర్ కూతురు రాజేష్ శాలువాతో సన్మానించి, స్వీట్ తినిపించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ లు తోట మల్లికార్జున్, బొడ్ల జగదీష్, కూసరి అనిల్, నాయకులు బండారి నరేందర్, జగన్ మోహన్ రెడ్డి, వాసు తదితరులు పాల్గొన్నారు.



### ఏరువాక భువనగిరి ఆధ్వర్యంలో

# వరి పంట క్షేత్రం ప్రదర్శన

**జనగామ ఫిబ్రవరి 07 (ప్రజామంటలు):** జనగామ మండలం పెంబర్తి గ్రామంలో వ్యవసాయ శాఖ, ఏరువాక భువనగిరి ఆధ్వర్యంలో రైతు వేదిక లో రైతులకు శిక్షణ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమం అనంతరం రాజిరెడ్డికి చెందిన వ్యవసాయ పొలాన్ని సందర్శించారు. వరిని గమనించి సమస్యలకు ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు పరిష్కారం తెలిపారు.వరి ఆకులపై ఇటుక రంగు మచ్చలు ఏర్పడి ఎదుగుదల లేకపోవడానికి జింక్ ధాతు లోపమన్నారు. జింక్ లోప నివారణకు ఎకరానికి 400 గ్రాములు జింక్ సల్ఫేట్ పిచికారి చేయాలన్నారు. వరిలో కాండం తొలుచు పురుగు ఆశించడం వల్ల వరి పిలకలు ఎండిపోవడం జరుగుతుందని, ఈ మొగి పురుగు నివారణకు ఎకరానికి కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 400 గ్రా. లేదా క్లోరాంట్రనిలిప్రోల్ 60 మి.లీ. పిచికారి చేయాలన్నారు. వరిలో అగ్గితెగులు ఆశించడం వల్ల ఆకులపై నూలు కండె ఆకారంలో మచ్చలు ఏర్పడతాయని, అగ్గితెగులు నివారణకు ఒక ఎకరాకు 120 గ్రా. ట్రై సైక్లజోల్ గాని, 300 మి.లీ. ఐసోప్రోథయోలెన్ లేదా 500 మి.లీ కాసుగామైసిన్ పిచికారి చేయాలన్నారు. వరిలో సల్ఫైడ్ ఇంజురీ సమస్య కూడా అక్కడక్కడ గమనించారు. దీని వల్ల వేర్లు కుళ్ళిపోవడంతో మొక్కలు ఎండి పోతున్నాయన్నారు. దీని నివారణకు పొలాన్ని అడపాదడపా ఆరబెడుతుండాలన్నారు. వరిలో చిరుపొట్ట దశలో 50 కిలోల యూరియా తో 15 కిలోల పొటాష్ కలిపి వాడాలన్నారు. ఈ కార్యక్రమములో జనగామ జిల్లా వ్యవసాయ అధికారి వినోద్ కుమార్, సహాయ వ్యవసాయ సంచాలకులు బీనా, వ్యవసాయాధికారి కరుణాకర్, భువనగిరి ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్. బి. అనిల్ కుమార్, శాస్త్రవేత్త బి. మధుశేఖర్,



ఉద్యానశాఖాధికారి రవికాంత్, వ్యవసాయ విస్తరణాధికారిణి మంజుల, గ్రామ సర్పంచ్ ఆంబాల ఆంజనేయులు, అభ్యుదయ రైతులు జూకంటి వెంకటయ్య, పిట్ట బుచ్చిరెడ్డి, రైతు సమన్వయ క్షమిటీ కో ఆర్డినేటర్ గోనెల సంపత్, ఆవుల రాజిరెడ్డి, బంద్రు సత్తయ్య, అంజిరెడ్డి, చిక్కుడు నాగరాజు, రాములు, మ్యేకల బిక్షపతి పాల్గొన్నారు.

# “జయహో డాక్టర్”

### హైదరాబాద్ వైద్యుడు రాసిన ఉత్తరానికి స్పందించిన “ప్రైమ్ మినిస్టర్ కార్యాలయం”

**హైదరాబాద్ ఫిబ్రవరి 07 (ప్రజామంటలు):** హైదరాబాద్ వైద్యుడు రాసిన ఉత్తరానికి స్పందించిన ప్రైమ్ మినిస్టర్ కార్యాలయం. హైదరాబాద్ కు చెందిన ప్రముఖ అలర్జీ సూపర్ స్పెషలిస్ట్, పల్మనాలజిస్ట్ డాక్టర్ వ్యాకరణం నాగేశ్వర్ జనవరి 20 2023 ప్రైమ్ మినిస్టర్ కి స్వయాన ఒక లెటర్ రాసి పంపించారు.

**లెటర్‌లో ఏముంది ?**

కరోనా వ్యాక్సిన్ వలన అనర్థాలు చాలా వస్తున్నాయని, కరోనా వ్యాక్సిన్ ఎవరికి అవసరమో వారికి ఇస్తే సరిపోతుంది అంతకు మించి “ మాస్ వాక్సినేషన్ “ ప్రోగ్రామ్ కింద అవసరం లేదని, తన వైద్యపరమైన, అనుభవంతో కూడిన శాస్త్రీయ అభిప్రాయాన్ని డాక్టర్ వ్యాకరణం నాగేశ్వర్ తెలిపారు. అలర్జీ పేషెంట్లు దేశంలో 30కోట్లకు పైగా ఉన్నారని, వీరికి భారత ప్రభుత్వం ఆరోగ్య శాఖ నియమావళి ప్రకారము వ్యాక్సిన్ తొందరపడి తీసుకోవద్దని ఉందని, కానీ దురదృష్టవశాత్తూ, ఇటువంటి సమాచారం ప్రజలకు తెలియని కారణంగా, చాలామంది అలర్జీ రోగులు వాక్సినేషన్ తీసుకున్నారని, తదనంతరం వివిధ రకాలైన ఎలర్జీలు పెరగడం, కొంతమంది ఆటోఇమ్యూనిటీ కండిషన్ తోని బాధపడుతున్నారని డాక్టర్ వ్యాకరణం నాగేశ్వర్ వెల్లడించారు.

**ప్రధానమంత్రికి రాసిన తన ఉత్తరం కి సమాధానంగా ప్రధానమంత్రి కార్యాలయం స్పందన ఇలా :**

కరోనా వ్యాక్సిన్ అందరూ కచ్చితంగా తీసుకోవాలని లేదని, కావాలనుకుంటే తీసుకోవచ్చు వద్దనుకుంటే మానచ్చని వెల్లడించింది. డాక్టర్ వ్యాకరణం నాగేశ్వర రాసిన ఉత్తరం




లోని కోవిడ్ నియంత్రణ విధానం ముఖ్యంగా అలర్జీ లక్షణాలు కలిగిన రోగులపై ఉన్న శాస్త్రీయమైన సమాచారాన్ని క్షుణ్ణంగా పరిగణలోకి తీసుకొని ఆరోగ్య విభాగం ద్వారా పరిశోధిస్తున్నారు అని తెలిపింది.

# బిజెపి ప్రజా చైతన్య యాత్ర

**మహాదేవపూర్ ఫిబ్రవరి 07 (ప్రజామంటలు):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలో ప్రజా చైతన్య యాత్ర లో భాగంగా మూడవ రోజు బిజెపి రాష్ట్ర నాయకులు చందుపట్ల సునీల్ రెడ్డి మండల కేంద్రంలో ఇంటింటికి తిరుగుతూ ప్రజల కష్టాలను అడిగి తెలుసుకున్నారు కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి ఈసారి గెలిపించాలని ప్రజలను కోరారు. అనంతరం బిజెపి రాష్ట్ర నాయకుడు చందుపట్ల సునీల్ రెడ్డి మాట్లాడుతూ.... తెలంగాణ సాధన కోసం మా జీవితాలను త్యాగం చేశాం లాఠీ దెబ్బలు తిన్నాం తూటాలకు భయపడకుండా కొట్లాడి తెచ్చిన తెలంగాణను అప్పుల తెలంగాణ చేశారు కరెంటు చార్జీలు పెంచి బస్సు చార్జీలు పెంచి ప్రజలను ఇబ్బందులు పెడుతున్న ప్రభుత్వానికి



ఈసారి జరిగే ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం బీఆర్ఎస్ పార్టీకి చెప్తారని రాష్ట్రం విడిపోయినప్పుడు మిగులు బడ్జెట్ ఉన్న తెలంగాణను అప్పుల తెలంగాణగా చేసిన ఘనత కెసిఆర్ కె దక్కుతుంది అన్నారు. ఉద్యమ ద్రోహులకు పదవులు ఇచ్చి ఉద్యమకారులకు తీవ్ర అన్యాయం చేసింది కెసిఆర్ అని అవినీతితో లక్షల కోట్లు కెసిఆర్ కుటుంబం సంపాదించిందని కుటుంబ నియంత పాలనకి చరమగీతం పాడడానికి ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి ప్రజా చైతన్య యాత్రను మొదలుపెట్టడం జరిగింది అని అన్నారు. ఈసారి వచ్చే ప్రభుత్వం బిజెపి దే అన్నారు. ఈ కార్యక్రమంలో వెన్నం పల్లి పాపయ్య మండల అధ్యక్షుడు శ్రీపురం శ్రీమన్నారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎరుకల గణపతి, వివిధ మండలాల అధ్యక్షులు బొమ్మన భాస్కర్ రెడ్డి మల్కా మోహన్ రావు, జిల్లా ఉపాధ్యక్షులు ఆకుల శ్రీధర్ బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి రంజిత్, మండల ప్రధాన కార్యదర్శులు బొల్లం కిషన్, మంథని రాజేందర్, బిజెపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్లు బాగు చేయండి బిజెపి డిమాండ్

**జనగామ ఫిబ్రవరి 07(ప్రజామంటలు):** జనగామ మండలం మరిగడి, గానుగుపహాడ్ మద్యన రోడ్డు, చిటాకొడుర్ వాగులో వున్న బిడ్జి జనగామ నుండి నర్మెట్ట వేళ్ళు దారిలో వడ్లకొండ దాటిన తర్వాత రోడ్డు పూర్తిగా ధ్వంసం అయిందని బిజెపి నియోజకవర్గ కన్వీనర్ బల్ల శ్రీనివాస్ రావు అన్నారు. జనగామ మండలంలో పెద్దపహాడ్ గ్రామంలో మంగళవారం జరిగిన మండల కార్యవర్గ సమావేశం మండల అధ్యక్షులు బండారి తిరుపతి యాదవ్ అధ్యక్షతన జరగగా మాట్లాడుతూ.... రోడ్ల ను జనగామ నియోజకవర్గ ఎమ్మెల్యే వెంటనే సంబంధిత అధికారులను సమావేశ పరచి వివిధ గ్రామాలలో వున్న రోడ్ల సమస్యలను పరిష్కరించాలని, లేని యెడల రానున్న రోజులలో అంచలంచెలుగా ఆందోళన చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి సౌద రమేష్,జిల్లా కిసాన్ మోర్చ ప్రధాన కార్యదర్శి సరికొండ విజయ్ భాస్కర్ రెడ్డి, నియోజకవర్గ లీగల్ సెల్ కన్వీనర్ గుండెల్లి రాజశేఖర్ యాదవ్ జిల్లా బిజెపి ఉపాధ్యక్షులు బెజడి బీరప్ప యువమోర్చ జిల్లా అధ్యక్షులు సానబోయిన మహిపాల్,నియోజకవర్గ, బిజెవైఎం కన్వీనర్ ఈర్ల నవీన్,గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షులు బానోత్ రామ్ కోటి, మండల ప్రధాన కార్యదర్శి లద్దునూరి మహేష్ యాదవ్, వజ్జ రవి యాదవ్ పాల్గొన్నారు.



### శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయ

## చైర్ పర్సన్ పదవి ఎవరికి దక్కనో

**ఈసారైనా మాకు అవకాశం దక్కేనా**

**అంటూ గౌడ కుల యువత పడిగాపులు**

**హుస్నాబాద్ ఫిబ్రవరి 07 (ప్రజామంటలు):** సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని ప్రసిద్ధి గాంచిన శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయ పాలకవర్గ పదవి కాలం ఆరు నెలలుగా ముగిసింది. రేణుక ఎల్లమ్మ గౌడ కులస్తుల ఇలవేల్పుగా ప్రసిద్ధి అయితే ఇదివరకు ఉన్న దేవాలయ చైర్మన్ ను పాలకవర్గాన్నే తిరిగి కొనసాగిస్తారని వదంతులు వినిపిస్తున్నాయి. దీంతో ఇన్ని రోజులుగా దేవాలయ అభివృద్ధికి అహర్నిశలు పాటుపడుతున్న పలువురిలో నిరుత్సాహం నెలకొంది. దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తున్న తమకు తగిన గుర్తింపు ఇవ్వడం లేదని పలువురు ఆవేదన చెందుతున్నారు. పాత పాలకవర్గాన్ని కొనసాగించకుండా దేవాలయ అభివృద్ధికి పాటుపడుతున్న వారిని గుర్తించి తగిన ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే సతీష్ కుమార్ దృష్టిలో ఉంచుకొని ఈసారి తప్పకుండా కొత్తవారికి అవకాశాన్ని కల్పించాలని యువత కోరుతున్నారు.



## పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

### జెడ్పిటిసి సభ్యులు గీకురు రవీందర్

**చిగురుమామిడి జనవరి 07 (ప్రజామంటలు):** చిగురుమామిడి మండలం ఇందుర్తి గ్రామంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను స్థానిక జడ్పిటిసి సభ్యులు గీకురు రవీందర్ పర్యవేక్షించారు. మన ఊరు-మన బడి కార్యక్రమంలో 17.00



లక్షలతో ప్రహరీ గోడ పనులు కొనసాగుతున్నాయి. అంతేగాక ఉపాధి హామీ నిధులతో 12 లక్షలతో గ్రామ సంత కూరగాయల మార్కెట్ ఏర్పాటు కోసం స్థానిక సర్పంచి అందె స్వరూపతో కలిసి స్థల పరిశీలన చేశారు. ఇటీవల గౌరవ శాసన సభ్యులు వొడితెల సతీష్ కుమార్ అభివృద్ధి పనుల సమీక్ష సమావేశంలో పనులు సకాలములో ప్రారంభించి,పూర్తి చేయాలని ఆదేశించారు. వారి ఆదేశానుసారం ఇందూర్తి హెల్త్ సబ్ సెంటర్ పనులు ప్రారంభించాలని గుత్తేదారుతో మాట్లాడి పనులు ప్రారంభించే ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమములో స్థానిక సర్పంచ్ అందే స్వరూప, ఉప సర్పంచ్ తోట సతీష్, సింగిల్ విండో డైరెక్టర్ అందె స్వామీ, భీమారం మల్లేశం, ఇజిఎస్ ఈసీ రాజయ్య, పంచాయితీ కార్యదర్శి వెంకట రమణారెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### బడ్జెట్‌లో జీరో కేటాయింపులపై

## మండిపడుతున్న గల్ఫ్ కార్మికులు

**జగిత్యాల ఫిబ్రవరి 07 (ప్రజామంటలు):** ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్ లో గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి బిఆర్ఎస్ ప్రభుత్వం ఎలాంటి కేటాయింపులు చేయలేదని, దీనిపై ప్రతిపక్షాలు కూడా మాట్లాడటం లేదని గల్ఫ్ జెఏసి చైర్మన్ గుగ్గిల్ల రవిగౌడ్ అన్ని రాజకీయ పార్టీలకు మంగళవారం ఒక బహిరంగ లేఖ రాశారు. బడ్జెట్ లో జీరో కేటాయింపులు చేశారు కాబట్టి మేము కూడా జీరో అనే పదంపై దృష్టి పెట్టాము. జీరో బడ్జెట్ పొలిటిక్స్ చేద్దామని అనుకుం టున్నామని ఆయన అన్నారు. మీ జీవితంలో ప్రతిదీ రాజకీయమే నిర్ణయిస్తున్నప్పుడు, మీ భవిష్యత్తు రాజకీయాలు ఎలా ఉండాలో నిర్ణయించుకోండి, అనే సూక్తి ప్రకారం గల్ఫ్ కార్మికుల సమస్యకు రాజకీయ పరిష్కారం కోసం ఆలోచిస్తున్నారు. గల్ఫ్ కార్మికుల రాజకీయ వేదిక ఏర్పాటు దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో




అత్యధిక గల్ఫ్ వలసలు ఉన్న ఈ క్రింద 13 అసెంబ్లీ నియోజకవర్గాలను మొదటి బ్యాచ్ లో ఎంపిక చేయాలని సూచనలు వచ్చాయి. ఒక మోస్తరు గల్ఫ్ వలసలు ఉన్న మరిన్ని అసెంబ్లీ నియోజకవర్గాలను రెండవ బ్యాచ్ లో ఎంపిక చేస్తామని రవిగౌడ్ తెలిపారు. 1. నిర్మల్, 2. ముధోల్, 3. ఖానాపూర్ (ఎస్టీ), 4. వేములవాడ, 5. సిరిసిల్ల, 6. చొప్పదండి (ఎస్సీ), 7. బాల్కొండ, 8. ఆర్మూర్, 9. కోరుట్ల, 10. జగిత్యాల, 11. ధర్మపురి (ఎస్సీ), 12. ఎల్లారెడ్డి, 13. కామారెడ్డి.

## కేంద్ర మంత్రి గడ్కరీని కలిసిన ఎంపీలు

### నాగేశ్వరరావు, రవిచంద్ర, పార్థసారథి రెడ్డి, ఎమ్మెల్యే వెంకటవీరయ్య

**న్యూ ఢిల్లి ఫిబ్రవరి 07 (ప్రజామంటలు):** సత్తుపల్లి మీదుగా వెళ్లే జాతీయ రహదారుల వెంట డ్రైన్స్ మంజూరు చేయాల్సిందిగా వినతిపత్రం సమర్పన. శాలువాతో గడ్కరీకి సత్కారం ఖమ్మం జిల్లాలోని తన నియోజకవర్గం సత్తుపల్లి మీదుగా వెళ్లే జాతీయ రహదారులను మరింత విస్తరించాల్సిందిగా, రోడ్లకిరువైపులా డ్రైన్స్ మంజూరు చేయాల్సిందిగాకోరుతూ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య



లోకసభలో బీఆర్ఎస్ పక్ష నాయకులు నామా నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర,బండి పార్థసారథి రెడ్డిలతో కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కలిసి వినతిపత్రం అందజేశారు. ఢిల్లీలో మంగళవారం మధ్యాహ్నం వారు గడ్కరీతో సమావేశమై తమ తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం జిల్లా గుండా వెళ్లే జాతీయ రహదారులు, వాటి విస్తరణ, కొత్తగా కట్టిన కలెక్టరేట్ వద్ద అలైన్మెంట్ మార్పు,డ్రైన్స్ మంజూరు చేయాల్సిన అవసరం గురించి వివరించారు.ఎంపీలు, ఎమ్మెల్యే తన దృష్టికి తెచ్చిన అంశాలను మంత్రి సావధానంగా విని సానుకూలంగా స్పందించారు, ఇందుకు సంబంధించి అధికారులకు తగు ఆదేశాలిచ్చారు. ఈ సందర్భంగా వారు గడ్కరీకి ధన్యవాదాలు తెలుపుతూ శాలువాతో సత్కరించారు.

# వైద్యరంగానికి బడ్జెట్ కేటాయింపులు బేష్

### టీజీజీడీఏ గాంధీ యూనిట్ నేతల హర్షం

**సికింద్రాబాద్ ఫిబ్రవరి 07 (ప్రజామంటలు):** రాష్ట్రంలోని ప్రజల వైద్య అవసరాలకు ఈ సారి వార్షిక బడ్జెట్ లో ప్రభుత్వం రూ.12,161 కోట్లు కేటాయించడం పట్ల తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం (టీజీజీడీఏ) గాంధీ ఆసుపత్రి యూనిట్ ప్రెసిడెంట్ ప్రొ. ఎస్. రాజేశ్వర్ రావు, జనరల్ సెక్రటరీ డా. భూపేందర్ రాథోడ్, ట్రెజరర్ డా. రవి లు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. కేసీఆర్ కిట్ లకు రూ 443 కోట్లు, ఆరోగ్యశ్రీ/ఈ.హెచ్.ఎస్ లకు రూ 1463 కోట్లు, ఆరోగ్య రంగానికి ఎఫ్ సీ గ్రాంట్ లకు రూ 441 కోట్లు, కేసీఆర్ న్యూట్రిషనల్ కిట్ లకు రూ 200 కోట్లు కేటాయించడం పట్ల వారు ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్ రావు, హెల్త్ మినిస్టర్ టి. హరీష్ రావు లకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల ఆరోగ్య సంరక్షణ, ఆసుపత్రుల నిర్వహణకు ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని ఈ బడ్జెట్ ప్రతిబింభించిందని వారు పేర్కొన్నారు. ఆరోగ్య తెలంగాణ లక్ష్యసాధనలో ప్రభుత్వానికి తెలంగాణ ప్రభుత్వ వైద్యుల అసోసియేషన్ ఎప్పటికీ అండగా ఉంటుందన్నారు. ఆరోగ్య రంగంపై పూర్తి అవగాహన కలిగి ఉన్న యంగ్, డైనమిక్ మినిస్టర్ టి.హరీష్ రావు సూచనలను పాటిస్తూ, ప్రజలకు సంపూర్ణ వైద్య సౌకర్యాలు కల్పించడంలో తమ వంతు పాత్ర పోషిస్తున్నామని ప్రొ. ఎస్. రాజేశ్వర్ రావు, డా. భూపేందర్ రాథోడ్, డా. రవి లు పేర్కొన్నారు.



# ఘనంగా స్వపరిపాలన దినోత్సవం

**జనగామ ఫిబ్రవరి 07 (ప్రజామంటలు):** విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని ఎంపీపీ కళింగరాజు అన్నారు. మంగళవారం షామీర్ పేట గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ కళింగ రాజు మాట్లాడుతూ.... విద్యార్థులు అన్ని




రంగాలలో రాణించాలని, ఉన్నత స్థాయిలో స్థిరపడాలని అన్నారు. విద్యార్థులు తమ బాధ్యతలను చక్కగా నిర్వహించారని తెలియజేశారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల గురువుల పట్ల గౌరవం, సమాజం పట్ల అవగాహన పెరుగుతుందన్నారు. ఎం.ఈ.ఓ. గా తాండ్ర ఉత్తేజ్, హెచ్.ఎం. గా పత్తి సహస్ర, ఉపాధ్యాయులుగా అక్షయ, గిరిజ, పావని, సింధు, రిషిక, స్వర్ణిక, సారిక, సాయి వర్షిత, సంజన, గౌతం కృష్ణ, నందకిషోర్, సృజన్ సాయి, రామ్ చరణ్, కౌశిక్ వివిధ తరగతుల విద్యార్థులకు బోధన చేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో గ్రామ సర్పంచ్ తాండ్ర స్వరూప మాట్లాడుతూ.... తోటి విద్యార్థులకు పాఠాలు బోధించడం ద్వారా వారి సృజనాత్మకత వెలువడుతుందని ఉపాధ్యాయుల పట్ల గౌరవం పెరుగుతుందని అన్నారు. తదనంతరం ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఎం.సి. చైర్ పర్సన్ సోమనబోయిన అశ్విని, తాండ్ర డానియల్ ప్రధానోపాధ్యాయులు కటకం సుధీర్ రెడ్డి ఉపాధ్యాయులు ఫాతిమా మేరీ, ఉమాదేవి, జడ్జిగా కే. పద్మ. ఎస్.ఎ. విద్యార్థులు పాల్గొన్నారు.

## అమరావతి విషయంలో
# కోర్టు పరిధి దాటింది..

### ఈ మాట అన్నది ఎవరంటే!

వైసీపీ ఎంపీ కీలక నాయకుడు వి. విజయసాయి రెడ్డి నోరు జారారు. అది కూడా ఏపీ హైకోర్టుపైనే కావడం గమనార్హం. తాజాగా ఆయన రాజ్యసభలో మాట్లాడుతూ.. హైకోర్టు విషయంపై తీవ్ర విమర్శలు చేశారు. ఏపీ రాజధాని అమరావతి విషయంలో రాష్ట్ర హైకోర్టు పరిధి దాటి ప్రవర్తించిందని అన్నారు. రాజధాని ఎక్కడ ఏర్పాటు చేయాలో రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉందని.. కానీ హైకోర్టు రాష్ట్రానికి అసలు శాసనాధికారం లేదని తీర్పు ఇచ్చిందని సాయిరెడ్డి వ్యాఖ్యానింరు. అయితే.. సాయిరెడ్డి ఈ వ్యాఖ్యలు చేసే సమయంలో రాజ్యసభ చైర్మన్.. ఆయనను వారించే ప్రయత్నం చేశారు. అంతేకాదు.. మీరు చేస్తున్న అభియోగాలకు ఆధారాలున్నాయా అని రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్కడ్ విజయసాయిని ప్రశ్నించారు. అయినప్పటికీ .. సాయిరెడ్డి మాత్రం తన మానాన తను మాట్లాడు తూ పోయారు. అంతేకాదు.. తాను చేస్తున్న విమర్శల విషయంలో వెనక్కి తగ్గేది కూడా లేదన్నారు. దేశంలో రాజధాని ఒకచోట హైకోర్టు మరోక చోట ఉన్న రాష్ట్రాలు లేవా? అని విజయసాయిరెడ్డి ప్రశ్నించారు. అయినప్పటికీ.. రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేలా కోర్టులు వ్యాఖ్యలు చేస్తున్నాయన్నాయన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వలేదన్న ఆయన రాష్ట్ర విభజన జరిగిపోయి 8 సంవత్సరాలు అయినా.. ఇప్పటికీ దీని గురించి పట్టించుకోలేదన్నారు. ఈ పాపం ప్రస్తుతం అధికారంలోఉన్న బీజేపీ గతంలో విభజన చేసిన కాంగ్రెస్ పార్టీలదేనని వ్యాఖ్యానించారు. విభజన చట్టం ప్రకారం హామీలను నెరవేర్చకపోతే ఎలా? అని విజయసాయిరెడ్డి కేంద్రాన్ని నిలదీశారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తామన్న వాగ్దానాన్ని బీజేపీ మర్చిపోయిందని పార్లమెంట్ తలుపులు మూసి బిల్లు పాస్ చేశారని విమర్శించారు. ఏపీకి ప్రత్యేక హోదా ఐదేళ్లు చాలదు.. పదేళ్లు కావాలని ప్రతిపక్షంలో ఉన్న సమయంలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు డిమాండ్ చేశారని గుర్తు చేశారు. మొత్తానికి కోర్టులతో కయ్యం పెట్టుకునే దిశగానే వైసీపీ నేతలు ముందుకు సాగుతున్నారనే విమర్శలు వస్తున్నాయి



# ప్రభుత్వ జీవో నం.15 రద్దు చేయాలి

### బీర్సాని గ్రామాన్ని బుగ్గారం మండలంలోనే కొనసాగించాలి

### తహసీల్దార్ ద్వారా జిల్లా కలెక్టర్ కు విడిసి విజ్ఞప్తి

**బుగ్గారం ఫిబ్రవరి 07 (ప్రజామంటలు):** జగిత్యాల జిల్లా బుగ్గారం మండలంలోని బీర్సాని గ్రామాన్ని వెల్గటూర్ మండలంలో కలుపుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నం.15 ను రద్దు చేయాలని మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ద్వారా జిల్లా కలెక్టర్ కు బుగ్గారం గ్రామాభివృద్ధి కమిటి విజ్ఞప్తి చేసింది. ఇప్పటికే బుగ్గారం మండలం 11 గ్రామాలతో అతి చిన్న మండలంగా ఉందని, ఇందులో గల గ్రామాలను తొలగించి మరింత చిన్న మండలం గా చేయవద్దని గ్రామ అభివృద్ధి కమిటి అధ్యక్షులు నక్క చంద్రమౌళి ప్రభుత్వాన్ని, ఉన్నతాధికారులను కోరారు. గతంలో నియోజకవర్గ కేంద్రం గా, నేడు మండల కేంద్రంగా ఉన్న బుగ్గారం నేటికీ సరైన అభివృద్ధి కి నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక మంత్రి కొప్పుల ఈశ్వర్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికార పార్టీ నాయకులు ప్రత్యేక చొరవ తీసుకొని బుగ్గారం మండలాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకురావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో విడిసి కోర్ కమిటి చైర్మన్ చుక్క గంగారెడ్డి, కోశాధికారి చీగిరి అంజన్న, నక్క



రాజలింగు, కప్పల శంకర్, రాగన్న, రామన్న, ఏలేశ్వరం గౌరి శంకర్, దిండిగాల సత్యనారాయణ, కొక్కెర రాజమల్లు, రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

# మహాశివరాత్రి జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు

**జనగామ ఫిబ్రవరి 07 (ప్రజామంటలు):** మహాశివరాత్రి జాతర పర్వదినం సందర్భంగా ఏర్పాట్ల పై అధికారులు, ప్రజాప్రతినిధులతో మంగళ వారం పాలకుర్తి మాంగళ గార్డెన్లో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.... తెలంగాణ రాష్ట్రంలో ఆలయాలకు పూర్వ వైబోగం తీసుకురావడానికి ముఖ్యమంత్రి కేసీఆర్ కంకణం కట్టుకున్నారని అందులో భాగంగానే పాలకుర్తి లోని శ్రీ సోమనాధ ఆలయ అభివృద్ధి పనులు, ఎస్ఎంటి పనులు, వాల్మిడి, బోమ్మర పోతన ఆలయాల అభివృద్ధికి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక చొరవ తీసుకొని అధిక నిధులు కేటాయించారని ఆయన చెప్పారు. ఈనెల 12న ప్రారంభమయ్యే జాతర 16వ తేదీ వరకు కొనసాగుతుందని శ్రీ శ్రీ శ్రీ చండికా అమ్మవారి ప్రతిష్టాపన, తేదీ 17 నుండి 21 వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రాంగణంలో పారిశుద్ధ్యం, విద్యుత్ ఆలంకరణ, త్రాగునీరు మరుగుదొడ్లు వచ్చే భక్తులకు క్యూలైన్లు కొండపైకి రహదారి విస్తరణ భోజన వసతి తదితర అంశాలపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు భక్తులకు స్వామివారి దర్శనంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని జాతరకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సు సర్వీసులు జిల్లా నలుమూలల నుండి జాతరకు వేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ సిహెచ్ శివలింగయ్య మాట్లాడుతూ.... పాలకుర్తి శ్రీ సోమేశ్వరాలయం మహాశివరాత్రి పర్వదిన సందర్భంగా పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు ఇప్పటికే పలుమార్లు అధికారులతో సమీక్షలు సమావేశాలు క్షేత్రస్థాయి పనుల పరిశీలన చేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. అంతకుముందు మంత్రి, జిల్లా కలెక్టర్, అధికారులతో ఆలయ ప్రాంతంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య నిర్వహణపై నిర్లక్ష్యంగా



వ్యవహరించిన పంచాయతీ కార్యదర్శులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ సీతారాం, ఆలయ చైర్మన్ రామచంద్రయ్య శర్మ, ఆలయ అధికారులు ప్రజాప్రతినిధులు అన్ని విభాగాల జిల్లా అధికారులు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## 10 నుండి 25 తేదీల్లో జరిగే శక్తి కేంద్రాల
# మీటింగ్‌లను విజయవంతం చేయాలి

**నర్మెట్ట పిబ్రవరి 07 (ప్రజామంటలు):** భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు ధారవత్ రాజు నాయక్ ఆధ్వర్యంలో స్థానిక వినాయక గార్డెన్ లో మండల కార్యవర్గం సమావేశం మరియు శక్తి కేంద్ర ఇన్చార్జిల్లా సమావేశం నిర్వహించడం జరిగింది, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు బెజడి బీరప్ప, మరియు జనగామ, నియోజకవర్గ కన్వీనర్ బల్ల శ్రీనివాస్ హాజరయ్యారు అనంతరం వారు మాట్లాడుతూ.... రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు పార్టీ ని బూత్ స్థాయి లో పార్టీని బలోపేతం చేసేందుకు ఈనెల 10వ తారీఖు నుండి 25వ తారీకు వరకు బూత్ స్థాయిలో జరిగే శక్తి కేంద్ర సమావేశాలకు ప్రతి బూత్ నుండి 200 మంది తగ్గకుండా విజయవంతం చేయాలని అన్నారు. రాష్ట్ర పార్టీ ఆదేశాలకు మేరకు గ్రామాల్లో పర్యటించి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు అవగాహన కల్పించేలా బూత్ స్థాయి కార్యకర్తలు పని చేయాలని అన్నారు. టిఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న వ్యతిరేక విధానాలను ప్రజాక్షేత్రంలో ఎండగట్టే విధంగా ప్రతి బిజెపి కార్యకర్త సిద్ధంగా ఉండాలని అన్నారు. టిఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ప్రజలకు గుర్తు చేయాలని అన్నారు. రానున్న ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో మరియు జనగామ జిల్లాలో కాషాయ జెండా ఎగురవేసే లక్ష్యంగా ప్రతి కార్యకర్త బూత్ స్థాయిలో ఒక సైనికుల పనిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యదర్శి సోక్కం అనిల్, గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షులు రామకోటి, మైనార్టీ మూర్చ జిల్లా అధ్యక్షులు అఫ్జల్, బీజేవైఎం నియోజకవర్గ కన్వీనర్ నవీన్, కార్యవర్గ సభ్యులు రాజు, బిజెపి మండల ప్రధాన కార్యదర్శి పిన్నిటి శ్రీనివాస్ రెడ్డి, మండల ఉపాధ్యక్షులు ధారవత్ శ్రీనివాస్, మండల కార్యదర్శి గంగం ప్రభాకర్ రెడ్డి , నవీన్,మండల కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు జంగిటి నాగేశ్వర్, ఓబిసి మండలం



అధ్యక్షులు గోపాల చారి, బూత్ అధ్యక్షులు ఆంజనేయులు, సత్యనారాయణ రెడ్డి, ఇట్టబోయిన రాజు,కృష్ణ మూర్తి, జహంగీర్, కిరణ్, రాజు, కొమురవేల్లి, నాయకులు యాదగిరి, కిసాన్, నర్సింహ, ముకేశ్, మరియు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం
# రాష్ట్ర కమిటీ సమావేశాలు జయప్రదం చేయండి

**జనగామ ఫిబ్రవరి 07 (ప్రజామంటలు):** జనగామ జిల్లా కేంద్రంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం ముందు రాష్ట్ర కమిటీ సమావేశాలు జయప్రదం చేయాలనీ కరపత్రం ఆవిష్కరణ చేశారు. అనంతరం అధ్యక్ష,కార్యదర్శులు తూటి దేవదానం, బోట్ల శేఖర్ మాట్లాడుతూ సమావేశాలు జనగామ జిల్లా పోరాటాల గడ్డ జనగామ జిల్లా కేంద్రంలో ఫిబ్రవరి 26, 27 తేదీలలో నిర్వహిస్తామని, కెవిపిఎస్ ఆత్మగౌరవం సమానత్వం కుల నిర్మూలన అనే ఎజెండాతో 1998 అక్టోబర్ 2న ఏర్పడిందని, నాటి నుండి నేటి వరకు అనేక పోరాటాలు దళితులు బహుజనుల పక్షాన నిలబడి భరోసాగా ఉంటుంది అలాగే కేవీపీఎస్ ఏర్పడిన నుండి ఎస్సీ ఎస్టీ కమిషన్ ఎస్సీ ఎస్టీ సప్లై చట్టం దళిత స్మశానాల 1235 జీవో ప్రకారం అలాగే దళితులకు ఉచిత కరెంటు 101 యూనిట్లు రావాలని 342 జీవో అలాగే కులంతార వివాహాలు చేసుకున్న వాళ్లకు రెండు లక్షల 50 వేలు వచ్చే విధంగా 12 జీవో ప్రకారం అనేక పోరాటాలు నిర్వహించి సాధించామన్నారు. ఈ రాష్ట్ర కమిటీ సమావేశాలు దళితులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసమే సమావేశాలు నిర్వహిస్తా ఉన్నామని, సమావేశాలు జయప్రదం చేయాలని జనగామ జిల్లా ప్రజలను మేధావులను విద్యావంతులను కోరారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా నాయకులు పల్లెర్ల



లలిత బోట్ల శ్రావణ్ కుమార్, వంగపల్లి వినోద్ కుమార్, గడ్డం యాదగిరి, ఎండి అత్యా సుల్తానా, మేడ శోభ, అంతె నిఖిల్ పాల్గొన్నారు.

### కనకదుర్గమ్మ ఆలయానికి నూతన పాలకమండలి ఏర్పాటు

విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మ ఆలయానికి.. 15 మందితో కూడిన నూతన పాలకమండలిని ఏపీ ప్రభుత్వం మంగళవారం ప్రకటించింది. ఈ మేరకు 15 మంది సభ్యులతో కూడిన పేర్లను విడుదల చేసింది. ఈ పాలకమండలిలో కర్నాటి రాంబాబు, కేసరి నాగమణి, కట్టా సత్తెయ్య, బుద్దా రాంబాబు, దేవిశెట్టి బాలకృష్ణ, చింతా సింహాచలం, బచ్చు మాధవీకృష్ణ, అనుమోలు ఉదయలక్ష్మి, నిడమనూరి కల్యాణి, నంబూరి రవి, చింకా శ్రీనివాసరావు, కొలుకులూరి రామసీత, మారం వెంకటేశ్వరరావు, అల్లూరి కృష్ణవేణి, వేదకుమారిని పాలక మండలి సభ్యులుగా చేరుస్తూ ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు విడుదలయ్యాయి. ఈ 15 మంది సభ్యులు కలిసి పాలకమండలి ఛైర్మన్‌ను ఎన్నుకోనున్నారు.



## పాదయాత్ర వర్సెస్ పల్లె నిద్ర...
# కొత్త కాన్సెప్ట్ తో జగన్

ఏపీలో రాజకీయాల మధ్య పోటీ పెరుగుతోంది. తెలుగుదేశం పార్టీ పాదయాత్రను స్టార్ట్ చేయించింది. పవన్ కళ్యాణ్ బస్సు యాత్రకు సిద్ధపడుతున్నారు. చంద్రబాబు జిల్లా టూర్లు అంటున్నారు. ఇక బాకీ ఉన్నది అధికార వైసీపీ మాత్రమే. అందుకే జగన్ ఇపుడు రంగంలోకి దిగిపోతున్నారు. ఆయన కొత్త కాన్సెప్ట్ తో రెడీ అవడమే ఇక్కడ మ్యాటర్ అంటే. నిజానికి పాదయాత్ర రెండు దశాబ్దాల క్రితం నాటి కాన్సెప్ట అది ఈ రోజున పాతబడిపోయింది. పాదయాత్రను ఆధారంగా ఆయుధంగా చేసుకుని ముగ్గురు సీఎంలు అయ్యారు. వైఎస్సార్ పాదయాత్రను స్టార్ట్ చేస్తే జనాలు తాముగా తరలివచ్చారు. చంద్రబాబు నాటికి కాస్తా పార్టీ జనాలు ఎక్కువ అయ్యారు. జగన్ పాదయాత్రలో పార్టీ అతి పెద్ద కొమ్ము కాసింది. ఇక లోకేష్ పాదయాత్ర చేస్తూంటే పార్టీ జనాలకు కూడా ఇంకా కనెక్ట్ కావాల్సి ఉంది అని అంటున్నారు. పాదయాత్రలకు ఓట్లు రాలే రోజులు పోయాయని అంటున్నారు. ఎందుకంటే కొత్త ఒక వింత పాత ఒక రోత. అలా చూసుకుంటే పాదయాత్ర నేతలు చేయడం ఓట్ల కోసమే తప్ప మరేమీ కాదని జనాలకు పూర్తిగా అర్థం అవుతున్న పరిస్థితి ఉంది. పాదయాత్ర



విషయంలో జనాలు పెద్దగా ప్రభావితం అయ్యే రోజులు కావని మేధావులు అంటున్నారు. ఉండవల్లి అరుణ్ కుమార్ లాంటి వారు కూడా పాదయాత్ర చివరి ఫలితం అందుకున్నది జగన్ మాత్రమే అనేశారంటే ఆలోచించాల్సిందే. దాంతో పాదయాత్ర చూసేసిన సినిమాగా ఉంది. బస్సు యాత్ర అంటే ఎన్టీయార్ చైతన్య రథం మీద నాలుగు దశాబ్దాల క్రితమే వచ్చి జనాలను సమ్మోహనం చేశారు. దాంతో జగన్ ఇపుడు సరికొత్తగా ప్లాన్ చేస్తున్నారు. అదే పల్లె నిద్ర. ఇది నాయకులు కొందరు అపుడపుడు చేసినది తప్ప ఒక ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి తమ పల్లెకి వచ్చి రాత్రి అంతా నిద్ర చేయడం అంటే చాలా కొత్తగానే ఉంటుంది. సీఎం మా ఊళ్ళో ఉన్నారు అంటే ఆ ఫీల్ వేరుగా ఉంటుంది. ఇక సమస్యలు తాము చెప్పుకోవచ్చు అన్న ఆరాటం కూడా ఉంటుంది. రాష్ట్రాన్ని ఏలే నాయకుడు తమ ఊరిలో తమతో పాటే బస చేస్తున్నారు అంటే ఆ ఇంటరెస్టే వేరుగా ఉంటుంది. దాంతో జగన్ బాగా ఆలోచించి ఈ కొత్త కాన్సెప్ట్ ని రెడీ చేశారు అని అంటున్నారు. కాన్సెప్ట్ వరకూ హిట్టే. ఇది కనుక జనాలకు కనెక్ట్ అయితే మాత్రం పాదయాత్రలు బస్సు యాత్రలకు పక్కన పెట్టి దీని మీదనే డిస్కషన్ ఒక లెవెల్ లో ఉంటుంది. అయితే ఇక్కడ మ్యాటర్ ఏంటి అంటే జగన్ వచ్చే పల్లెలు ఎలా ఉన్నాయి. అక్కడ జనాల సమస్యలు ఎలా ఉన్నాయి. వాటికి ప్రభుత్వం గత నాలుగేళ్లలో టచ్ చేసిందా పరిష్కారం చూపించిందా అన్నది కీలకమైన అంశం. ఇక పల్లె జనాలు అంటే వారిలో అధికార పార్టీ సానుభూతిపరులే ఉండే పరిస్థితి ఉండదు విపక్షాల మద్దతుదారులూ ఉంటారు. వారు వేసే ప్రశ్నలు ఏవైనా ప్రభుత్వం లెవెల్ లో సమాధానం చెప్పాలి. వారు సంధించే వాటికి కూడా తగిన జవాబు అధికారుల నుంచి తగిన జవాబు ఉండాలి. అపుడే ఈ పల్లె నిద్ర హిట్ అవుతుంది. ఆ విధంగా డిజైన్ చేసుకుంటేనే ఏపీలో జగన్ పేరు కానీ పల్లె నిద్ర కానీ మరో మారు మారుమోగే అవకాశాలు ఉంటాయని అంటున్నారు. ఇదిలా ఉంటే జగన్ సడెన్ గా పల్లె నిద్ర అని ఎందుకు అంటున్నారు అని కూడా చర్చకు వస్తోంది. ఏపీలో రాజకీయ వేడి పెరుగుతోంది. విపక్షాలు అన్నీ రోడ్ల మీద ఉన్నాయి. వారు ఏమి మాట్లాడినా పదే పదే చెప్పే మాటలు కచ్చితంగా జనాలకు చేరుతాయి. అదే టైం లో అధికార పక్షం వైపు నుంచి పెద్దగా రియాక్షన్ లేకపోతే విపక్షం త్రాసే మొగ్గు చూపుతుంది. అలా అనుకోని డ్యామేజి జరిగే అవకాశం ఉంది అని పసిగట్టే జగన్ పల్లె నిద్ర అంటున్నారు అని చెబుతున్నారు. ఇక జగన్ సీఎం హోదాలో వచ్చి పల్లెలలో నిద్ర చేస్తే నిద్రపోయిన చాలా నిజాలు బయటకు వస్తాయని అంటున్నారు. ఇప్పటిదాకా చేసిన సర్వేలు ఒక ఎత్తు. గ్రౌండ్ లెవెల్ లో రియాల్టీస్ ఏంటి అన్నవి సీఎం కి స్వయంగా ఈ పల్లె నిద్ర ద్వారా అర్థం అవుతుంది అని అంటున్నారు. ఇక తమ పార్టీకి చెందిన నాయకులు నిద్రను లేపడానికే జగన్ పల్లె నిద్ర అంటున్నారు అని కూడా తెలుస్తున్న విషయం. నాయకులు అంతా బాగుంది అనుకుంటూ చెప్పుకుపోతున్నారు కానీ లోగుట్టు తెలుసుకోవాలంటే జగన్ పల్లెలలో విడిది చేస్తేనే వాస్తవాలు అర్థమవుతాయని అంటున్నారు. సో జగన్ పల్లె నిద్ర ప్రత్యర్థి పార్టీలకు నిద్ర లేకుండా చేయడానికి సొంత పార్టీ వారిని నిద్ర లేపడానికి అని

## ఏపీ అక్రమాలపై
# తమిళనాడుకు చంద్రబాబు లేఖ

ఏపీలో జరుగుతున్న అక్రమాలపై రాష్ట్రప్రభుత్వానికి ఎన్నిసార్లు చెప్పినా.. పనికావడం లేదని.. తన వారిని ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రోత్సహిస్తోందని..అనుకున్నారో..ఏమో.. టీడీపీ అధినేత చంద్రబాబు తాజాగా తమిళనాడు సర్కారుకు లేఖ రాశారు. ఏపీలో జరుగుతున్న అక్రమాలను అడ్డుకోవాలని.. ఆయన కోరారు. ప్రస్తుతం ఈ లేఖ ప్రాధాన్యం సంతరించుకుంది. ఏపీలో జరుగుతున్న అక్రమాలపై తమిళనాడుకు లేఖ రాయడం కూడా ఇంపార్టెంట్గా మారింది.

**లేఖలో చంద్రబాబు ఏమన్నారంటే..**

తమిళనాడు చీఫ్ సెక్రెటరీకి టీడీపీ అధినేత మాజీ సీఎం చంద్రబాబు లేఖ రాశారు. తన సొంత నియోజకవర్గం చిత్తూరు జిల్లా కుప్పం సరిహద్దుల నుంచి తమిళనాడుకు కొందరు ఏపీ అధికార పార్టీ నాయకులు బినామీల ముసుగులో గ్రానైట్ ను అక్రమంగా రవాణా చేస్తున్నారని చంద్రబాబు పేర్కొన్నారు. కుప్పం సరిహద్దులోని నడుమూరు నుంచి కృష్ణగిరికి కొత్తూరు ద్వారా వేపనపల్లికి గ్రానైట్ సరఫరా చేస్తున్నారని తెలిపారు. మోట్లచేను నుంచి వేలూరుకు గ్రానైట్ తరలిస్తున్నారని ఈ గ్రానైట్ అక్రమ రవాణాదారులపై చర్యలు తీసుకోవాలని తమిళనాడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సూచించారు. అలాగే సరిహద్దుల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేయాలని లేఖలో చంద్రబాబు కోరారు. కుప్పం నుంచి తమిళనాడు లోని క్రిష్ణగిరి వెల్లూరు జిల్లాలకు జరుగుతున్న గ్రానైట్ అక్రమ రవాణాను అడ్డుకోవాలని లేఖలో సూచించారు. శాంతిపురం కుప్పం మండలాల్లో అక్రమంగా తవ్విన గ్రానైట్ రాళ్లను రాత్రి వేళల్లో తరలిస్తున్నారని అన్నారు. చిత్తూరు జిల్లాలోని నదిమూర్ ఓ.ఎన్ కొత్తూరు మోట్ల చేను గ్రామాల మీదుగా తమిళనాడుకు గ్రానైట్ అక్రమ రవాణా జరుగుతోందని దీనిపై ఆధారాలు కూడా సేకరించామని తెలిపారు. ఏపీలోని అధికార పార్టీ నేతల ప్రమేయంతో ఈ అక్రమ రవాణా జరుగుతోందన్నారు.



# అందాల ఆరోబోతలో నిధి



మోస్ట్ బ్యూటిఫుల్ హీరోయిన్లలో నిధి అగర్వాల్ ఒకరు. ఈ ముద్దుగుమ్మ గురించి ప్రత్యేకంగా తెలుగు సినీ ప్రేమికులకు పరిచయం చేయాల్సిన అవసరం లేదు. సవ్యసాచి మూవీతో తెలుగు సినీ ప్రేమికులను పలకరించింది. అడుగు పెడుతూ పెడుతూనే కుర్రకారు గుండెల్ని పిండేసింది. ఎప్పుడూ సోషల్ మీడియాలో చురుకుగా ఉండే నిధి.. బ్యాక్ టు బ్యాక్ అదిరిపోయే ఫొటోషూట్లను పోస్ట్ చేస్తుంటుంది. అందాలు ఫోకస్ అయ్యేలా ఫోటోలకు స్టిల్స్ ఇస్తూ కుర్రాళ్లను కవ్విస్తుంటుంది. కొత్త కొత్త ఫొటోలతో రెచ్చగొడుతుంది. అవి ఎప్పుడూ నెట్టింట్లో అదిరి పోయే రేంజ్లో వైరల్ అవుతుంటాయి. అయితే తాజాగా ఓ గులాబీ కలర్ డ్రెస్లో ఎంతో క్యూట్గా అందంగా ఓ ఫొటోకు పోజు ఇచ్చింది. మీరు నన్ను ప్రేమించిన దాని కన్నా నన్ను నేను ఎక్కువ ప్రేమించుకుంటాను అంటూ క్యాప్షన్ రాసుకొచ్చింది. ఇది చూసిన అభిమానులు ఫిదా అయిపోతున్నారు. దీనికి నెటిజన్లు తెగ లైక్స్ కూడా కొడుతున్నారు. నిధి అగర్వాల్.. హైదరాబాద్‌కు చెందిన మార్వాడి కుటుంబంలో జన్మించింది. ఆమె విద్యాభ్యాసం అంతా ఇక్కడే సాగింది. ఆ తర్వాత ఆమె కుటుంబం కర్నాటకకు తరలిపోయింది. ఈ క్రమంలోనే నిధి మోడలింగ్ రంగంలోకి అడుగు పెట్టింది. 2017లో 'మున్నా మైఖేల్' అనే హిందీ సినిమా ద్వారా హీరోయిన్గా ఎంట్రీ ఇచ్చింది. చైతూ 'సవ్యసాచి' సినిమాతో తెలుగు సినీ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత అక్కినేని అఖిల్‌తో 'మిస్టర్ మజ్నూ' అనే సినిమా చేసింది. వరుసగా ఫ్లాపులు వచ్చినా నిధి అగర్వాల్కు టాలీవుడ్లో అవకాశాలు మాత్రం బాగానే వచ్చాయి. ఈ క్రమంలోనే రామ్ పోతినేని నటించిన 'ఇస్మార్ట్ శంకర్' సినిమాలో అవకాశం దక్కించుకుంది. దీని తర్వాత వచ్చిన 'హీరో' పర్వాలేదనిపించింది. ప్రస్తుతం బడా హీరోల సరసన నటించే ఛాన్స్ దక్కించు కుంటోంది. అలా ప్రస్తుతం పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ సరసన హరిహర వీరమల్లు చిత్రంలో నటిస్తోంది. క్రిష్ దర్శకత్వం వహిస్తున్నారు. త్వరలోనే ఈ చిత్రం రిలీజ్ కానుంది.



# నెట్‌ఫ్లిక్స్‌లో విడుదల కానున్న వాల్తేరు వీరయ్య

మెగాస్టార్ చిరంజీవి నటించిన 'వాల్తేరు వీరయ్య' మూవీ సంక్రాంతికి విడుదలై బాక్సాఫీస్ వద్ద భారీ హిట్ అందుకుంది. ఇప్పుడు ఈ సినిమా ఓటీటీలోకి వచ్చేందుకు సిద్ధమైంది. 'వాల్తేరు వీరయ్య' ఫిబ్రవరి 27వ తేదీ నుంచి స్ట్రీమింగ్‌కు కానున్నట్లు తాజాగా నెట్‌ఫ్లిక్స్ సంస్థ ట్విట్టర్ వేదికగా ప్రకటించింది. చిరు సరసన శృతిహాసన్ నటించగా.. మహారాజా రవితేజ కీలక పాత్ర పోషించారు.మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై తెరకెక్కిన ఈ మూవీలో బాలీవుడ్ బ్యూటీ ఊర్వశి రౌతేలా బాస్ పార్టీ స్పెషల్ సాంగ్‌లో మెరిసింది. ఈ చిత్రానికి రాక్ స్టార్ దేవీ శ్రీ ప్రసాద్ సంగీతం అందించారు. ఇప్పటికే ఈ సినిమా 25 రోజులను పూర్తిచేసుకుంది. చాలా సెంటర్స్ లో ఈ సినిమా 25 రోజులను పూర్తి చేసుకోవడం పట్ల మేకర్స్ ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

# కాంతారా సీక్వెల్‌కు ప్రయత్నాలు

కొన్ని సినిమాలను మాటల్లో వర్ణించడానికి పదాలు చాలవు. డిక్షనరి కొనుక్కొని కొత్త కొత్త పదాలను వెతుక్కోవాల్సి ఉంటుంది. అలా మాటల్లో చెప్పలేని సినిమాల్లో 'కాంతార' ఒకటి. తెలిసిన కథే కావచ్చు.. కానీ ఆ కథనే ఎంత కొత్తగా చెప్పాము అనేది దర్శకుడి ప్రతిభకు నిదర్శనం. ఈ విషయంలో వందకు వంద మార్కులు కొట్టేశాడు దర్శకుడు రిషబ్ శెట్టి. ఈ సినిమాలో రిషబ్‌శెట్టి దర్శకుడిగా ఒక మెట్టు ఎక్కితే.. నటుడిగా పది మెట్లు ఒకేసారి ఎక్కాడు. గతేడాది బిగ్గెస్ట్ హిట్లలో 'కాంతార' ఒకటి. చిన్న సినిమాగా విడుదలై బాక్సాఫీస్ దగ్గర సంచలనాలు సృష్టించింది. గతేడాది సెప్టెంబర్‌లో భారీ అంచనాల నడుమ కన్నడలో రిలీజైన ఈ సినిమా మొదటి రోజు నుండి పాజిటీవ్ టాక్ తెచ్చుకుని భారీ వసూళ్లు సాధించింది. ఈ సినిమాకు వస్తున్న ఆధరణతో అన్ని భాషల ప్రేక్షకుల నుండి భారీ డిమాండ్ ఏర్పడింది. దాంతో మేకర్స్ పలు భాషల్లోకి డబ్ చేసి రిలీజ్ చేశారు. తెలుగుతో పాటు హిందీ, తమిళ్, మలయాళ భాషల్లో ఈ చిత్రాన్ని రిలీజ్ చేశారు. ఇక రిలీజైన ప్రతి భాషలో భారీ వసూళ్ళను సాధిస్తూ డబుల్ బ్లాక్‌బస్టర్ నిలిచింది. తాజాగా ఈ సినిమాకు ప్రీక్వెల్ ఉండనున్నట్లు చిత్రబృందం ఇటీవలే ప్రకటించింది. తాజాగా దీనిపై హీరో కమ్ డైరెక్టర్ రిషబ్‌శెట్టి స్పందించాడు. ఇప్పటివరకు మీరు చూసిన కాంతార పార్ట్-2 అని, మొదటి పార్ట్ వచ్చే సంవత్సరం వస్తుందని చెప్పాడు. దీంతో ప్రీక్వెల్‌పై ఎక్కడలేని అంచనాలు క్రియేట్ అయ్యాయి. ఇన్నేళ్ల సినీ చరిత్రలో ఒక పార్ట్-2, తర్వాత పార్ట్-1 రావడం బహుశా ఇదే మొదటిసారేమో. ప్రీక్వెల్‌లో రిషబ్ తండ్రి జీవితం, ఆయన చనిపోయి ఎటెళ్లారు అనే అంశాలను చూపించబోతున్నట్లు టాక్. ఇందులో భాగంగానే రిషబ్ ఇటీవలే కర్ణాటకలోని కోస్టల్ ప్రాంతానికి వెళ్లాడట. వీలైనంత త్వరగా ఈ సినిమాను సెట్స్ మీదకు తీసుకెళ్లి, వచ్చే ఏడాది సమ్మర్‌లో రిలీజ్ చేయాలని మేకర్స్ ఎ÷-లాన్ చేస్తు?న్నారట. ఇక కాంతారకు వచ్చిన క్రేజ్‌తో ప్రీక్వెల్‌ను మరింత గ్రాండ్ స్కేల్‌లో రూపొందించాలని మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.




# శరవేగంగా టైగర్ నాగేశ్వర రావు షూటింగ్

రవితేజ చేతిలో ప్రస్తుతం మూడు సినిమాలున్నాయి. అందులో టైగర్ నాగేశ్వరరావు ఒకటి. ఈ చిత్రం ఇండియన్ రాబిన్ హుడ్‌గా పిలవబడే గజదొంగ టైగర్ నాగేశ్వరరావు జీవిత కథ అధారంగా తెరకెక్కనుంది. 70,80 దశకాల్లో నాగేశ్వరరావు ఆంధ్ర ప్రదేశ్‌లో భారీ ఎత్తున దొంగతనాలు, దోపిడీలు చేస్తూ పోలీసులకు చిక్కకుండా తప్పించుకునే వాడు. ఇలాంటి గజదొంగ కథ బయోపిక్‌గా తెరకెక్కనుంది అనడంతో ప్రేక్షకులలో ఆసక్తి నెలకొంది. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన మేజర్ అప్‌డేట్‌ను చిత్రబృందం ప్రకటించింది. టైగర్ నాగేశ్వరరావు షూటింగ్ భారీ స్థాయిలో జరుగుతుంది త్వరలోనే ఫస్ట్‌లుక్‌ను రిలీజ్ చేస్తా అంటూ నిర్మాత అభిషేక్ ఓ స్పెషల్ వీడియోను రిలీజ్ చేశాడు. పాన్ ఇండియా సినిమాగా తెరకెక్కనున్న ఈ చిత్రానికి 'కిట్టు ఉన్నాడు జాగ్రత్త' ఫేం వంశీకృష్ణ దర్శకత్వం వహిస్తున్నాడు. అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ బ్యానర్‌పై అభిషేక్ అగర్వాల్ అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాడు. జీవి ప్రకాష్ సంగీతం అందిస్తున్నాడు.మాస్ మహరాజా బోలెడన్ని ఆశలతో 'ధమాకా'తో ఇటీవలే ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. రిలీజ్ రోజున మిక్స్డ్ టాక్ తెచ్చుకుంది. కానీ ఓపెనింగ్స్ అదిరిపోయాయి. టాక్‌తో సంబంధంలేకుండా రోజు రోజుకు కలెక్షన్లు పెరుగుతూ వచ్చాయి. ఫస్ట్ వీక్‌లో బ్రేక్ ఈవెన్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం రెండు వారాల్లోనే వంద కోట్ల గ్రాస్‌ను కలెక్ట్ చేసి అందరిని ఆశ్చర్యపరిచింది. రవితేజ ఎనర్జిటిక్ పర్‌ఫార్మెన్స్, శ్రీలీల డ్యాన్సులు ప్రేక్షకులను ఫుల్ ఎంటర్‌టైన్ చేశాయి. రవితేజ కెరీర్‌లో తొలి వంద కోట్ల గ్రాస్ సినిమా ఇదే అవడం గమనార్హం.ఇదే అనుకుంటే తర్వాత వచ్చిన వాల్తేరు వీరయ్య కూడా తిరుగులేని విజయాన్ని సాధించింది. ఈ సినిమా సక్సెస్‌లో సగం క్రెడిట్ రవితేజకే దక్కుందన్న మాట వాస్తవం. చిరు పాత్రకు వంకపెట్టలేం కానీ, సోలోగా




వచ్చుంటే మాత్రం ఈ రేంజ్‌లో హిట్టయ్యేది కాదు. ఈ విషయాన్ని స్వయంగా చిరునే ఓ సందర్భంలో చెప్పాడు. ఇలా వరుస బ్యాక్ టు బ్యాక్ హిట్లు రవితేజకు మంచి ఉత్సాహాన్నిచ్చాయి. ప్రస్తుతం అదే స్పీడ్‌తో సెట్స్‌పై ఉన్న సినిమాలను పూర్తి చేస్తున్నాడు.

# సిద్ధూ జొన్నలగడ్డకు సుకుమార్ నుంచి పిలుపు





పద్నాలుగేళ్లకు పైగా ఇండస్ట్రీలో ఉంటున్నా రాని గుర్తింపు డీజే టిల్లుతో సిద్ధు జొన్నలగడ్డకి వచ్చింది. సెకండ్ వేవ్ తర్వాత సినిమాలు విడుదల చేయాలా? వద్దా? అనే సంధిగ్ధంలో ఉన్న టాలీవుడ్ దర్శక నిర్మాతలకు 'డీజే టిల్లు' సినిమా ధైర్యాన్నిచ్చింది. సిద్ధూజొన్నల గడ్డకు యూత్‌లో విపరీతమైన క్రేజ్ తెచ్చిపెట్టింది. గతేడాది మార్చి 12 చిన్న సినిమాగా విడుదలైన ఈ చిత్రం టాలీవుడ్ బాక్సాఫీస్ దగ్గర సెన్సేషన్ క్రియేట్ చేసింది. ఫస్ట్ వీకెండ్‌లోనే బ్రేక్ ఈవెన్‌ను పూర్తి చేసుకుని భారీ వసూళ్ళను సాధించింది. సిద్ధూ జొన్నలగడ్డ నటన, తెలంగాణ యాసలో చెప్పే డైలాగ్స్ యూత్‌నే కాదు ఫ్యామిలీ ఆడియోన్స్‌ను మెప్పించాయి. ప్రస్తుతం ఈ సినిమాకు సీక్వెల్ తెరకెక్కింది. ఇదిలా ఉంటే తాజాగా సిద్ధూకు సుకుమార్ స్కూల్ నుండి పిలుపు వచ్చినట్లు తెలుస్తుంది. టిల్లూ స్క్వేర్ తర్వాత సుకుమార్ ప్రొడక్షన్ హౌజ్‌లో సినిమా చేయబోతున్నట్లు సమాచారం. అంతేకాకుండా సుకుమార్ శిశ్యుడే దర్శకత్వం వహించనున్నాడని తెలుస్తుంది. దీనిపై త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది. ఇక టిల్లూ స్క్వేర్ విషయానికొస్తే సీక్వెల్ చిత్రానికి కూడా సిద్ధూ కథను అందిస్తున్నాడు. ఈ సీక్వెల్ చిత్రాన్ని కొత్త దర్శకుడు మల్లిక్‌రామ్ తెరకెక్కిస్తున్నాడు. గతంలో ఆయన తేజ సజ్జాతో 'అద్భుతం' సినిమా తీశాడు. కాగా మొదటి భాగానికి దర్శకత్వం వహించిన విమల్ కృష్ణ.. హీరోతో బేధాబిప్రాయాలు రావడంతో సినిమా నుండి తప్పుకున్నట్లు గతంలో వార్తలు వచ్చాయి.



# మరోమారు శాకుంతలం వాయిదా

టాలీవుడ్ బ్యూటీ సమంత నటిస్తున్న తాజా చిత్రం 'శాకుంతలం'. ఇందులో శకుంతలగా సమంత.. దుష్యంతుడిగా దేవ్ మోహన్ నటించారు. ఈ మూవీ ఫిబ్రవరి 17న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుందని ఇప్పటికే మేకర్స్ తెలిపారు. అయితే ఈ సినిమా ఇప్పుడు మరోసారి వాయిదా పడింది. ఈ చిత్రం 17న థియేటర్లకు రావడం లేదనీ, త్వరలోనే కొత్త రిలీజ్ డేట్ ను ఎనౌన్స్ చేస్తామని మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. గుణశేఖర్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల కానుంది.

# వసంతకోకిలలో బాబీ సింహా

ఇటీవల 'వాల్తేరు వీరయ్య'లో పని చేసిన తమిళ నటుడు బాబీ సింహా.. 'వసంత కోకిల' చిత్రంతో ప్రేక్షకుల ముందుకొస్తున్నాడు. రమణన్ పురుషోత్తమ్ దర్శకుడు. 'నర్తనశాల' ఫేమ్ కాశ్మీర పరదేశీ హీరోయిన్. రజనీ తాళ్లూరి, రేష్మి సింహా కలిసి నిర్మించిన ఈ చిత్రం ఫిబ్రవరి 10న తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో రిలీజ్ అవుతోంది. ఈ సినిమా ట్రైలర్‌ను చిరంజీవి లాంచ్ చేశారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ 'ట్రైలర్ థ్రిల్లింగ్‌గా ఉంది. క్యూరియాసిటీని పెంచుతుంది. ఇది ఒకరోజు రాత్రి జరిగే స్టోరీ. డిఫరెంట్ జానర్స్ ఇష్టపడే వారికి కచ్చితంగా నచ్చుతుంది. పెద్ద విజయం సాధించాలని కోరుతున్నా' అన్నారు.



PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE.
EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL/2021/81092.
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com